31-8-2026 సోమవారం సంపుటి: 32
సంచిక: 212 పేజీలు: 8+16 వెల: 6.50

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

మహబూబ్‌నగర్

: fb.com/vaartha Digital

epaper.vaartha.com

Published from Nalgonda, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Tadepalligudem, Srikakulam

ఉక్రెయిన్‌పై రష్యా దాడుల బీభత్సం 5

నర్సు శిరీష హత్యపై మంత్రి సీతక్క దిగ్భ్రాంతి 6

WWW.VAARTHA.COM




తాష్కెంట్‌లో ప్రధాని మోడీకి 'ఒలియ్ దరాజలీ దోస్తిలిక్'ను ప్రదానం చేస్తున్న అధ్యక్షుడు మిర్జియోయెవ్

# ప్రధాని మోడీకి ఉజ్బెక్ అత్యున్నత పురస్కారం

### తాష్కెంట్‌లో ప్రదానం చేసిన అధ్యక్షుడు మిర్జియోయెవ్

**తాష్కెంట్, ఆగస్టు 30:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. మధ్య ఆసియా దేశమైన ఉజ్బెకిస్థాన్ తమ దేశ అత్యున్నత పురస్కారమైన ఒలియ్ దరాజలీ దోస్తిలిక్ ఆర్డర్‌తో ఆయన్ను సత్కరించింది. ఆదివారం >>2



తాష్కెంట్‌లో ఒప్పంద పత్రాలు మార్చుకొంటున్న విదేశాంగ మంత్రులు

## భారత్- ఉజ్బెకిస్థాన్‌ల మధ్య ఐదు బిలియన్ డాలర్లకు ద్వైపాక్షిక వాణిజ్యం

## ఇరుదేశాల మధ్య కీలక ఒప్పందాలు.. 30 రోజులు వీసాఫ్రీ అరైవల్

**తాష్కెంట్, ఆగస్టు 30:** భారత పౌరులకు 30 రోజుల పాటు వీసా లేకుండానే ఉజ్బెకిస్తాన్ దేశంలోకి ప్రవేశించే అవకాశం కల్పించింది. ప్రధాని మోడీ ఉజ్బెకిస్థాన్ పర్యటన సందర్భంగా ఈ నిర్ణయం వెలువడింది. ఈ చర్యతో పర్యాటకం, వ్యాపార సంబంధాలు, ఇరు దేశాల ప్రజల మధ్య పరస్పర >>2

## దేశ వ్యాప్తంగా నీట్ పరీక్ష

# ప్రశాంతం

### రాజస్థాన్‌లో 2 చోట్ల విద్యుత్ అంతరాయం

### సెప్టెంబర్ 5కు వాయిదా

### రంగారెడ్డిలో ఓ విద్యార్థి మద్యం తాగి హాజరు



ఆదివారం హైదరాబాద్‌లో ఓ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు30:** దేశ వ్యాప్తంగా నీట్-పీజీ 2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. సుమారు 2లక్షల 73 వేల 183 మంది అభ్యర్థులు వైద్య ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ సంస్థ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటి) విధానంలో నిర్వహించింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష నిర్వహించారు. తెలంగాణలో 14 జిల్లాల్లో 56 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో అక్రమాలకు తావు లేకుండా సీసీ కెమెరాలు,బయోమెట్రిక్ విధానం,సిగ్నల్ జామర్లతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మొత్తం 180 ప్రశ్నలకు 210 నిమిషాల సమయం కేటాయించారు. నీట్‌పిజీ పరీక్షకు తమిళనాడు, ఢిల్లీ, ఉత్తర్ ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌తో సహాపలు నగరాల్లోని విద్యార్థులు హాజరయ్యారు. ఉన్నత వైద్య కోర్సుల్లో ప్రవేశాలు పొందడం కోసం ఈ పరీక్షను నిర్వహిస్తారు. కాగా, రాజస్థాన్‌లోని జైపూర్ 2పరీక్ష కేంద్రాల్లో >>2



తెలంగాణలో యేడాదికి 923.8 మి.మి వర్షం పడుతోంది. అత్యధికంగా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు నైరుతి రుతుపవనాల వల్ల 740.6 మి.మి కురవడం రివాజు. ఎల్‌నినో ప్రభావంతో ఈ యేడు 48 వర్షపు రోజులు నమోదైనప్పటికి 469.7 మి.మి వర్షపాతం మాత్రమే నమోదైంది. ఆగస్టులో 558 మి.మి వర్షం నమోదు కావాల్సి ఉన్నప్పటికి 34శాతం తక్కువ వర్షపాతం నమోదైంది.

# నీరులేని కారు మబ్బులు!

### సాగునీరు రాదు.. తాగునీరు లేదు

### ఇంకిపోతున్న ప్రాజెక్టులు

### ఆగస్టులో 34 శాతానికి లోటు వర్షపాతం

### కృష్ణా, గోదావరి ప్రాజెక్టుల్లో 62.6% నీరు రాక

### గతేడాది కళకళలాడిన చెరువులు

### ప్రస్తుతం వట్టిపోయి వెలవెల

### ఎల్‌నినో ప్రభావంతో రైతులు లబోదిబో

**హైదరాబాద్, ఆగస్టు 30,ప్రభాతవార్త:** తెలంగాణలో మేఘాడంబరంతో ఆకాశం కనువిందులు చేస్తున్నా పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన గాడ్జిల్లా ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ప్రధాన రిజర్వాయర్లు, మధ్యతరహా,చిన్నతరహా రిజర్వాయర్లు చెరువులలో ఆశించిననీటి మట్టం పెరగకపోవడంతో సాగు,తాగునీటి భవిష్యత్ అవసరాలపై అనిశ్చితి మొదలైంది. తెలంగాణలో సంత్సరానికి 923.8 మి.మి వర్షం సాధారణంగా పడుతోంది. అత్యధికంగా జూన్‌నుంచి సెప్టెంబర్ వరకు నైరుతి రుతుపవనాల వల్ల 740.6 మి.మి కురవడం రివాజు. ఎల్‌నినో ప్రభావంతో ఈ యేడు ఇప్పటి వరకు 48 వర్షపు రోజులు నమోదైనప్పటికి 469.7మి.మి వర్షపాతం మాత్రమే నమోదైంది. సాధారణంగా ఆగస్టు నెలలో 558 మి.మి వర్షం ఆదివారం వరకు నమోదు కావాల్సి ఉన్నప్పటికి 34శాతం తక్కువర్షాపాతం నమోదైంది. పోయిన యేడాదితో పోల్చి చూస్తే ఈ యేడాది 65శాతం తక్కువ వర్షం కురిసింది. జూన్‌లో సాధారణంగా 130.3మి.మి వర్షంకురువాల్సి ఉండగా గతయేడాది 104.2 ఎం.ఎం వర్షం కురిస్తే ఈ యేడాది ఎల్‌నీనో ఉందని వాతావర్ణ నిపుణులు భయపెట్టినా 115.3వర్షం కురిసింది. గత యేడాది కంటే 11శాతం అధికంగా వర్షపాతం నమోదు కావడంతో రైతులు, వాణిజ్య,వ్యాపారులు అంతా సంతోష పడ్డారు.జులై నెలలో 227ఎం.ఎం సాధారణంగా పడాల్సి ఉండగా 224 ఎంఎం వర్షం కురిసింది. సాధారణ వర్షం కంటే ఒక శాతం >>2



# కేబినెట్‌లో మార్పులకు సిద్ధం!

### అసంతృప్తులకు తాయిలాలు

### రాజగోపాల్‌కు మంత్రి పదవి ఖాయం?

**హైదరాబాద్, ఆగస్టు 30,ప్రభాతవార్త:** తెలంగాణలో సెప్టెంబర్ మొదటి వారంలో మంత్రి మండలి పునర్వ్యవస్థీకరణ జరుగుతోందని ఊహాగానాలు ఊపందుకొన్న వేళ కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ తన సన్నిహితులతో మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో అసంతృప్తులకు ఒక చక్కటి పరిష్కారం లభిస్తుందని తెలిపినట్లు ప్రచారం జరగడంతో అధికార పార్టీలోని ఔత్సాహికులకు కొత్త ఉత్సాహం వచ్చింది. టిపిసిసి మహేష్‌కుమార్ కాంగ్రెస్‌లోని సమస్యలన్నింటికి సెప్టెంబర్ నెలలో పరిష్కారం లభిస్తోందని,కొమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామిఇచ్చిన మాట వాస్తవమేనని ఆయన తన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు కాంగ్రెస్ శ్రేణులు ఆసక్తిగా చర్చించుకొంటున్నారు.కొంత మంది కాంగ్రెస్ నాయకులు ఒక అడుగు ముందుకు వేసి సెప్టెంబర్‌లో మంత్రివర్గ విస్తరణ ఖాయమని కొందరిని పక్కనబెట్టడం మరొకొంత మంది కొత్తవారికి అవకాశం కల్పించడం జరుగుతోందని ఎవరెవరు మంత్రి వర్గం నుంచి బయటకు పోతారు కొత్తగా ఎవరు బెర్త్ సంపాదించుకొంటారని ఊహాగానాలు చేస్తూ చర్చ జరుపుతున్నారు. రాజగోపాల్‌రెడ్డి చోటు దక్కడం ఖాయమని కొంత మంది విశ్లేషిస్తున్నారు. ప్రభుత్వం వచ్చి దాదాపు మూడేళ్ళ కావొస్తుండటంతో నామినేటెడ్ పదవులు కూడా ఈనెలలో భర్తీ చేసేందుకు కసరత్తు ప్రారంభించే అవకాశం ఉందని కూడా చర్చించుకొంటున్నారు. తెలంగాణ కాంగ్రెస్‌లో ఇటీవల నేతల మధ్య దూరం పెరగడం అసంతృప్తి బహిరంగ వేదికలపైనే వెళ్ళగక్కడంతో పార్టీ క్రమశిక్షణ కమిటీ కూడా చర్యలు తీసుకోవడానికి నివేదికలు తయారించి అదిష్టానంకు నివేదిస్తోన్నది. ఇతర పార్టీలనుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు >>2

## హైదరాబాద్ చేరుతున్న

# నేపాల్ బాధితులు



### తెలంగాణకు చెందిన వారి ఆచూకీ, మృతదేహాల గుర్తింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు30:** నేపాల్‌లో సంభవించిన వరద విపత్తు నేపథ్యంలో తెలంగాణకు సంబంధించిన వ్యక్తుల ఆచూకీ, వారి సురక్షిత తరలింపు, అలాగే పార్థివదేహాల గుర్తింపు మరియు స్వదేశానికి తరలింపు అంశాలపై తెలంగాణ భవన్ అధికారులు కేంద్ర విదేశీవ్యవహారాల మంత్రిత్వ శాఖ, కాఠ్మాండూలోని భారత రాయబార కార్యాలయం, నేపాల్ పోలీసులతో నిరంతర సమన్వయం కొనసాగిస్తున్నారు. భారత విదేశాంగ శాఖ అధికారులు అందించిన వివరాల ప్రకారం, ఈనెల 29న 449 మంది భారతీయులు టిబెట్ నుంచి నేపాల్‌కు చేరుకున్నారు. ఈనెల 30న మరో 397 మందిని ఈ మార్గం ద్వారా తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ జాబితాలో తెలంగాణకు చెందిన అల్లి ఐయిలేష్ పేరు, పాస్‌పోర్టు వివరాలు తెలంగాణ భవన్ వద్ద ఉన్న రికార్డులతో సరిపోలాయి. ఆయన ప్రస్తుతం కుటుంబ సభ్యులతో సంప్రదింపుల్లో ఉన్నారని, ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకునే అవకాశముందని కుటుంబ సభ్యులు తెలిపారు.నేపాల్ ప్రభుత్వం మృతుల ఛాయాచిత్రాలు, ప్రాథమిక వివరాలను నేపాల్ పోలీసుల డిజాస్టర్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచింది. రసువా, నువాకోట్, ధాదింగ్, చిత్వన్, గోర్ఖా, తనహున్, నావల్పరాసీ తూర్పు, నావల్పరాసీ పశ్చిమ, కాఠ్మాండూ జిల్లాల్లో భద్రపరిచిన పార్థివదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. నేపాల్ పోలీసుల ప్రకారం, కుటుంబ సభ్యులు ప్రత్యక్షంగా గుర్తించగలిగిన సందర్భాల్లో డీఎన్ఏ పరీక్ష తప్పనిసరి కాదు. మృతుడితో బంధుత్వాన్ని నిర్ధారించే ఆధారాలపై పార్థివదేహాలను సంబంధిత కుటుంబాలకు అప్పగిస్తారు. ప్రత్యక్ష గుర్తింపు సాధ్యం కాని సందర్భాల్లో తల్లిదండ్రులు, సోదరులు లేదా సోదరీమణులు వంటి తొలిస్థాయి బంధువుల డీఎన్ఏ ప్రొఫైల్‌ను సరిపోల్చే ప్రక్రియ చేపడతారు. ఇందుకోసం బంధువులు తప్పనిసరిగా నేపాల్‌కు ప్రయాణించాల్సిన అవసరం లేదని, స్వస్థలంలో సిద్ధం చేసిన డీఎన్ఏ ప్రొఫైల్‌ను సమర్పించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీనికి సంబంధించిన ఈమెయిల్ విధానాన్ని నేపాల్ పోలీసులు సిద్ధం >>2

# 800కు చేరిన నేపాల్ మృతులు

### ఇప్పటికీ దొరకని 2500 మంది ఆచూకీ

**కాఠ్మాండు, ఆగస్టు 30:** పొరుగు దేశం నేపాల్‌ను భారీ వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తులు అతలాకుతలం చేస్తున్నాయి. భోటే కోశి నదికి ఆకస్మికంగా వచ్చిన వరదల కారణంగా సంభవించిన ఈ జల ప్రళయంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. నేపాల్ జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ వెల్లడించిన వివరాల ప్రకారం ఇప్పటివరకు 724 మృతదేహాలను వెలికితీయగా, మరో 2,500 మంది గల్లంతయ్యారు. వారి ఆచూకీకోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈవిపత్తు >>2



### సంక్షేమం నుంచి ప్రపంచస్థాయి తెలంగాణ

నేటికి వెయ్యిరోజుల ప్రజాపాలన

7


# మరో భారీ భూకుంభకోణం!



### హైదరాబాద్‌లో రూ. 500 కోట్ల ఆయిల్ ఫెడ్ భూములు ప్రైవేటుకు కట్టబెట్టే కుట్ర

### నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిఎం రేవంత్‌కు హరీష్‌రావు లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు30:** కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ అజామాబాద్‌లో సుమారు రూ.500 కోట్ల విలువైన ప్రభుత్వ తెలంగాణ ఆయిల్‌ఫెడ్ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేసిందని ఆరోపిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు ఆదివారం బహిరంగ >>2





తాష్కెంట్‌లో ఆదివారం నిర్వహించిన యోగా శిబిరంలో ప్రధాని మోడీ

# ప్రధాని మోడీకి ఉజ్బెక్ అత్యున్నత పురస్కారం

>> తాష్కెంట్‌లో జరిగిన కార్యక్రమంలో ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్ ఈ పురస్కారాన్ని మోదీకి ప్రదానం చేశారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. ఈ పురస్కారంతో, ప్రధాని మోడీ ప్రపంచవ్యాప్తంగా అత్యధిక అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న భారత నేతగా తన రికార్డును మరింత పదిలం చేసుకున్నారు. ఇప్పటివరకు ఆయన 30కి పైగా ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. గత జులైలోనే ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఆ దేశ అత్యున్నత పురస్కారం బింటాంగ్ ఆదిపుర్నను మోడీకి బహూకరించిన విషయం తెలిసిందే. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఉజ్బెకిస్థాన్ వెళ్లిన ప్రధాని మోడీకి తాష్కెంట్‌లో ఘన స్వాగతం లభించింది. అధ్యక్షుడు మిర్జియోయెవ్ స్వయంగా మోడీకి స్వాగతం పలికారు. అనంతరం ఇరు నేతల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు జరిగాయి.

ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తన పర్యటనలో భాగంగా, ప్రధాని మోడీ ఓ ప్రత్యేక యోగా సెషన్‌ను వీక్షించారు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన 52 మంది యోగా అభ్యాసకులు ఇందులో పాల్గొన్నారు. వారి ప్రదర్శనను ప్రశంసించిన మోడీ, ఉజ్బెకిస్థాన్‌ను యోగాతో అనుసంధానిస్తున్నందుకు అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఉజ్బెకిస్థాన్ యోగాను ప్రేమిస్తోంది అంటూ ఈ వీడియోను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు.

ఈ ఏడాది జూన్‌లో అహ్మదాబాద్‌లో జరిగిన ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ఆరుగురు క్రీడాకారులు కూడా ఈ ప్రదర్శనలో ఉండటం విశేషం. కాగా గతంలో ఉజ్బెకిస్తాన్‌అత్యున్నత పురస్కారాన్ని చైనా అధినేత జిన్ పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లు కూడా అందుకున్నారు. వీరితోపాటు అజర్‌బైజాన్‌ఇల్హామ్ అలీవ్,తుర్క్‌మెనిస్తాన్ సెర్దార్ బెర్దిముహమెదో, కాస్సిమ్ జోమార్ట్ టోకాయెవ్ కజకిస్తాన్ అందుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల ప్రతినిధి బృందాల మధ్య ఉన్నత స్థాయి దౌత్య చర్చలు పూర్తయ్యాయి. వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ కనెక్టివిటీ, రక్షణ, ఇంధన రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తృతం చేసుకోవడానికి అనువైన మార్గాలపై ఇరు దేశాల అధినేతలు సుదీర్ఘంగా చర్చించారు.

# మార్పులకు సిద్ధం!

>> మొదలుకొని సొంత పార్టీ ఎమ్మెల్యేలు మంత్రులు ప్రభుత్వం పట్ల శాసనసభ నాయకుడిపై వ్యాఖ్యలు చేస్తున్నారు. దీనితో టిపిసిసి చీఫ్ కూడా వారిని క్రమశిక్షణతో ఉండాలని హెచ్చరికలు కూడా చేస్తున్నారు. కాంగ్రెస్ ఇలాంటి వైఖరి ఉండటం సహజమైనదిగానే టిపిసిసి చీఫ్ మీడియా ముందుకు వచ్చినప్పుడు సమర్థించుకొంటున్నారు.

కాంగ్రెస్ అనేది ఒక మహాసముద్రం లాంటిది ఇక్కడ నేతలకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుందని దాంతోపాటు క్రమశిక్షణ కూడా ఉంటుందని మహేష్‌కుమార్ తరుచుగా అభిప్రాయడుతారు. కొండసురేఖ, చిన్నారెడ్డి వ్యవహారంపై ఇటీవల క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి ఇచ్చిన నివేదికను హైకమాండ్‌కు మహేష్ పంపిచడమే కాకుండా వారిపై చర్యలు అదిష్ఠానంచూసుకొంటుందని మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. రాజకీయాల్లో ఓపిక అవసరం అని మహేష్‌కుమార్ బలంగా నమ్ముతారు. తెలంగాణ కాంగ్రెస్‌లోని చిన్నపాటి సమస్యలకు ఓపిక తోనే పరిష్కారం లభిస్తోందని నేతల అసంతృప్తికి, నామినేటెడ్ పదవులు కోరుకొనేవారికి సెప్టెంబర్ నెలలలో పరిష్కాం దొరకుతొందని ఆయన తన సన్నిహితులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ అన్నట్లు తెలిసింది, ఏదీఏమైనా పార్టీ విభేధాలు సరిదిద్ది, అందరిని సమన్వయం చేసుకొంటూ టిపిసిసి చీఫ్ ముందకు వెళ్ళుతున్నారు.

# రాష్ట్రంలో ఆదివారం వివిధ ప్రమాదాల్లో ఏడుగురు మృతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు30:** తెలంగాణ రాష్ట్రంలో వివిధ ప్రమాదాల్లో ఆదివారం ఏడుగురు చనిపోయిరారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బుచ్చిరెడ్డిపాలెంలో విషాదం చోటుచేసుకుంది. మట్టి లోడుతో వెళ్తుండగా ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు మృతి చెందారు. చనిపోయిన వారిని బుచ్చిరెడ్డిపాలెం వాసి నాగరాజు, కొత్తపల్లి గ్రామవాసి రమేశ్‌గా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాలను పోస్ట్ మార్టమ్ కోసం తరలించారు.వికారాబాద్ జిల్లా పరిగి మండలం చింతల్ చెరువు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది.

లారీని వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. చనిపోయిన వారిని దోమ మండలం కిష్టాపూర్ వాసులుగా గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ములుగులోని గణేశ్‌రావుపల్లిలో విషాద ఘటన జరిగింది. చెరువు వద్దకు వెళ్లి అందులో జారిపడి ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందారు. చనిపోయిన ఇద్దరిని వినయ్(15), రాజేశ్(12)గా గుర్తించారు. వికారాబాద్ జిల్లా తాండూరులోని ఓ లాడ్జిలో వ్యక్తి మృతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తాండూరు మండలం కొల్లాపూర్‌కు చెందిన దశరథరెడ్డి 5 రోజుల క్రితం లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. శనివారం నుంచి బయటికి రాకపోవడంతో ఆదివారం సిబ్బంది గదిని తెరిచి చూశారు. దశరథరెడ్డి చనిపోయి ఉండటం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి మృతదేహన్ని పోస్ట్ మార్టమ్ కోసం తరలించి దర్యాప్తు చేపట్టారు. కరీంనగర్ జిల్లా గంగాధరలో ప్రమాదం చోటుచేసుకుంది. కూలీలతో వెళ్తున్న ఆటోను ఓ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు కూలీలకు తీవ్రగాయాలు కాగా, క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు.

# పరీక్ష ప్రశాంతం

>> జరగాల్సిన పరీక్షలను వాయిదా వేశారు. విద్యుత్ అంతరాయంతో పరీక్షలు సజావుగా జరగలేదని, తిరిగి సెప్టెంబర్ 5న పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం 3 గంటలకు రీటెస్ట్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నాయి. పరీక్షా కేంద్రం, సవరించిన అడ్మిట్ కార్డులతో సహా తదుపరి వివరాలు విడిగా తెలియజేస్తామని ప్రకటించాయి. రీ షెడ్యూల్ చేసిన పరీక్ష కేంద్రాల్లో దాదాపు 300 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఇదిలా ఉండగా, రంగారెడ్డి జిల్లా శేరిగూడలోని ఒక పరీక్షా కేంద్రానికి ఓ విద్యార్థి మద్యం తాగి హాజరయ్యాడు. కేంద్రం వద్ద తనిఖీలు చేపట్టిన అధికారులు అతడు మద్యం సేవించినట్లు గుర్తించారు. పరీక్షా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించడంతో అతడిని పరీక్ష రాయడానికి అనుమతించకుండా వెనక్కి పంపించివేశారు. రాజస్థాన్‌లో సాంకేతిక సమస్యల కారణంగా పరీక్షకు అంతరాయం కలిగిందని ఆరోపిస్తూ, సీతాపురలోని ఒక పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. "నేను పరీక్ష రాయడానికి ఇక్కడికి వచ్చాను. పరీక్ష మొదలవ్వకముందే సిస్టమ్ పదేపదే ఆగిపోతూ వచ్చింది. రెండు నిమిషాలు పనిచేసి, ఆ తర్వాత ఆగిపోయింది. ఇలా కనీసం 20 సార్లు జరిగింది. కొద్ది సేపటికి పనిచేస్తుందేమోనని అనుకున్నాం. కానీ అది పనిచేయలేదు" అని విష్ణు శర్మ అనే అభ్యర్థి ఆందోళన వ్యక్తం చేశారు. తమ వద్ద భారీ మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నప్పుడు, దేశంలోనే అతిపెద్ద పరీక్షల్లో ఒకటైన దీనికి సరైన సదుపాయాలను కల్పించలేరా? అని అభ్యర్థులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనికి బాధ్యత వహించడానికి ఎవరూ సిద్ధంగా లేరని, పరీక్షను కేవలం తమ కేంద్రంలోనే మళ్లీ నిర్వహించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిని రద్దు చేసి దేశవ్యాప్తంగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి కోసం గ్రీన్ ఛానల్: గచ్చిబౌలి ట్రాఫిక్‌లో చిక్కుకున్న నీట్ పిజి విద్యార్థి వికాస్‌ను రాయదుర్గం పోలీసులు నిమిషాల్లో ఎగ్జామ్ సెంటర్‌కు చేర్చారు. ఉదయం మారథాన్ రన్‌లో భాగంగా గచ్చిబౌలి రాయదుర్గం మార్గంలో ట్రాఫిక్ జాం ఏర్పడింది. వికాస్ ట్రాఫిక్ చిక్కుకుపోవడంతో సైబరాబాద్ పోలీసులు ఆయన కోసం గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశారు. మారథాన్ ట్రాఫిక్‌ను దాటుకుంటూ రాయదుర్గం పోలీసులు గ్రీన్ ఛానెల్ ద్వారా వికాస్‌ను ఎగ్జామ్ సెంటర్ వద్దకు చేర్చారు. గచ్చిబౌలి రాయదుర్గం మార్గంలో మారథాన్ రన్ ఉన్నందున ట్రాఫిక్ ఉంటుందని సైబరాబాద్ పోలీసులు ముందుగానే ఊహించారు. ఎవరైనా ట్రాఫిక్‌లో చిక్కుకుపోతే కాల్ చేసేందుకు నెంబర్ కూడా ఏర్పాటు చేశారు.

## వారం - వర్జ్యం

**31-08-2026, సోమవారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**శ్రావణ మాసం, దక్షిణాయణం**
**వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బకార్తె**
తి.తదియ ఉ.8.50
న.రేవతి రా.3.22
వ.మ.3.33-సా.5.06
దు1.మ.12.32-మ.1.22
దు2. మ.3.01-మ.3.51
రాహు. ఉ.7.30-ఉ.9.00
శుభ ఉ.8.00-ఉ.9.00

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యంగా రాజకీయ, శాస్త్ర, సాంకేతిక రంగాలలోని వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. వాహన సౌఖ్యం కలదు.

**వృషభం :** వ్యాపారంలో రొటేషన్స్ బాగుంటాయి. కార్యాలయంలో మీ స్థాయి యధాతధంగా ఉంటుంది. దేవాలయ దర్శనం.

**మిథునం :** ప్రముఖ వ్యక్తి ద్వారా మీకు అనుకూలంగా వ్రాయబడిన సిఫార్స్ లేఖ చేరవలసిన చోటుకు చేరుతుంది.

**కర్కాటకం :** ఇంటా బయటా అనుకూలమైన పరిస్థితులు ఉంటాయి. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి.

**సింహం :** జీవిత భాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. ఆరోగ్య, వాహనాల విషయంలో మెలుకువ అవసరం.

**కన్య :** వృత్తిలో మీరు ఆశించిన లాభాలు వుండకపోవచ్చు. సంఘ సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**తుల :** బాధ్యతలు సక్రమంగా నిర్వహించడం వలన సంతృప్తి చెందుతారు. నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురు అవుతాయి.

**వృశ్చికం :** కుటుంబ సభ్యుల సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. పనులలో జాప్యం జరిగిన పూర్తి చేస్తారు.

**ధనుస్సు :** క్రమశిక్షణ లేని అత్యంత సన్నిహితులవలన ఇబ్బందులు వస్తాయి. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుతాయి.

**మకరం :** మీ ప్రమేయం లేకుండానే వివాదాలలోకి లాగబడతారు. క్రీడలలో వేడుకలలో పాల్గొంటారు. ధన లాభం.

**కుంభం :** సహోదర, సహోదరీ వర్గం యొక్క యోగక్షేమాలను విచారిస్తారు. వివాహ, ఉద్యోగ యత్నాలు సాగిస్తారు. వస్త్ర లాభం.

**మీనం :** విధినిర్వహణలలో మీ విలక్షణమైన శైలితో అందరినీ ఆకట్టుకుంటారు. వ్యాపార పరంగా సాధారణంగా ఉంటుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మున్సిపల్ ఎన్నికలకు జనసేన సిద్ధం

## మూడు కార్పొరేషన్లలో బరిలోకి!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు30:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వంలో భాగమైన జనసేన పార్టీ తెలంగాణలోనూ పోటీకి సిద్ధమవుతోంది. వచ్చే ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బరిలోకి దిగుతున్నామని జనసేన అధికార ప్రతినిధి తళ్లూరి రామ్ వెల్లడించారు. గ్రేటర్ హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తమ పార్టీ బలంగా పోటీ చేస్తుందని ఆదివారం ఆయన మీడియా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలోనూ పోటీకి సిద్ధమవుతున్న జనసేన పార్టీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకుంది. వచ్చే గ్రేటర్ హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీ బలంగా పోటీ చేస్తుందని ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ స్పష్టం చేశారు.

కాగా, జనసేన కార్యాలయంలో ఆదివారం జనసేన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా.. ఎన్నికల్లో పోటీకి జనసేన శ్రేణులు సిద్ధమవ్వాలని, జనసేన పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తళ్లూరి రామ్ సూచించారు.

# 800కు చేరిన నేపాల్ మృతులు

>> పర్యాటకులపైనా తీవ్ర ప్రభావం చూపింది. 589 మంది విదేశీయులతో సహా మొత్తం 753 మంది పర్యాటకులతో సంబంధాలు తెగిపోయినట్లు నేపాల్ పర్యాటక శాఖ నిన్న సాయంత్రం ప్రకటించింది. ఈ వరదల వల్ల రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. అనేక జలవిద్యుత్ ప్రాజెక్టులు, రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. బాధితులను ఆదుకోవడానికి సహాయక సామగ్రిని విరాళంగా ఇవ్వాలని స్థానిక సంస్థలు, ప్రజలను ఖాట్మండు జిల్లా యంత్రాంగం కోరినట్లు జిన్హువా వార్తా సంస్థ తన కథనంలో పేర్కొంది. ఈ కష్టకాలంలో నేపాల్‌కు అండగా నిలుస్తున్న భారత్, తన సహాయక చర్యలను మరింత ముమ్మరం చేసింది. తాజాగా నాలుగో విడతగా 11 టన్నుల సహాయక సామగ్రితో కూడిన ది130 విమానాన్ని నేపాల్‌కు పంపినట్లు భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. ఈ విమానంలో గాలింపు చర్యల కోసం ప్రత్యేక సాంకేతిక బృందం, వారి పరికరాలు, మృతదేహాల గుర్తింపు కోసం ఫోరెన్సిక్ నిపుణులు, వారికి అవసరమైన డీఎన్ఏ విశ్లేషణ కిట్లు ఉన్నాయని ఆయన ఎక్స్‌లో వెల్లడించారు. వీటితో పాటు దుప్పట్లు, స్లీపింగ్ బ్యాగులు, టార్పాలిన్లు, ప్లాస్టిక్ షీట్లు, పరిశుభ్రత కిట్లు వంటివి కూడా పంపినట్లు వివరించారు. ఇప్పటికే 230 అడుగుల పొడవైన మాడ్యులర్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన పరికరాలతో 16 ట్రక్కులు నేపాల్‌కు చేరుకున్నాయని, మరో ఏడు బెయిలీ వంతెనల నిర్మాణానికి కూడా త్వరలో సామగ్రిని సరఫరా చేస్తామని జైశంకర్ తెలిపారు. వీటిని నిర్మించేందుకు సాంకేతిక బృందాలు కూడా త్వరలో అక్కడికి చేరుకుంటాయన్నారు. ఇప్పటివరకు మొత్తం 68.5 టన్నుల సహాయక సామగ్రిని విమానాల ద్వారా ఖాట్మండుకు తరలించినట్లు విదేశాంగ శాఖ పేర్కొంది. నేపాల్‌లో సహాయక చర్యలకు తమ మద్దతు కొనసాగుతుందని భారత్ స్పష్టం చేసింది.

# హైదరాబాద్ చేరుతున్న నేపాల్ బాధితులు

>> చేస్తున్నారు.పార్థివదేహాల గుర్తింపు, అప్పగింత, స్వదేశానికి తరలింపునకు సంబంధించిన సమగ్ర విధివిధానాలను నేపాల్ అధికారులు ఖరారు చేస్తున్నారు. అయితే, ఇందుకు సంబంధించిన పూర్తి విధివిధానాలు ఇంకా ఖరారు కావాల్సి ఉన్నందున, పరీక్షలు చేయించుకునే ముందు లేదా గుర్తింపు కోసం నేపాల్‌కు ప్రయాణించే ముందు తెలంగాణ భవన్, భారత రాయబార కార్యాలయంతో సంప్రదించి అవసరమైన సూచనలు పొందాలి. ప్రతి కేసులో అధికారిక నిర్ధారణ పూర్తయిన తరువాతే సంబంధిత కుటుంబాలకు, ప్రజలకు తదుపరి సమాచారం తెలియజేయబడుతుందన్నారు.

# మరో భారీ భూకుంభకోణం!

>> లేఖ రాశారు. దశాబ్దాలుగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆస్తులను కమీషన్ల కోసం ప్రైవేటుపరం చేయడంపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం నగరం నడిబొడ్డులో మరో అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేస్తోంది. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిన రేవంత్ రెడ్డి సర్కార్.. రియల్ ఎస్టేట్ ఏజెన్సీగా మారిపోయిందని ఆ లేఖలో ఆరోపించారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ అజామాబాద్‌లో ఉన్న రూ.500 కోట్ల విలువైన ఆయిల్‌ఫెడ్ భూమిని ప్రైవేట్ వ్యక్తుల పరం చేస్తున్న ప్రభుత్వం. బహిరంగ మార్కెట్లో 500 కోట్ల రూపాయలు పలికే భూమిని.. కేవలం రూ.87 కోట్లకే ఓ ప్రైవేట్ వ్యక్తికి కట్టబెట్టే భారీ కుట్ర చేసిందని, ఆ రూ.87 కోట్లు చెల్లించడానికి సొంత ప్రభుత్వ సంస్థ ఆయిల్‌ఫెడ్ సిద్ధంగా ఉన్నా.. వారిని కాదని ప్రైవేట్ వ్యక్తికి అప్పగించడం వెనుక ఉన్న కుంభకోణం ఏంటి? అని ప్రశ్నించారు. మూడు దశాబ్దాలుగా ఆయిల్‌ఫెడ్ ఆధీనంలో ఉన్న 3 ఎకరాల 23 గుంటల (15,984 గజాలు) భూమిని లాక్కునే దుర్మార్గం జరుగుతుందని, 1987లో సుప్రీంకోర్టు ప్రైవేట్ సంస్థకు మొట్టికాయలు వేసి ప్రభుత్వానిదే హక్కు అని తేల్చినా.. కమీషన్ల కోసం కాంగ్రెస్ నేతలు తీర్పులనే తుంగలో తొక్కారని ఆరోపించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ ప్రైవేట్ శక్తులకు తలొగ్గకుండా వందల కోట్ల ప్రభుత్వ ఆస్తిని చిత్తశుద్ధితో కాపాడాం. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే.. పేదల పొట్టగొట్టి పెద్దలకు పల్లీలు, బఠానీల్లా వేల కోట్ల భూముల పందేరం చేస్తున్నారని చెప్పారు. ఒకవైపు సామాన్యుల ఇండ్లను 22ఏ జాబితాలో పెట్టి వేధింపులు.. మరోవైపు ఖరీదైన ప్రభుత్వ భూములను కమీషన్ల కోసం కారుచౌకగా ప్రైవేట్‌కు దారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. ఇది ఒక్క అజామాబాద్ భూమి కథే కాదు.. కోకాపేట, రాయదుర్గం, గచ్చిబౌలిలోనూ కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ దందానే నడుస్తోందన్నారు. ఇలా స్వార్థం కోసం ఇష్టారాజ్యంగా ఆస్తులు అమ్ముకుంటూ పోతే.. భవిష్యత్తులో గుడికి, బడికి, చివరికి స్మశానానికి కూడా రాష్ట్రంలో స్థలం మిగలదని పేర్కొన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి ఈ అక్రమ కేటాయింపును రద్దు చేసి, ఆ భూమిని ఆయిల్‌ఫెడ్‌కే దక్కేలా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజల సొత్తును ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు.. ఈ నిర్ణయం వెనక్కి తీసుకునే వరకు మహా పోరాటం చేస్తామన్నారు.



ఆదివారం ముంబయిలో జరిగిన మారథాన్‌లో పాల్గొన్న మహారాష్ట్ర డి.సి.ఎం ఏక్‌నాథ్ షిండే

# నీరులేని కారు మబ్బులు!

>> తక్కువ వర్షం కురవడంతో ఎల్‌నీనో ప్రభావం తెలంగాణపై ఉండదని అంతా భావించారు. గత ఏడాది ఇదే నెలలో 237.9 ఎం.ఎం వర్షం కురవడం దాని కంటే 6శాతం తక్కువగా ఉండటంతో అంతా ఆగస్టునెల కూడా మంచి వర్షాలు వస్తాయని భావించారు. ఆగస్టు నెలలో 215ఎంఎం వర్షాపాతం సాధారణంగా నమోదు అవుతోంది గత ఏడాది ఆగస్టు 28న ఒక్క కామారెడ్డి రాజంపేటలోనే అత్యధిక వర్షాపాతం 549 మి.మికురిసి చరిత్ర నమోదు చేసింది. ఆగస్టునెలలో గత యేడాది 372.2 ఎం.ఎం వర్షపాతం నమోదైంది. ఈయేడు మాత్రం ఆదివారం నాటికి 200ఎం.ఎం సాధారణ వర్షం కురువాల్సి ఉండగా 130.4 ఎం.ఎం మాత్రమే వర్షం కురిసింది. దీనితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 44వేల చెరువులు కుంటలలో సగాని కంటే తక్కువ నీరు వచ్చి చేరింది. పోయిన యేడాది చెరువులు మత్తడి దుమికి కళకళలాడితే ఇప్పుడు మత్తడి కాదు కదా కనీసం తూములు ఎత్తి పంటలకు నీరు విడుచుకోని పరిస్థితి నెలకొంది. గోదావరి బేసిన్‌లోని మధ్యతరహా నీటి ప్రాజెక్టులు మెదక్ జిల్లా నల్లవాగు, నిజామాబాద్‌జిల్లా రామడుగు,కామారెడ్డి పోచారం,కౌలాస్‌నాల, ఆదిలాబాద్ సాత్నాల,మత్తడివాగు, నిర్మల్ జిల్లా స్వర్ణ, సుద్దవాగు గడ్డెన్నవాగు,కొమురం భీంజిల్లా వట్టివాగుఎన్‌టిఆర్‌సాగర్, పిపిరావు ప్రాజెక్టు,కొమురంభీం ప్రాజెక్టు జగన్నాథపురం పెద్దవాగు మంచిర్యాల గొల్లవాగు,నీల్వాయి,రాళ్ళవాగు,సిద్దిపేట శనిగరం,జయశంకర్ జిల్లా బొగ్గులవాగు మల్లూరవాగు,గుండ్లవాగు,లక్నవరం, రామప్ప,పాలెం పెద్దవాగు,తాలిపేరు,కిన్నరసాని ప్రాజెక్టుల్లో 45327ఎంసిఎఫ్‌టి నీరు ఉండల్సి ఉండగా 33904ఎంసిఎఫ్‌టి నీరు మాత్రమే ఉంది. తాలిపేరు,కిన్నరసానిలో నీరు ఓ స్థాయిలో ఉన్నా మిగితా మధ్యతరహా ప్రాజెక్టులు నిండు వర్షాకాలంలో కూడా 63శాతం ఖాళీగానే ఉన్నాయి. కృష్ణాబెసిన్‌లోని దిండి, ఆసిఫ్‌నహర్, మూసి,కొత్తపల్లివాగు, వరంగల్ జిల్లా పాకాల చెరువు, ఖమ్మం వైరా,లంకసాగర్,మహబూబాబాద్ బయ్యారం ట్యాంక్ లలో 9409 ఎంసిఎఫ్‌టి నీరు ఉంది. వాస్తవానికి అందులో 14886ఎంసిఎఫ్‌టి సామర్థ్యంలో నీరు ఉండాల్సి ఉంది. మొత్తంగా కృష్ణాగోదావరి బేసిన్‌లో 60213ఎంసిఎఫ్‌టి గరిష్ఠనీటి మట్టానికి గాను మద్యతహా ప్రాజెక్టులో 43313ఎంపిఎఫటి నీరు మాత్రమే అందులో ఉంది. కృష్ణాబేసిన్‌లో జూరాలలో గోదావరి బేసిన్‌లో మిడ్‌మానేరు,కడెంశ్రీపాద ఎల్లంపల్లిలో మాత్రమే గరిష్ఠనీటి నిల్వసామర్థ్యం దగ్గరగా నీటి నిల్వలు ఉన్నాయి. జూరాలలో 9.50టిఎంసిలు, మిడ్‌మానేరులో 20.47 టిఎంసిలు శ్రీపాదఎల్లంపల్లిలో 18.59 కడెంలో 3.5టిఎంసిలు నీరు ఉంది. భారీ ప్రాజెక్టులో 792,74 గరిష్టనీటి సామర్థ్యంకు గాను ప్రస్తుతం 496,56టిఎంసిలనీరు ఉంది. ప్రధాన భారీ ప్రాజెక్టులో 62.64శాతం నీరు మాత్రేమ అందుబాటులో ఉంది. గత ఏడాది శ్రీశైలంలో 197టిఎంసిలనీరు ఉంటే ప్రస్తుతం 153టిఎంసిలనీరు ఉంది. నాగర్జునసాగర్‌లో 183 టిఎంసిలనీరు ప్రస్తుతం ఉంటే పోయిన ఏడాది ఇదే రోజు 306టిఎంసిలనీరు ఉండేది. ఎస్సారెస్పీలో పోయిన ఏడాది 65టిఎంసిల నీరు ఉంటే ఇప్పుడు 44టిఎంసిలనీరు ఉంది. మొత్తానికి తెలంగాణలోని జలవనరులు అత్యంత దయనీమైన నీటి నిల్వలతో ఉంది వచ్చే ఇరువై రోజుల్లో నైరుతి వర్షిస్తే నీటివనరులు నిండుతాయి లేదంటే ఈయేడు మాత్రమే కాదు వచ్చేఖరీఫ్ కూడా కరువు ప్రభావంతో రైతులు ఇబ్బంది పడని పరిస్థితి నెలకొంటుంది. ప్రస్తుతం ఊష్ణోగ్రతలు కూడా అత్యధికంగా నమోదవుతున్నాయి. రాష్ట్రంలో సగటు ఊష్ణోగ్రత 38 సెం.గ్రె నమోవుతోంది. వాస్తవానికి సాధారణ ఊష్ణోగ్రత 31 సెం.గ్రెలు ఉండాలి అసాధారణ వేడితో ఎల్‌నీనో ప్రతాపం చూపుతోన్నది.

### 1 నుంచి టెన్త్ పరీక్షల దాకా

# క్రాస్ వాల్యుయేషన్

## మూల్యాంకనంలో మార్పులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు30:** తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత కచ్చితంగా అంచనా వేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షల మూల్యాంకనంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతో పాటు విద్యార్థుల ప్రతిభను నిష్పక్షపాతంగా అంచనా వేయడమే లక్ష్యంగా కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. ఇకపై ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి విద్యార్థుల ఎస్ఏ1, ఎస్ఏ2 పరీక్షల జవాబు పత్రాలతో పాటు 10వ తరగతి ఎస్ఏ1 పరీక్షల జవాబు పత్రాలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మూల్యాంకనం చేయరు. వాటి స్థానంలో ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులతో జవాబు పత్రాలను మూల్యాంకనం చేయించనున్నారు. ఈ విధానాన్ని క్రాస్ వాల్యుయేషన్‌గా పిలుస్తారు. దీనివల్ల విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనంలో పక్షపాతం లేకుండా మరింత పారదర్శకత తీసుకురావచ్చని విద్యాశాఖ భావిస్తోంది.

**మండల కేంద్రాల్లో ప్రత్యేక వాల్యుయేషన్ సెంటర్లు**

క్రాస్ వాల్యుయేషన్‌ను సమర్థంగా నిర్వహించేందుకు ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేక వాల్యుయేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. ఈ కేంద్రాలు మండల విద్యాశాఖాధికారుల (ఎంఈఓ) పర్యవేక్షణలో పనిచేయనున్నాయి. ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఈకేంద్రాలకు కేటాయించి జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను నిర్వహించనున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను సరిగ్గా గుర్తించేందుకు పరీక్షల ఫలితాలు కీలకం. అయితే అదే పాఠశాల ఉపాధ్యాయులు తమ విద్యార్థుల జవాబు పత్రాలను మూల్యాంకనం చేయడం వల్ల కొన్నిసార్లు మార్కుల విషయంలో తేడాలు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇతర పాఠశాలల ఉపాధ్యాయులతో జవాబు పత్రాలను మూల్యాంకనం చేయించడం ద్వారా విద్యార్థుల అసలైన విద్యా సామర్థ్యాలను మరింత నిష్పక్షపాతంగా అంచనా వేసే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. కొత్త విధానం ద్వారా పరీక్షల మూల్యాంకన ప్రక్రియలో పారదర్శకత పెరగడంతో పాటు ఉపాధ్యాయుల్లో జవాబుదారీతనం కూడా పెరుగుతుందని విద్యాశాఖ పేర్కొంది. అలాగే విద్యార్థుల బలాలు, బలహీనతలను గుర్తించి అవసరమైన చోట అదనపు బోధన, రెమెడియల్ కార్యక్రమాలను చేపట్టేందుకు ఈ మూల్యాంకన ఫలితాలు ఉపయోగపడనున్నాయి. మొత్తంగా తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు పరీక్షల మూల్యాంకనాన్ని మరింత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మార్చే దిశగా ఈ క్రాస్ వాల్యుయేషన్ విధానం కీలక అడుగుగా నిలవనుందని అధికారులు పేర్కొన్నారు.

# ఐదు బిలియన్ డాలర్లకు ద్వైపాక్షిక వాణిజ్యం

>> సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ తెలిపారు. ఆదివారం తాష్కెంట్‌లో ప్రధాని మోడీ, అధ్యక్షుడు మిర్జియోయెవ్ మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ఇరు దేశాల సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచాలని నిర్ణయించారు. అలాగే 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 5 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2026లో భారత్ ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి 15 ఏళ్ల పూర్తవుతున్న నేపథ్యంలో ఇరుదేశాల సంబంధాలకుమరింత విస్తృతమైన, ప్రతిష్టాత్మకమైన రూపాన్ని కల్పిస్తున్నామని మోడీ తెలిపారు.గత ఏడాది భారత్‌ఉజ్బెకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం తొలిసారిగా 1 బిలియన్ డాలర్ల మార్క్‌ను దాటిందని మిర్జియోయెవ్ తెలిపారు. ఇరు దేశాల మధ్య జాయింట్ వెంచర్ల సంఖ్య కూడా ఇటీవలి సంవత్సరాల్లో ఏకంగా ఏడు రెట్లు పెరిగిందని చెప్పారు. వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కీలక ఖనిజాలు, క్లీన్ ఎనర్జీ, అంతరిక్షం, అణు ఇంధన రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. భారత్‌ఉజ్బెకిస్థాన్ చర్చల్లో అణు ఇంధన రంగం కూడా కీలకంగా నిలిచింది. ఉజ్బెకిస్థాన్ నుంచి భారత్‌కు దీర్ఘకాలికంగా యురేనియం సరఫరా చేసే ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు మోడీ ప్రకటించారు. రక్షణ, భద్రతా సహకారంపైనా ఇరు దేశాల నేతలు చర్చించారు. రక్షణ రంగాల్లో ప్రత్యక్షభాగస్వామ్యం, ఉమ్మడి ఉత్పత్తి, సంయుక్త అభివృద్ధిని ప్రోత్సహించాలని నిర్ణయించారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదం ప్రాంతానికి తీవ్రమైన సవాళ్లని వీటిని ఎదుర్కోవడంలో భారత్, ఉజ్బెకిస్థాన్ కలిసి పనిచేయాలని మోడీ అన్నారు. ఇంధనం, ఫార్మాస్యూటికల్స్, వ్యవసాయం, ఆభరణాలు, సంస్కృతి వంటి రంగాల్లోనూ సహకారాన్ని పెంచాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించనున్నారు. భారత్, ఉజ్బెకిస్థాన్ మధ్య ప్రస్తుతం వారానికి 14 నేరుగా విమాన సర్వీసులు నడుస్తున్నాయని మిర్జియోయెవ్ తెలిపారు. కొత్త వీసా రహిత విధానంతో పర్యాటకులు, వ్యాపార ప్రయాణికుల రాకపోకలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఉజ్బెకిస్థాన్‌లో యోగా కూడా వేగంగా ప్రజాదరణ పొందుతోందని చెప్పారు. 2018 నుంచి ఆ దేశంలో ప్రత్యేక యోగా ఫెడరేషన్ పనిచేస్తోంది. జూన్‌లో దేశవ్యాప్తంగా యోగా ఫెస్టివల్‌ను కూడా నిర్వహించారు. దేశాల మధ్య సంబంధాలను స్థానిక స్థాయిలోనూ విస్తరించేందుకు మూడు సిస్టర్ సిటీ, సిస్టర్ స్టేట్ ఒప్పందాలు చేసుకోవాలని భారత్, ఉజ్బెకిస్థాన్ నిర్ణయించాయి. ఉజ్బెకిస్థాన్ నిర్మిస్తున్న న్యూ తాష్కెంట్ ప్రాజెక్టు, గుజరాత్‌లోని భారత గిఫ్ట్ సిటీ మధ్య సహకారానికి అవకాశాలున్నాయని మోడీ తెలిపారు. గిఫ్ట్ సిటీ అభివృద్ధిలో ఉపయోగించిన సాంకేతికత, ప్రణాళికలు, ఉత్తమ విధానాలను అధ్యయనం చేసేందుకు ఉజ్బెక్ ప్రతినిధి బృందాన్ని భారత్‌కు ఆహ్వానించారు. భారత్, ఉజ్బెకిస్థాన్ 1992లో దౌత్య సంబంధాలను ఏర్పరచుకున్నాయి. 2011లో ఇరు దేశాల సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి చేరాయి. మోడీ తాజా పర్యటన ఉజ్బెకిస్థాన్‌కు ఆయన నాలుగో పర్యటన.

# వరుస సెలవుల అనంతరం తిరిగొస్తున్న నగరవాసులు

## కిక్కిరిసిపోయిన జాతీయ రహదారులు, భారీగా వాహనాల రద్దీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు30:** తెలంగాణలో రాఖీ పండుగ, వరుస సెలవులతో సొంతూళ్లకు వెళ్లిన వారి తిరుగుపయనంతో జాతీయ రహదారులు కిక్కిరిసిపోయాయి. హైదరా బాద్- విజయవాడ జాతీయ రహదారి, హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారి, బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారులు అన్ని వాహనాలతో కిక్కిరిసిపోయాయి. సోమవారం నుంచి మళ్లీ స్కూళ్లు, కాలేజీలు, ఆఫీసులు ఉండటంతో సొంతూళ్లకు వెళ్లిన వారంతా మళ్లీ నగరానికి పయనమయ్యారు. వ్యక్తిగత వాహనాలతో రోడ్డు కిక్కిరిసి చాలాచోట్ల ట్రాఫిక్ నెమ్మదిగా సాగుతోంది. వాహనాల రద్దీకి తోడు హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై అక్కడక్కడా పనులు సాగుతుండటంతో ట్రాఫిక్ నెమ్మదించింది. అటు టోల్ ప్లాజాల వద్ద రద్దీ ఎక్కువై వాహనాలు బారులు తీరాయి, యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్ ప్లాజా వద్ద వాహనాలు నెమ్మదిగా సాగుతున్నాయి. ఆదివారానికి తోడు, భక్తులు యాదాద్రి దర్శనానికి వచ్చిన భక్తుల తిరుగు ప్రయా ణంతో టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ పెరిగింది. పట్టణ ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు పెళ్లిళ్లు, బోనాలు, రాఖీ పండగకు వెళ్లి తిరుగు ప్రయాణం కావటంతో టోల్‌ప్లాజా వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగి నట్లు టోల్ ప్లాజా నిర్వాహకులు తెలిపారు. మరోవైపు మేడ్చల్, సైబ రాబాద్ పోలీసు కమిషనరేట్, జిల్లాల ట్రాఫిక్ పోలీసులు జాతీయ రహదారులపై వాహనాల రద్దీని నియంత్రిస్తున్నారు. ట్రాఫిక్‌జామ్ ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. రద్దీకి తోడు అక్కడక్కడా వర్షం కూడా పడటంతో వాహనాలు నెమ్మదిగా సాగుతున్నాయి.

# నీట్-యుజి కౌన్సెలింగ్‌లో మెడికల్ సీటు రాలేదని యువతి ఆత్మహత్య


శృతిలయ (ఫైల్)

**చెన్నై, ఆగస్టు 30:** తమిళనాడులోని తిరునెల్వేలిలో వైద్య విద్యార్థిని శృతిలయ (21) ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. నీట్‌యూజీ కౌన్సె లింగ్ తొలి విడతలో మెడికల్ సీటు దక్కకపోవడంతో తీవ్రమనస్తాపానికి గురై ఈ నిర్ణ యం తీసుకున్నట్లు వార్తలు వెలు వడ్డాయి. ఐటీ రంగంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి కుమార్తె అయిన శృతిలయ 2023లో పాఠశాల విద్యను పూర్తి చేసింది. వైద్యవృత్తిలో స్థిరపడాలనే లక్ష్యం తో అనంతరం నీట్ కోచింగ్ సెంటర్‌లో చేరి ప్రవేశపరీక్షకు సిద్ధమైంది. గత యేడాది నీట్‌యూజీ పరీక్ష రాసినప్పటికీ ఆమెకు మెడికల్ సీటు లభించలేదు. దీంతో మరోసారి ప్రయత్నించేందుకు తీవ్రంగా శ్రమించింది. ఈ యేడాది జరిగిన నీట్‌యూజీ పరీక్షలో ఆమె విజయవంతంగా ఉత్తీర్ణత సాధించింది. అయితే ఇటీవల విడుదలైన నీట్ కౌన్సె లింగ్ తొలివిడత సీట్ల కేటాయింపు జాబితాలో తన పేరు లేకపోవడంతో ఆమె తీవ్రనిరాశకు గురైనట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఆ రాత్రి నిద్రకు వెళ్లిన ఆమె మరుసటిరోజు ఉదయం కని పించకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఇంటితో పాటు పరిసర ప్రాంతాల్లో గాలిం చగా, ఇంటికి సమీపంలోని ఓ షెడ్‌లో ఆమె ఉరివేసుకుని కనిపించి నట్లు సమాచారం. కుటుంబసభ్యుల సమాచా రంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువతి మృతికి సంబంధించిన పూర్తి వివరాలు, పరిస్థితులపై విచారణ కొనసాగుతోంది.

# భారత్, ఉజ్బెక్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

## ద్వైపాక్షిక చర్చల తర్వాత మీడియాతో ఇరుదేశాల నేతలు

## ఇంధనం, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ రంగాల్లో పరస్పర సహకారం



**తాష్కెంట్, ఆగస్టు 30:** భారత్-ఉజ్బెకిస్థాన్ సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా మరింత బలోపేతం చేయాలని ఉజ్బెకిస్తాన్, భారత్ అగ్రనేతలు నిర్ణయిం చారు. ఉగ్రవాదంపై ఉమ్మడి పోరాటంతోపాటు వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ రంగాల్లో పరస్పరసహకారం విస్తరించాలని ఆకాంక్షించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉజ్బెకిస్థాన్ పర్యటనలో విస్తృత చర్చల అనంతరం సంయుక్తప్రకటన విడుదలచేసారు. ఇరు దేశాల మధ్య రాజకీయ, వాణిజ్య, ఆర్థిక, పెట్టుబడులు, రవాణా అనుసంధానం, డిజిటల్ పరివర్తన, కృత్రిమ మేధస్సు (ఏఐ), అంతరిక్షం, సైబర్ భద్రత, ఇంధన మార్పిడి, కీలక ఖనిజాలు, ఆహార భద్రత, ఆరోగ్య సంరక్షణ, ఔషధాలు, విద్య తదితర రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించారు. భారత్, ఉజ్బెకిస్థాన్ మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలు, చారిత్రక, సాంస్కృతిక అనుబంధాలే ద్వైపాక్షిక భాగస్వామ్యానికి పునాదులని నేతలు పేర్కొన్నారు. ఇరు దేశాల ప్రధాన ప్రయోజనాలకు అనుగుణంగా సంబంధాలను మరింత లోతుగా తీసుకెళ్లి సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. రాజకీయ, పార్లమెంటరీ, భద్రతా సహకారంఇరు దేశాల నాయకత్వం, సంస్థాగత స్థాయిల్లో నిరంతర, విశ్వాసపూర్వక చర్చలు కొనసాగించాలని నేతలు నిర్ణయించారు. ద్వైపాక్షికంగా, అంతర్జాతీయ సదస్సుల సందర్భంగా పరస్పర పర్యటనలు, ఉన్నతస్థాయి సంప్రదింపులు కొనసాగించేందుకు అంగీకరించారు. ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందాలు, ఏర్పాట్ల అమలును ఉన్నత స్థాయిలో సమన్వయం చేసేందుకు విదేశాంగ మంత్రుల నేతృత్వంలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రాధాన్య ద్వైపాక్షిక కార్యక్రమాలు, ప్రాజెక్టులను సకాలంలో అమలు చేయడం కూడా ఈ వ్యవస్థ లక్ష్యంగా ఉంటుంది. పార్లమెంటరీ దౌత్యానికి పెరుగుతున్న ప్రాధాన్యాన్ని నేతలు గుర్తించారు. ఉజ్బెకిస్థాన్ ఒలియ్ మజ్లిస్, భారత పార్లమెంట్ మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావడాన్ని స్వాగతించారు. పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూపుల మధ్య సహకారం, అంతర్జాతీయ అంతర్ పార్లమెంటరీ సంస్థల్లో పరస్పర భాగస్వామ్యాన్ని కూడా పెంచాలని నిర్ణయించారు. ద్వైపాక్షిక సహకారానికి సంబంధించిన చట్టపరమైన వ్యవస్థను ఆధునికీకరించాల్సిన అవసరాన్ని నేతలు నొక్కిచెప్పారు. ప్రస్తుత ప్రాధాన్యాలకు అనుగుణంగా ఇప్పటికే ఉన్న ద్వైపాక్షిక ఒప్పందాలను సమగ్రంగా సమీక్షించి, నేటి పరిస్థితులకు సరిపోయేలా మార్పులు చేయాలని అంగీకరించారు. ఉగ్రవాదంపై కఠిన వైఖరిఅన్ని రూపాలు, వ్యక్తీకరణల్లో ఉగ్రవాదాన్ని, ముఖ్యంగా సరిహద్దు ఉగ్రవాదాన్ని భారత్, ఉజ్బెకిస్థాన్ తీవ్రంగా ఖండించాయి. ఉగ్రవాదానికి ఎలాంటి కారణంతోనూ సమర్థన ఉండకూడదని, ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానం కొనసాగించాలని నేతలు స్పష్టం చేశారు. ఉగ్రవాద సంస్థలపై సమన్వయంతో చర్యలు తీసుకోవడం, ఉగ్రవాదానికి నిధులు అందించే నెట్‌వర్క్‌లను అడ్డుకోవడం, ఉగ్రవాదులకు సురక్షిత స్థావరాలు, మౌలిక సదుపాయాలు అందకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులకు, వారికి మద్దతు ఇచ్చేవారికి, సహకరించేవారికి, అనుబంధ సంస్థలకు చట్టపరంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఉగ్రవాద నిరోధక సంయుక్త వర్కింగ్ గ్రూప్ కింద సహకారాన్ని కొనసాగించాలని పునరుద్ఘాటించారు. రక్షణ, భద్రతా సంస్థల మధ్య పెరుగుతున్న సహకారాన్ని నేతలు ప్రశంసించారు. రక్షణ రంగంలో సంయుక్త కార్యకలాపాలు, శిక్షణ, సామర్థ్యాల పెంపు, సంస్థాగత వ్యవస్థల ద్వారా సహకారాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించారు. రక్షణ పారిశ్రామిక రంగంలో కొత్త సహకార అవకాశాలను అన్వేషిస్తున్న మిలిటరీ కోఆపరేషన్ జాయింట్ వర్కింగ్ గ్రూప్ కార్యకలాపాలను నేతలు స్వాగతించారు. 2026 ఏప్రిల్‌లో ఉజ్బెకిస్థాన్‌లోని నామంగన్ ప్రాంతంలో నిర్వహించిన భారత్‌ఉజ్బెకిస్థాన్ సంయుక్త సైనిక విన్యాసం 'దస్త్లిక్' విజయవంతం కావడాన్ని ప్రశంసించారు. వాణిజ్యం, ఆర్థిక, పెట్టుబడుల సహకారంభారత్‌ఉజ్బెకిస్థాన్ మధ్య బలమైన ఆర్థిక భాగస్వామ్యాన్ని నేతలు స్వాగతించారు. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణకు ఇంకా అపారమైన అవకాశాలు ఉన్నాయని గుర్తించారు. రెండు దేశాల మధ్య వస్తువుల వాణిజ్య పరిధిని విస్తరించడం, సుంకేతర అడ్డంకులను తొలగించడం, పారిశ్రామిక సహకారాన్ని పెంచడం ద్వారా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత పెంచేందుకు సంయుక్త చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకోసం సుంకేతర సమస్యలు, పెట్టుబడి అడ్డంకులను పరిష్కరించేందుకు ప్రత్యేక జాయింట్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈకామర్స్, వాణిజ్య ప్రక్రియల డిజిటలైజేషన్, చిన్న, మధ్య తరహా సంస్థలకు డిజిటల్ వేదికల ఏర్పాటు వంటి అంశాల్లో సహకారాన్ని పెంచాలని ఇరు దేశాలు అంగీకరించాయి.

# రిటైర్డ్ ఉద్యోగులకు రూ.10 వేల కోట్ల బకాయిలు

## మూడేళ్లలో 28 వేల మంది పదవీవిరమణ

## రాష్ట్ర ఖజానాపై మరో రూ.9 వేల కోట్ల భారం

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగులకు, పదవీ విరమణ ప్రయోజనాలకు సంబంధించి దాదాపు రూ.10 వేల కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్ర ఖజానా ఆర్థిక భారాన్ని ఎదుర్కొం టోంది. ఈ బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు, పెన్షనర్లు ఇప్పటికే రోడెక్కారు. ఈ డిమాండ్ల నేపథ్యంలో, రాబోయే మూడేళ్లలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పదవీ విరమణ చేయనుండటంతో రాష్ట్ర ప్రభుత్వం మరో ఆర్థిక సవాలును ఎదుర్కోనుంది. ఉద్యోగులకు ప్రమాద బీమా కవరేజీని విస్తరించేం దుకు ఈ యేడాది జూన్‌లో బ్యాంకులతో ఒప్పందాలు కుదుర్చుకున్న అనంతరం, నెలకు దాదాపు రూ.1,000 కోట్ల పదవీ విరమణ ప్రయోజనాలు ఇప్పటికే ఉన్న భారాన్ని మరింత పెంచుతున్నాయని ఆర్థిక శాఖ చెబుతోంది. పదవీ విరమణ ప్రయోజనాల కింద ప్రభుత్వం ప్రతి నెలా రూ.750 కోట్లు విడుదల చేస్తున్నప్పటికీ, ఇంకా సుమారు రూ.250 కోట్ల లోటు ఉందని అంచనా వేస్తోంది. మరోపక్క రాబోయే సంవత్సరాల్లో మరింత మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయడంతో పరిస్థితి ప్రభుత్వానికి మరింత సవాలుగా మారే అవకాశం ఉంది. ప్రాథమిక అంచనాల ప్రకారం, రాబోయే మూడేళ్లలో 28,000 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది చివరి నాటికి, సుమారు 9,700 మంది ఉద్యోగులు, 2027లో మరో 9,400 మంది ఉద్యోగులు, 2028లో సుమారు ఇంకో 8,700 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేస్తారని అంచనా. పదవీ విరమణ సమయంలో, ప్రభుత్వం గ్రాట్యుటీ, పెన్షన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఇతర ప్రయోజనాలను చెల్లించాల్సి ఉంటుంది.

ఇవన్నీ కలిసి రాష్ట్ర ఖజానాపై ఏటా సుమారు రూ.9,000 కోట్ల ఆర్థిక భారాన్ని అదనంగా మోపుతాయని అంచనా. పదవీవిరమణ ప్రయోజనాలను సకాలంలో చెల్లించేందుకు వార్షిక బడ్జెట్‌లో గణనీయమైన మొత్తాన్ని కేటాయి స్తున్నామని ఆర్థిక శాఖ అంటుండగా, చెల్లించాల్సిన పదవీ విరమణ ప్రయోజ నాలు ప్రతీ ఏటా పేరుకుపోతున్నాయని ఉద్యోగులు వాదిస్తున్నారు. కాగా ఈ ఒత్తిడికి తోడు, ప్రభుత్వం వేతన సవరణ కమిషన్ సిఫార్సులను కూడా అమలు చేయాల్సి ఉంది. రెండవ పిఆర్సీ పదవీకాలం సెప్టెంబర్ 30తో ముగియనుంది. ఒకవేళ కొత్త పిఆర్సీ అమలు చేస్తే, జీతాలు, పదవీవిరమణ ప్రయోజనాలపై ఖర్చు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

# పంటల కొనుగోళ్లలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు

## మరింత బలోపేతానికి ప్రభుత్వం నిర్ణయం

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ), ధర మద్దతు పథకం (పీఎస్ఎస్) కింద ఏర్పాటు చేసే పంటల కొను గోలు కేంద్రాల కేటాయింపులో అర్హత కలిగిన రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు (ఎఫ్‌పీఓలు) రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వనుండి. తద్వారా రైతు ఉత్పత్తిదారుల సంస్థలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ అధికవర్గాలు వెల్లడించాయి. ప్రధానంగా మౌలిక సదుపాయాలు, ఆర్థిక సామర్థ్యం, శిక్షణ పొందిన సిబ్బంది, పారదర్శక నిర్వహణ ఉన్న రైతు ఉత్పత్తిదారుల సంస్థలను జిల్లా కలెక్టర్లు గుర్తించి కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు. ఇప్పటికే ఈ బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలు, గిరిజన సహకార సంస్థ వంటి సంస్థలతో పాటు అర్హత కలిగిన రైతు ఉత్పత్తిదారుల సంస్థలను కూడా భాగస్వాములుగా చేర్చనుంది. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల విక్రయాలకు అవసరమైన లైసెన్సుల కోసం రైతు ఉత్పత్తిదారుల సంస్థలు సమర్పించే దరఖాస్తులను జిల్లా వ్యవసాయ అధికారులు ప్రాధాన్యంతో పరిశీలించి త్వరితగతిన మంజూరు చేయాలని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఐఎఫ్‌ఎఫ్‌సీవో యూరియా, గ్రీన్ మ్యాన్యూర్ తదితర వ్యవసాయ ఇన్‌పుట్ల పంపిణీలోనూ రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు ప్రాధాన్యం కల్పించనుంది. రైతులే భాగస్వాములుగా ఉండే రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రభుత్వ సేవలు, వ్యవసాయ ఇన్‌పుట్స్ రైతులకు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయి.

# నాణ్యమైన 50 లక్షల టన్నుల బొగ్గు కేటాయించాలి

## తెలంగాణలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

## రాష్ట్రంలోని థర్మల్ కేంద్రాలకు బొగ్గు కొరత

## సింగరేణి ఒప్పందంలో 76 శాతమే సరఫరా

## కేంద్రానికి తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ పెరుగున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (టిజి జెన్కో) థర్మల్ కేంద్రాల నుండి ఉత్పత్తి చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. అయితే బొగ్గు కొరత, నాణ్యత లోపం కార ణంగా రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి చేయలేకపోతున్నామని, దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రానికి అదనంగా 50 లక్షల టన్నుల బొగ్గును సరఫరా చేసేలా కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకోవాలని జెన్కో తాజాగా రాసిన ఒక లేఖలో కోరింది. విద్యుత్ మంత్రిత్వ శాఖ కార్యదర్శికి రాసిన ఒక లేఖలో టీజీజెన్‌కో సిఎండి ఎస్. హరీష్, తమ థర్మల్ విద్యుత్ ఉత్పాదక కేంద్రాలన్నీ సింగరేణి కాలరీస్‌తో సంవత్సరానికి 28.87 మిలియన్ టన్నుల దీర్ఘకాలిక బొగ్గు అనుసంధానాన్ని కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. అయితే సింగరేణి కాలరీస్ నుండి బొగ్గు పరిమాణం, నాణ్యత రెండింటిలోనూ కొరత కారణంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి దెబ్బతింటోందని అందులో జెన్కో పేర్కొంది. జెన్కో థర్మల్ స్టేషన్లు సంవత్సరానికి 28.87 మిలియన్ టన్నుల కోసం సింగరేణి తో దీర్ఘకాలిక ఇంధన ఒప్పందం ఉందని, అయితే, అంగీకరించిన పరిమాణం, నాణ్యత గల బొగ్గును సరఫరా చేయలేకపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. జెన్కోకు రోజువారీ అవసరం 83 వేల టన్నులు కాగా, సింగరేణి కేవలం 50 వేల నుండి 60 వేల టన్నులు మాత్రమే సరఫరా చేస్తోందని తెలిపారు. ఈవిధంగా భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి, సింగరేణి నుండి 76 శాతం మాత్రమే బొగ్గు సరఫరా అయిందని అది కూడా సరఫరా ఒప్పందం గ్రేడ్‌కు అనుగుణంగా సుమారు 40 శాతం నాణ్యత మాత్రమే ఉందని స్పష్టం చేశారు. కేటీపీఎస్‌లోని 500 మెగావాట్లు, 800 మెగావాట్ల యూనిట్లతో పాటు, యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) లోని అన్ని యూనిట్లతో సహా కీలకమైన సామర్థ్యం గల బ్లాక్‌లు, జి9/జి10 వంటి అధిక బొగ్గును వినియోగించుకునేలా రూపొందించబడ్డాయని, కాని సింగరేణి గనుల నుండి తక్కువ నాణ్యత కలిగిన బొగ్గును (జి 13 మరియు అంతకంటే తక్కువ) అందిస్తోందని వివరించారు. దీనివల్ల ప్లాంట్లు పూర్తి స్థాయిలో కాకుండా పాక్షిక లోడ్‌లతో నడపవలసి వస్తోందని, ఫలితంగా విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోతోందని పేర్కొంది. మరోపక్క 2026లో తెలంగాణలో గరిష్ట విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందని. సాగునీటి పంపింగ్, పారిశ్రామిక వినియోగం మరియు వడగాలుల పరిస్థితుల కారణంగా, గతంలో సుమారు 13000 మెగావాట్లుగా ఉన్న గరిష్ట లోడ్ ఆగస్టు నెలలో 17,000-18,000 మెగావాట్లను దాటినట్లు ఆలేఖలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో, యాదాద్రి థర్మల్‌స్టేషన్ లోని ఐదు 800 మెగావాట్ల యూనిట్లలో నాలుగు వాణిజ్య కార్యకలాపాల తేదీని సాధించాయని, ఐదవ యూనిట్ సెప్టెంబర్‌లో ప్రారంభం కానుందని జెన్కో పేర్కొంది. ఐదు యూనిట్లు కూడా ప్రారంభమైన తర్వాత, ప్లాంట్‌కు రోజుకు సుమారు 50,000 టన్నుల బొగ్గు అవసరమవు తుందని అంచనా. రాబోయే నెలల్లో జాతీయ గరిష్ట డిమాండ్ 260 గిగా వాట్లను మించిపోతుందని అంచనా వేస్తున్నందున, సరఫరా ఒత్తిడిని నివారించడానికి తెలంగాణలోని అన్ని బొగ్గు ఆధారిత థర్మల్ యూనిట్లు తప్పనిసరిగా రేటెడ్ కెపాసిటీతో పనిచేయాలని జెన్కో తెలిపింది. ఇందుకు అనుగుణంగా అదనంగా 50 లక్షల టన్నులు (5 మిలియన్ టన్నులు) బొగ్గు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్రానికి జెన్కో రాసిన లేఖలో పేర్కొంది.


AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు)

AU SMALL FINANCE BANK A SCHEDULED COMMERCIAL BANK

నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001 (CIN: L36911RJ1996PLC011381)

అనుబంధం-IV (8 (1) నిబంధన చూడండి) స్వాధీనతా ప్రకటన

"ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్", "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్"తో ఏప్రిల్ 01, 2024 నుండి విలీనం అయిందని రుణగ్రహీతలందరికీ మరియు ప్రజలకు తెలియజేయడానికి ఇది. అయితే, కింద సంతకందారు "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) కింద AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారి మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడిన సెక్షన్ 13 (12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీ చేశారు. దిగువ పేర్కొన్న తేదీకి రుణగ్రహీతలు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలని పిలుపునిచ్చారు:-

| రుణగ్రహీత పేరు/సహ-రుణగ్రహీత/తనఖాదారు/హామీదారు/రుణ ఖాతా నం. | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
|---|---|---|
| (రుణ ఖాతా నం.) 23660002124132, బాలగౌని రామ్ ప్రసాద్ గౌడ్ (రుణగ్రహీత), బాలగౌని నాగమణి (సహ-రుణగ్రహీత) | 16-మార్చి-26 రూ. 14,74,452/- పద్నాలుగు లక్షల డెబ్బై నాలుగు వేల నాలుగు వందల యాభై రెండు రూపాయలు మాత్రమే 12-మార్చి-26 నాటికి | 25-ఆగస్టు-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: సంగారెడ్డి జిల్లా, జిన్నారం మండలం, కొదకంచి గ్రామం, పుట్టిగూడ వద్ద ఉన్న, ఇంటి నం. 5-21 కలిగిన ఆస్తి: దీని విస్తీర్ణం 218 చదరపు గజాలు మరియు ప్లింత్ ఏరియా నిర్మాణ విస్తీర్ణం 400 చదరపు అడుగులు పైకప్పు ఎసిసి షీట్లతో కప్పబడి ఉంది. దీని సరిహద్దులు: తూర్పున: రోడ్డు, పడమరన: ఖాళీ స్థలం, ఉత్తరాన: బాలగౌని జగన్ గౌడ్ ఇల్లు, దక్షిణాన: కిష్టంగారి లక్ష్మీ నారాయణ గౌడ్ ఇల్లు. | | |
| (రుణ ఖాతా నం.) 23660002404705, ఎండి ఆసిఫ్ అహ్మద్ (రుణగ్రహీత), తస్లీమ్ బేగం (సహ-రుణగ్రహీత) | 21-మే-26 రూ. 9,07,584/- తొమ్మిది లక్షల ఏడు వేల ఐదు వందల ఎనభై నాలుగు రూపాయలు మాత్రమే 21-మే-26 నాటికి | 27-ఆగస్టు-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: సంగారెడ్డి జిల్లా, కోహీర్ గ్రామం మరియు మండలం, బిహేర్‌వాడి వద్ద ఉన్న ప్రస్తుత ఇంటి నం. 17-38/1 అసెస్‌మెంట్ నం. 4376 కలిగిన ఆస్తి; ఇందులో టిన్ షెడ్ (పైకప్పు)తో కూడిన 100.00 చదరపు అడుగుల నిర్మాణం ఉంది. మొత్తం విస్తీర్ణం ప్రాంతం 2062.00 చదరపు అడుగులు లేదా 229.11 చదరపు గజాలు లేదా 191.56 చదరపు మీటర్లు స్థలం మరియు ఆ భవనంలోని అన్ని ఫిక్చర్లు మరియు ఫిట్టింగ్‌లు. దీని సరిహద్దులు: తూర్పున: జి.పి. రోడ్డు, పడమరన: ఎండి ఆసిఫ్ యొక్క బహిరంగ ప్లాట్, ఉత్తరాన: మహమ్మద్ సొహైల్ యొక్క ఖాళీ ప్లాట్, దక్షిణాన: జి.పి. రోడ్డు | | |

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న తేదీలో పేర్కొన్న నియమంలోని సెక్షన్ 13(4)తో పాటు [చట్టం 2002] సెక్షన్ 13(4) కింద అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి, పైన పేర్కొన్న పట్టికలో వివరించిన ఆస్తిని క్రింద సంతకందారు స్వాధీనం చేసుకున్నాడని రుణగ్రహీతకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. "సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, అంటే ఈ సమాచారం నుండి 30 రోజులలోపు, నియమం 8 (6)తో పాటు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలకు రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది" ముఖ్యంగా రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజలకు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో ఏదైనా లావాదేవీలు పైన పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీకి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) ఛార్జీకి లోబడి ఉంటాయి.

తేదీ : 29/08/2026 స్థలం : హైదరాబాద్, తెలంగాణ సం/- అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్


# రాష్ట్రంలో 42 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ


## రైల్వే రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి


## కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 42 రైల్వే స్టేషన్ల ఆధునీకరణకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో కొనసాగుతున్న ఆధునీకరణ పనులను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పరిశీలించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్టేషన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని సూచించారు. వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణతో పాటు తెలంగాణలో 42 రైల్వే స్టేషన్లను ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. రైల్వే ప్రమాదాల నివారణకు ప్రధానమంత్రి అధ్వర్యంలో కవచ్ సాంకేతికను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. బుల్లెట్ రైలు తెలంగాణకు వస్తే దేశంలోనే రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచే అవకాశం ఉందని అన్నారు. వికారాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు రూ.27 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. స్టేషన్‌లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. నాలుగు చక్రాల వాహనాల పార్కింగ్ సామర్థ్యాన్ని 50కి, ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు 150కి పెంచినట్లు వివరించారు. ప్రయాణికుల సౌకార్యార్థం ఎస్కలేటర్, రెండు లిఫ్టులు, క్యాంటిన్, దివ్యాంగులకు ఆధునిక వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ఈ యేడాది చివరి నాటికి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పూర్తిచేస్తామని వెల్లడించారు. అండర్ బ్రిడ్జి సమస్య పరిష్కారానికి ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసికేంద్ర రైల్వే మంత్రితో చర్చించి చర్యలు తీసుకుంటామని అన్నారు. జాతీయ రహదారి పనులను సైతం తక్కువ సమయంలో పూర్తి చేస్తామని అన్నారు. ప్రయాణి కులకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని అన్నారు. రైల్వే మౌళిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, తెలంగాణలో రైల్వే రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తామని అన్నారు. వికారాబాద్ ప్రాంత అభివృద్ధికి రైల్వే అనుసంధానం ఎంతో కీలకమని ఆధునికకరణ పనులు పూర్తయిన తరువాత ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, సికింద్రాబాద్ రైల్వే డివిజన్ మేనేజర్ ఆర్.గోపాలక్రిష్ణ, అదనపు ఎస్‌పి రాజేష్ మీనా, ఎంఎల్‌సి అంజిరెడ్డి, ఎమ్మెల్యే కాలేయాదయ్య, బిజేపి రాష్ట్ర సెల్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, రమేష్, కెవస్ రత్నం, యంఆర్‌ఓ లక్ష్మీనారాయణ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

వార్త


> చాలా మంది యువకులు యుద్ధం గురించి చాలా గొప్పగా ఆలోచిస్తారు. కానీ నిజానికి అదొక నరకం.
>
> - జనరల్ విలియం షెర్మన్

# చిన్నబోయిన 'న్యాయ' మీమాంస!

ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ పనితీరు అత్యంత పారదర్శకంగా ఉండాలని అందరూ కోరుకుంటారు. కక్షిదారులకు న్యాయం చేయడం ఎంతముఖ్యమో, వారికి న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించడమూ అంతే ముఖ్యం. ఈ నేపథ్యంలో న్యాయవ్యవస్థ పారదర్శకతపై ఇటీవల కాలంలో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీటిపై బయటివారు, కక్షిదారులో విమర్శించే విషయాల కన్నా ఆ వ్యవస్థలోని వారినుంచే కొన్ని వ్యాఖ్యలు చర్చల్లోకి వచ్చాయి. ప్రధానంగా న్యాయస్థానాల పనితీరు, సమాచారం లభ్యత,జవాబుదారీతనం, నియామక ప్రక్రియలు, తీర్పుల లభ్యత, పరిపాలనా పారదర్శకత అనే అంశాలు పరిశీలనలోకొస్తాయి. ఒకప్పుడుకేసుల కేటాయింపుల అంశంలో సుప్రీం న్యాయమూర్తులేప్రధాన న్యాయమూర్తి వైఖరి పట్ల వ్యతిరేకత వ్యక్తం చేసిన విషయం విదితమే. అదేదో సంక్షోభమని చెప్పలేం కానీ అంతర్గత అసంతృప్తి నుంచి రాజుకున్న విమర్శలే. న్యాయవ్యవస్థలో పారదర్శకత పేరిట బయటకురాకూడదని విషయాలు బహిర్గతమవడంతోనే వచ్చినతంటా అది. తాజాగా అలాంటి సందర్భాలే తలెత్తాయి. న్యాయవ్యవస్థలో అదేమిటి, ఇదేమిటి, అలా జరిగిందేమిటి? ఇలా జరిగి ఉండవచ్చుకదా! అనే స్వేచ్ఛాభావాల వ్యక్తీకరణ కొత్త సమస్యలను తెచ్చిపెడుతోంది. జస్టిస్ ఉజ్వల్ భుయాన్ చేసిన వ్యాఖ్యలు న్యాయవ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం విషయమే కాకుండా కొలీజియం వ్యవస్థపై మళ్లీ చర్చను తెరపైకి తెచ్చాయి. తమ కేసులు విచారణాధికారిగా ఉన్న న్యాయమూర్తులు ఎవరు, వారి పనితీరు, నియామక అర్హతల గురించి తెలుసుకోగలిగితేనే వారి మీద నమ్మకం ఏర్పడ్తుందనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. అందుకే న్యాయ వ్యవస్థలోని సంస్థాగత విశ్వసనీయత కూడా అవసరమేనని హితవు చెబుతున్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు సాధారణమైనవిగా చూడలేము. 2025-26ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను 5 హైకోర్టులు మాత్రమే తమ వెబ్‌సైట్‌లలో ప్రచురించాయి. మిగిలిన కోర్టులు అలాంటి ప్రయత్నమేమీ చేయలేదు. 813మంది హైకోర్టు న్యాయమూర్తుల్లో కేవలం 87మంది మాత్రమే తమ ఆస్తులవిషయాలను ప్రకటించారు.అందరూ తమకు సంబంధించిన వివరాలను ప్రకటించడంద్వారా పారదర్శకతను పెంచవచ్చునన్నది అభిప్రాయం ఎల్లెడలా చర్చించుకుంటున్న విషయం న్యాయవ్యవస్థ తీరుతెన్నులను అందులోనివారే ప్రశ్నించేపరిస్థితిని నమ్మాల్సిందే.అందుకే ఇలాంటి అంశాలపై మారిన కాలమాన పరిస్థితుల రీత్యా విస్తృత చర్చలోకి రావడాన్ని అభ్యంతరపెట్టలేం. న్యాయ వ్యవస్థలోని ప్రతి ఒక్కరూ వారి వారి స్థాయిలతో సంబంధం లేకుండా న్యాయపీఠ గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీను. ప్రధానంగా కేసుల పెండింగ్, న్యాయమూర్తుల నియామక కొలీజియమ్ వ్యవస్థ, నిర్ణయాలు తరచు బాగావిమర్శలకు గురవుతున్న అంశాలు.ఆవ్యవస్థ ఉండరాదని కేంద్రప్రభుత్వం భావిస్తోంటే స్వతంత్ర్య వ్యవస్థ అవసరమేనన్న ఆవశ్యకతను సుప్రీం న్యాయమూర్తులు, న్యాయకోవిదులు తగిన వేదికల మీద చెబుతూనే ఉన్నారు. న్యాయవ్యవస్థ విధి విధానాలపై సమతుల్యత విషయంలో వస్తున్న అంతరాలపై ఎప్పటి నుంచో బాహాటంగా విమర్శలు వినపిస్తున్నాయి.అంతర్గంతగానూకొంత సంక్షోభం ఉంది. తాజాగా న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలంటే పారదర్శకత అత్యంత ముఖ్యమన్న సుప్రీంకోర్టున్యాయమూర్తి జస్టిస్ ఉజ్వల్ భుయాన్ వ్యాఖ్యలు కొత్త చర్చకు దారి తీసింది. జడ్జిల నియామకంపై సుప్రీంకోర్టు కొలిజీయమ్ పనితీరును ఆయనప్రశ్నించారు. బదిలీలు, నియామకాలకు సంబంధిత సిఫార్సుల్లో ఈ మధ్యకాలంలో సరైనకారణాలను వెల్లడించకపోవడంప్రతిభావంతులైన న్యాయమూర్తులకు అన్యాయం చేకూరుతుందని ఆయన వ్యాఖ్యానించారు. న్యాయమూర్తుల ఎంపిక వెనుక వారిప్రతిభ, వగైరా కారణాలను వెల్లడించడానికి ఆయన తీవ్రంగాతప్పుపట్టారు. ఎన్నో సున్నితమైన వ్యాఖ్యలు చేశారు. 2025నాటి పదోన్నతిసిఫార్సులకు సంబంధించినగత మూడు కొలీజియం తీర్మానాల్లోను నియామక ఎంపిక కారణాలను వివరించకపోవడాన్ని ఆయన లోపభూయిష్టంగా పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలకు, రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తివిరుద్ధమైన వ్యాఖ్యలు చేసే వ్యక్తులున్యాయ వ్యవస్థలోకి ప్రవేశించడానికి పరోక్ష అవకాశం ఇచ్చినట్ల వుతుందని భుయాన్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో 'విధి' సెంటర్ ఫర్‌లీగల్ పాలిసీకి చెందిన (జెడ్ఎఎల్‌డిఐ) న్యాయ మేధోమదన సంస్థ ఆధ్వర్యంలో జ్యుడిషియల్ ట్రాన్స్‌పరెన్సీ ఇండెక్స్ ప్రారంభోత్సవ సభలో జరిగిన ప్యానల్ చర్చలో ఆయన పాల్గొన్నారు. ఎవరినీ వ్యక్తిగతంగా ఉద్దేశించిన వ్యాఖ్యలు కాకపోయినా తరచి చూస్తే భుయాన్ ఎంతో నిబద్ధతతో చేసిన స్వేచ్ఛావ్యాఖ్య వ్యవస్థలోని మంచిచెడులకు జవాబుదారీ ఏదనే ఆలో చనలో మాట్లాడారు.ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నో ఉదంతాలు, సంఘటనలు ఆయన వ్యాఖ్యలకు కారణమై ఉండొచ్చునన్నారు. గతంలో కొలిజీయం నిర్ణయాల సందర్భంలో కొన్నిసార్లు సిఫార్సులు మొక్కుబడిగా ఉన్నాయని, మరికొన్ని సార్లు మాత్రమే కారణాల బయటికి వచ్చేవి. ఇప్పుడా పారదర్శకత పద్ధతి కూడా కనిపించకపోవడాన్ని తిరోగమనంగా ప్రజల్లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వం అసలు కొలీజియం వ్యవస్థే అవసరం లేదని భావిస్తోంది. వ్యవస్థ అభిప్రాయమున్నా ప్రస్తుత అంశం కొలీజియం తీరుతెన్నులపై చర్చను రాజేస్తోంది. న్యాయ వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడేందుకే ఆయన విమర్శలు సాగినందున తప్పు పట్టాల్సిన అభిప్రాయం. పారదర్శకత ద్వారానే ఇలాంటివి సాధ్యం.



> సుఖ దుఃఖాలను సమంగా చూసేవారే విశ్వరహస్యాన్ని తెలుసుకోగలరు.
>
> గురునానక్



> రచయిత మేధావిలా ఆలోచించాలి కాని, సగటు మనిషికి అర్థమయ్యేంత సులువుగా రాయాలి.
>
> అరిస్టాటిల్

# కృష్ణా జలాలపై వివాదం ఇంకెన్నాళ్లు?

**కృష్ణా జలాల విషయంలో తుది పరిష్కారానికి న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతున్న వేళ, తాత్కాలిక నిర్వహణలో ఇరు రాష్ట్రాలూ సంయమనం పాటించడం మరింత అవసరం. ఎందుకంటే ఒక రాష్ట్రం విజయం అంటే మరో రాష్ట్రం ఓటమి కాదు. రెండు రాష్ట్రాల ప్రజలకు తాగునీరు అందడం, రైతులకు నమ్మకమైన నీటి ప్రణాళిక లభించడం, ప్రతి నీటి చుక్క సమర్థంగా వినియోగించడం అదే నిజమైన విజయం. కృష్ణా నీటిని పంచుకోవడం ఒక చట్టపరమైన అవసరం మాత్రమే కాదు, అది రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పరిపక్వతకు పరీక్ష. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి, ప్రజల సంక్షేమాన్ని ముందుంచి, న్యాయబద్ధత- పారదర్శకత- సహకారం అనే మూడు సూత్రాలతో ముందుకు సాగితే కృష్ణా వివాదం శాశ్వత ఘర్షణగా మిగలదు. కృష్ణా జలాలు రెండు రాష్ట్రాల మధ్య గీత గీయడానికి కాదు. రెండు రాష్ట్రాల ప్రజల భవిష్యత్తును భద్రపరచడానికి ఉపయోగపడాలి.**

సి.హెచ్.ప్రతాప్

కృష్ణా జలాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు కేవలం నదీ జలాలు కావు. కోట్లాది ప్రజల తాగునీరు, లక్ష లాది రైతుల సాగునీరు, పరిశ్రమల అవసరాలు, విద్యుత్ ఉత్పత్తి వీటి వెనుక కృష్ణా ప్రవాహం ఉంది. అందుకే నీటి లభ్యత తగ్గిన సమయంలో ఇరు రాష్ట్రాల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తడం కొత్త విషయం కాదు. కానీ అవి పరస్పర ఆరోపణలకు, ప్రాజెక్టుల వద్ద ఉద్రిక్తతలకు దారితీయకుండా రాజ కీయ విభేదాలను పక్కనపెట్టి సంస్థాగత పరిష్కారాల వైపు వెళ్లడం ఇప్పుడు అత్యవసరం. ఆగస్టు 26న నాగార్జున సాగర్ వద్ద మరోసారి నీటి విడుదలపై ఉద్రిక్తత ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ అధికారులు కుడి కాలువకు సుమారు 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, తెలంగాణఅధికారులు కూడా ఎడమ కాలువకు నీటిని విడుదల చేశారు. రెండు రాష్ట్రాలు తాగునీటి అవసరాలను కారణంగా చూపాయి. ఈ పరిణామం నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయాల్సిన పరిస్థితి కూడా ఏర్పడింది. అంతకుముందు ఆగస్టు 24న జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశంలో ఇరు రాష్ట్రాల తాగునీటి అవసరాలపై ఏకాభిప్రాయం రాకపోవడంతో తదుపరి చర్చను సెప్టెంబర్ 4కు వాయిదా వేశారు. ఈ పరిణామాన్ని ఏ రాష్ట్రం తప్పు, ఏ రాష్ట్రం ఒప్పు అనే కోణంలో చూడటం సమస్యను మరింతసంక్లిష్టం చేస్తుంది. ముందుగా తాగునీటి అవసరాలు, తర్వాత సాగునీటి అవసరాలు. వాటి మధ్య సమతుల్యతను శాస్త్రీయ లెక్కలతో నిర్ణయించడం ముఖ్యం. నీటి విడుదలకు సంబంధించిన ప్రతి నిర్ణయం అందుబాటులో ఉన్న నిల్వలు, ప్రవాహాలు, రాబోయే వర్షపాతం అంచనాలు, తాగునీటి అవసరాలు, గత వినియోగం వంటి అంశాల ఆధారంగా ఉండాలి. కృష్ణా జల వివాదానికి దశాబ్దాల చరిత్ర ఉంది. 1969లో ఏర్పాటైన కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-ఈ (బచావత్ ట్రిబ్యునల్) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీల కేటాయింపు చేసింది. రాష్ట్ర విభజన తర్వాత ఈ కేటాయింపును తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ఎలా పంచుకోవాలన్నది ప్రధాన అంశంగా మారింది. తాత్కాలికంగా 512: 299 నిష్పత్తి ప్రాతిపదికన నీటి వినియోగం కొనసాగుతున్నప్పటికీ, ఇది తుది అంతర్రాష్ట్ర పంపిణీ పరిష్కారం కాదు. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం కృష్ణా నదీ యాజమాన్య బోర్డును ఏర్పాటు చేసింది. అదే చట్టంలోని సెక్షన్ 89 కింద, ఇంతకుముందు నిర్ణయించని చోట ప్రాజెక్టు వారీగా కేటాయింపులు,లోటు ప్రవాహాల సమయంలో నీటి విడుదలకు కార్యాచరణ విధానాన్ని రూపొందించే అంశాలు కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-ఇఇ పరిధిలోకి వచ్చాయి. 2023లో కేంద్రం ట్రిబ్యునల్-ఇఇకి తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ మధ్య మిగిలిన పంపిణీ అంశాలపై అదనపు టెరంస్ ఆఫ్ రిఫరెన్స్ ఇచ్చింది. అంటే ప్రస్తుత వివాదానికి



న్యాయపరమైన వేదిక ఇప్పటికే ఉంది. అందువల్లప్రాజెక్టుల వద్ద పరస్పర ప్రతిఘటన కంటే ట్రిబ్యునల్,కృష్ణా నదీ యాజమాన్య బోర్డు వంటి సంస్థాగత మార్గాలనే బలోపేతం చేయడం సమర్థవంతమైన పద్ధతి. మొదటగా శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ఉమ్మడి ప్రయోజనాల ప్రాజెక్టుల విషయంలో రియల్‌టైమ్ డేటా ఆధారిత నీటి నిర్వహణ వ్యవస్థ రావాలి. నిల్వలు, ఇన్‌ఫ్లోలు, అవుట్‌ఫ్లోలు, కాలువల వారీ విడుదలలు, తాగునీటి అవసరాలు వంటి వివరాలు ఇరు రాష్ట్రాలకు ఒకే సమయంలో అందుబాటులో ఉండాలి. ఒకే డేటాను ఆధారంగా చేసుకుని నిర్ణయం తీసుకుంటే అనుమానాలకు, అపోహలకు అవకాశం తగ్గుతుంది. రెండోది సాధారణ వర్షపాతం, లోటు వర్షపాతం, తీవ్ర నీటి కొరత వంటి పరిస్థితులకు ముందుగానే ప్రత్యేక నీటి విడుదల ప్రోటోకాల్స్ రూపొందించాలి. తాగునీటికి అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఏ విధంగా నీరు విడుదల చేయాలి? రెండు రాష్ట్రాల అవసరాలు ఒకేసారి పెరిగితే ప్రాధాన్యత ఎలా నిర్ణయించాలి? నిర్ణయం తీసుకునే గడువు ఎంత? ఇలాంటి ప్రశ్నలకు ముందుగానే సమాధానాలు ఉండాలి. మూడోది రెండు రాష్ట్రాలూ కృష్ణాపై ఆధారపడే అవసరాన్ని తగ్గించుకోవాలి. చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, సూక్ష్మ సేద్యం, తక్కువ నీటితో సాగు, పట్టణ మురుగునీటి శుద్ధి-పునర్వినియోగం వంటి చర్యలు దీర్ఘకాలిక పరిష్కారంలో భాగం కావాలి. నీటి సమస్యను రాజకీ యంగా ప్రస్తావించడం ప్రజాస్వామ్యంలో సహజమే. కానీ ప్రజల తాగునీరు, రైతుల పంటలు, భవిష్యత్ నీటి భద్రత రాజకీయ భేదాల కంటే పెద్దవి. రెండు రాష్ట్రాల ప్రభుత్వా లు పరస్పరం విమర్శించుకోవడం ద్వారా తక్షణ రాజకీయ ప్రయోజనం పొందవచ్చేమో కానీ, దాని వల్ల నదిలో ఒక్క చుక్క నీరు పెరగదు. ఇంకా ముఖ్యంగా, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల వద్ద అధికారులు పరస్పరం ఎదురుపడే పరిస్థితి పునరావృతం కాకుండా స్పష్టమైన సమన్వయ వ్యవస్థ అవసరం. నీటి విడుదలపై భిన్నాభిప్రాయం ఉంటే అది అధికారుల మధ్య ఘర్షణగా కాకుండా, బోర్డు ముందు సాంకేతిక చర్చగా పరిష్కారం కావాలి. కృష్ణా జలాల విషయంలో తుది పరిష్కారానికి న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతున్న వేళ, తాత్కాలిక నిర్వహణలో ఇరు రాష్ట్రాలూ సంయమనం పాటించడం మరింత అవసరం. ఎందుకంటే ఒక రాష్ట్రం విజయం అంటే మరో రాష్ట్రం ఓటమి కాదు. రెండు రాష్ట్రాల ప్రజలకు తాగునీరు అందడం, రైతు లకు నమ్మకమైన నీటి ప్రణాళిక లభించడం, ప్రతి నీటి చుక్క సమర్థంగా వినియోగించడం అదే నిజమైన విజయం. కృష్ణా నీటిని పంచుకోవడం ఒక చట్టపరమైన అవసరం మాత్రమే కాదు,అది రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పరి పక్వతకు పరీక్ష. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి, ప్రజల సంక్షేమాన్ని ముందుంచి, న్యాయబద్ధత- పారదర్శకత- సహకారం అనే మూడు సూత్రాలతో ముందుకు సాగితే కృష్ణా వివాదం శాశ్వత ఘర్షణగా మిగలదు. కృష్ణా జలాలు రెండు రాష్ట్రాల మధ్య గీత గీయడానికి కాదు. రెండు రాష్ట్రాల ప్రజల భవిష్యత్తును భద్రపరచడానికి ఉపయోగపడాలి. ●

# ఫీజు బకాయిల్లో విద్యార్థుల భవిష్యత్తు!

డా.మోటె చిరంజీవి

విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం నేడు అనేకప్రశ్నలను ఎదుర్కొంటోంది. 2020-21 నుంచి 2024-25 విద్యా సంవత్సరాల వరకు బకాయిలు పేరుకుపోవడం విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు ఈ పథకం ఎంతో కీలకం. ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజులు సకాలంలో అందకపోవడంతో కొన్ని కళాశాలలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఇది అదనపు ఆర్థికభారంగా మారుతోంది. తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్య ఏళ్లుగా కొనసాగుతోంది. ప్రస్తుతం మొత్తం బకాయిలు రూ.8 వేల కోట్లకు పైగానే ఉన్నాయని ప్రభుత్వం చెబుతుండగా, 2025-26 వరకు కలిపితే రూ.10 వేల కోట్లకు పైగా ఉంటాయని కళాశాలల వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ప్రభుత్వం కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాలపై నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ, గత బకాయిల పరిస్థితి మాత్రం స్పష్టంగా తేలాల్సి ఉంది. పాత బకాయిలను పూర్తిగా పరిష్కరించకుండా కొత్త విధానాలను ప్రకటించడం వల్ల సమస్య మరింత క్లిష్టమయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ఇప్పటికే బకాయిల చెల్లింపుల కోసం భారీ మొత్తాలను విడుదల చేసినట్లు చెబుతున్నప్పటికీ,విద్యార్థుల ఖాతాలు, కళాశాలల బకాయిల స్థాయిలో పూర్తి పారదర్శకత అవసరం. ఫీజు రీయింబర్స్‌మెంట్ కేవలం ప్రభుత్వ ఆర్థిక పథకం కాదు. వేలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన సామాజిక బాధ్యత. బకాయిల కారణంగా విద్యార్థుల చదువుల మధ్యలో ఆగకుండాప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. అలాగే కళాశాలల వారీగా బకాయిలను గుర్తించి, దశలవారీగా కాకుండా నిర్ణీత కాల పట్టికతో చెల్లింపులు పూర్తి చేయాలి. బకాయిలు పేరుకుపోవడంతో ప్రైవేట్ కళాశాలలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఆ ప్రభావం చివరకు విద్యార్థులపైనే పడుతోంది. ఫీజులు చెల్లించాలంటూ ఒత్తిడి, సర్టిఫికెట్లు నిలిపివేయడం వంటి సమస్యలతో చదువు పూర్తిచేసిన విద్యార్థులు కూడా ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం 2026-27 నుంచి ప్రతి విద్యా సంవత్సరానికి అవసరమైన నిధులను అదే ఏడాదిలో విడుదలచేసి, ఇకపై బకాయిలు పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. నెలకు రూ.200 కోట్ల చొప్పున విడుదల చేసే కొత్తవిధానాన్ని కూడా ప్రకటించింది. భవిష్యత్తులో ఇలాంటి బకాయిలు పేరుకుపోకుండా ప్రతి విద్యాసంవత్సరం ఫీజురీయింబర్స్‌మెంట్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, నిధుల విడుదలకు పటిష్టమైన వ్యవస్థను రూపొందించాలి. విద్యార్థుల చదువువారి కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై ఆధారపడకూడదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ లెక్కలు స్పష్టమై, బకాయిలు పూర్తిగా తీరినప్పుడే ఈ పథ కానికి నిజమైన అర్థం చేకూరుతుంది. ప్రభుత్వం ఇకనైనా కాలయాపనకు తావులేకుండా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలి. అర్హులైన విద్యార్థుల బకాయిలను తక్షణమే చెల్లించాలి. ఏ విద్యార్థి సర్టిఫికేట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా ఆగిపోకుండా విద్యార్థులకు అవసరమైనప్పుడు వారికి ఇచ్చేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆటలాడకుండా భవిష్యత్తులో ప్రతి ఏడాది ఫీజురీయింబర్స్‌మెంట్ సకాలంలో అందేలా ప్రత్యేకనిధి, పారదర్శక చెల్లింపు వ్యవస్థను ఏర్పాటు చేయాలి. పేద విద్యార్థుల భవిష్యత్తు బకాయిల లెక్కల్లో చిక్కుకోకుండా చూడటమే ప్రభుత్వానికి ముందున్న అసలు బాధ్యత. ●





# ప్రజావాక్కు

### ధరలను నియంత్రించాలి!

**అమెరికా,** ఇరాన్‌ల మధ్యజరిగిన యుద్ధం ఇంధనం, ఎల్.పి.జి కొరతకు కారణమైంది. దీనివల్ల నిత్యావసర వస్తువుల ధరలుపెరిగి, సామాన్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈసాకుతో హోటల్ యజమానులు అల్పాహారం, భోజనం, కాఫీ, టీధరలను హడావిడిగా పెంచేశారు. కొన్ని హోటళ్లు గ్యాస్‌ధరలకు విడివిడిగా కూడా బిల్లును వేశాయి.హోటళ్లపై ఆధారపడిన ప్రజలు తప్పనిసరిగా కష్టాలు పడ్డారు.ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. పరిస్థితులు దాదాపు సాధారణ స్థితికి వచ్చాయి. ఎల్.పి.జి సిలిండర్ల కొరత లేదు. దాని ధర కూడా కొంచెం తగ్గింది. బ్లాక్‌మార్కెట్‌లో సిలిండర్లను అమ్మేపరిస్థితి ఇప్పుడు లేదు. ఇదంతా హోటల్ యజమానుల దృష్టికి తెలియకుండా పోదు. రాకెట్ వేగంతో పెంచిన ధరలను అంతే వేగంగా తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించాలి.

- దాసం వెంకటరెడ్డి, ఊరదాళ్లపాలెం

### మంచు కొండంత విషాదం

**నేపాల్‌లో** ఆకస్మిక వరద ప్రవాహం బారినపడి రెండు జిల్లాలు దాదాపు తుడుచుపెట్టుకుపోవడం వేల మంది గల్లంతు కావడం పెను విషాదం. ఇప్పటికి 400 మంది మృతులుగా తేలినా వేలమంది ఆచూకీ కానరాకపోవడం అందులో భారత్ సహా 35దేశాల నుండి వచ్చిన పర్యాటకులు ఉండడం గుండెల్ని కలిచివేస్తుంది.పట్టణాలకు పట్టణాలేబురదలో కూరుకుపోయినప్పుడు, గ్రామాల ఆచూకీ కూడా తుడిచిపెట్టుకుపోయినప్పుడు, నలభై కిలోమీటర్ల దాకా హైవేలు, పదుల సంఖ్యలో హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులు, వంతెనలు కొట్టుకుపోయినప్పుడు, వేలకొద్దీ ఇళ్లు నేలమట్టంఅయినప్పుడు,మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టం లెక్కలు ఇప్పుడే తేలవు. నేపాల్ కష్టానికి వెంటనే భారత్ స్పందించి సహాయ చర్యలు చేపట్టింది కానీ వారి కష్టం, నష్టం, బాధ తీర్చలేనివి.

- డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

### ఒంటరి జీవితాన్ని అలవర్చుకోవాలి

**మానవ** జీవితంలో ఎన్నో పరిచయాలు ఏర్పడతాయి. అందులో స్నేహితులు, బంధువులు, మిగతా రకరకాల మిత్రులు పరిచయం అవుతూ ఎనలేని సంబంధాలుగా మారతాయి. కానీ ఒక్కొక్కప్పుడు ఒంటరిగా జీవించడం కూడా నేర్చుకోవాలి. కొన్ని సమయాల్లో ఎవరు రారు. ఒంటరిగా జీవించడానికి అలవాటుపడాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### కఠిన చర్యలతో నకిలీలను అరికట్టాలి

'వైద్యో నారాయణోహరి'వైద్యులనునారాయణునితో పోల్చారు. అంత పవిత్రమైన శబ్దాన్ని నకిలీలు అపవిత్రం చేసారు. సాక్షాత్ నారాయణునిఅవతారంలో నకిలీలెందరో?అందరూ ప్రజల ఆరోగ్యంతో ఆట్లాడుకుంటున్న నకిలీవైద్యులే. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ జోన్లలో టాస్క్‌ఫోర్స్ డి.సి.పి. నాయకత్వంలో ప్రత్యేక ఆపరేషన్ పేరిట విస్తృతంగా తనిఖీలు చేసిన పోలీసులు నకిలీలను చూసి విస్తుపోయారు. అరెస్టు చేసారు. ఈ నకిలీ నారాయణులు ఆపరేషన్లు కూడా చేసేసారట. వీరిలో చాలామంది గతంలో నర్సులుగా,కంపౌండర్లుగా లేదా మెడికల్ షాపుల్లో పనిచేశారు. ఎలాంటి అధికారిక వైద్య విద్య, అర్హతలు లేకపోయినా నకిలీసర్టిఫికెట్లతో డాక్టర్లుగా చలామణి అవుతున్నారు. రోగులకు విచక్షణారహితంగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ ఇస్తూ,ఇంజెక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. నకిలీలను అరికట్టాలి.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

### సైన్స్‌ను ప్రమోట్ చెయ్యాలి

**నేపాల్‌లో** జరిగిన ప్రమాదం లాంటిది మనదేశంలో జరిగితే? నియంత్రించే శక్తి మనదేశాకికి ఉన్నదా! అందుకే సైన్స్‌ను ప్రమోట్ చెయ్యాలి. సైన్స్ సెంటర్లను ఎక్కువగా ఏర్పాటు చెయ్యాలి. దేవుళ్ళను మతాన్ని కాదు.ఆవు మూత్రానికి, ఆవు పేడకు పవిత్రతను అంటగట్టడం మానుకోవాలి. శాస్త్రీయ సమాజం కొరకు పనిచేయాలి.అది జరగాలంటే విద్యార్థులకు ప్రాథమిక విద్యనుండి శాస్త్రీయ విద్యను అందించాలి.పుక్కిటి పురాణాలను, గాయత్రి మంత్రం,బూత వైద్యం,వాస్తు జ్యోతిష్యం ఇలాంటి కల్పితమైన వాటిని తొలగించి శాస్త్రీయ విద్యను అందించాలి. ప్రజలలో శాస్త్రీయ ఆలోచన పెంచే విధంగా మనందరం కృషి చెయ్యాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### స్థిరమైన ఆదాయం కల్పించాలి

**దేశవ్యాప్తంగా** సంక్షేమం పైన సంక్షేమంపేరుతో కోట్లకు కోట్లు ఖర్చు పెడుతున్నారు అని చర్చజరుగుతుంది. నిజానికి పేదల సంఖ్యను తగ్గించడానికి పేదల జీవితాలకు సుస్థిరమైన ఆదాయం కల్పించే మార్గాలువెతకాలి. అప్పుడు పేదరికం గురించి సంక్షేమం గురించి చర్చ అంతగా ఉండదు. అయితే పేదరిక నిర్మూలనకు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు పెద్దసంఖ్యలో పథకాల అమలు జరిపినప్పటికీ స్థిరమైన ఆదాయం కల్పించినప్పుడే శాశ్వతమైన పేదరికం నుండి విముక్తి కలుగుతుంది. లబ్దిదారునికి అందే సాయం స్థిరమైనదిగా ఉండాలి.

-భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# 'దిమాగీ నక్సల్స్'పై ఆగ్రహం ఎందుకు?

నందూరి రవిశంకర్

పదాలు కూర్చి ప్రయోగించటంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిట్ట. ఆయనకు పొగడ్తలు తప్ప విమర్శలు నచ్చవు. ప్రజలు తమ బాధల గూర్చి, హక్కుల గూర్చి మాట్లాడటం అసలే గిట్టదు. పెట్టుబడి దారులకు పరమ మిత్రుడు, రైతులు, కార్మికులకు బద్ధ వ్యతిరేకి. గిట్టుబాటు ధరలకోసం నాలుగేళ్లగా పోరాటం చేస్తున్న పంజాబ్ హర్యానా రైతులు నిరసన తెలిపేందుకు దేశ రాజధానికి రాకుండా సరిహద్దుల్లోనే అణచివేత, నిర్బంధం. రైతులు ముందుకు రాకుండా రహదారిపై మేకులు కొట్టించిన తొలి ప్రభుత్వం మోడీ జీ దే. దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి మూడు రైతు వ్యతిరేక చట్టాలు ఉపసంహరించుకున్నాక కూడా ఆయనలో రైతుల పట్ల సానుభూతి పెరగలేదు. ఢిల్లీ వస్తున్న రైతులను పంజాబ్ సరిహద్దులలో పోలీసులు అడ్డుకున్నారు. పెట్టుబడిదారుల లాభాల కోసం వ్యాపారాలు సులభతరం విధానం అమలు చేస్తున్న ప్రధాని మోడీ కార్మికుల సంఘటిత శక్తిని, ఆ శక్తితో సాధించుకున్న హక్కులను హరించేందుకు 29 చట్టాలు రద్దుచేసి నాలుగు సంహితలను (కోడ్‌లు) చట్టాలుగా కూర్చారు. వాటికి వ్యతిరేకంగా నాలుగేళ్లగా 10కేంద్ర ట్రేడ్ యూనియన్‌లు నిర్విరామ ఆందోళన చేస్తున్నా, పలుమార్లు సార్వత్రిక సమ్మె చేసినా ఆయనకు చీమకుట్టినట్లు లేదు. జాతీయ విద్యావిధానం పేరుతో విద్యను హిందూత్వ సిద్ధాంతంలో పొదిగారు. విద్య కేంద్రీకరణ, పోటీ పరీక్షలు కేంద్రీకరణ. పరీక్షల నిర్వహణలో తప్పులు, అవకతవకలు, అక్రమాలు, అవినీతి కేంద్రీకరణ. మరోవైపున మావోయిస్టులను (నక్సలైట్‌లకు) భౌతికంగా ఏరివేశామన్న ఉత్సాహంలో ఉన్న ప్రధాని మోదీ, ఆయన అనుంగుశిష్యుడు హోంమంత్రి అమిత్ షాలను అనూహ్యమైన దెబ్బకొట్టారు కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) ఆన్‌లైన్ పిలుపుపై జెన్ జీ యువత ఈ నేపథ్యంలో, ఎర్రకోటనుంచి 80వ స్వాతంత్ర్య దినోత్సవం ప్రసంగంలో ప్రధానమంత్రి యువతకు ప్రకటించిన కొన్ని వరాలనుచూస్తే ఆశ్చర్యం కలుగకమానదు. అదే సమయంలో 'దిమాగీ నక్సలైట్' లు అని కొత్త పదం ఉపయోగించారు. దీని అర్థం ఏమిటి మహాశయా అని దేశంలోని రాజకీయ స్పృహ కలిగిన విద్యావంతులు, రాజకీయ, సామాజిక కార్యకర్తలు. మోదీజీ సామాన్యంగా వ్యర్థ పదాలు (రాజకీయ సభల్లో తప్ప) ఉపయోగించరు. అడవుల్లోని నక్సలైట్లను ఏరివేస్తున్నాం పట్టణాల్లో నక్సలైట్‌లు మరీ ప్రమాదకారులని గత సంవత్సరం హెచ్చరించిన మోదీ, ఇప్పుడు అడవుల్లోని నక్సలైట్లను ఏరివేశాం అని ఘనంగా చెప్పుకుంటూ, దిమాగీ (మేధావులు, విద్యావంతులని అర్థం)నక్సలైట్ల ప్రస్తావన చేశారు. వీరు ఇన్నాళ్లదాకా ప్రభుత్వంలో సలహాదారులుగా మావోయిస్టు భావజాలంతో విధానాలను ప్రభావితంచేశారు! ఇప్పుడు సమాజాన్ని ప్రభావితం చేయటం కొనసాగిస్తున్నారని వారు మన చుట్టూ ఉన్నారు, గుర్తించి ఏకాకులను చేయాల్సి అన్నారు. వామపక్ష మేధావుల గూర్చి ప్రధాని ఈ పదం వాడారన్నది స్పష్టం. ఆ భావజాలం పట్ల అప్రమత్తంగా ఉండాలి అంటున్నారంటే, ఇటీవల యువత, రైతులు, కార్మికుల ఆందోళనల వెనుక ఆ మేధావులు ఉన్నారనేఅన్యాపదేశంగా స్ఫురిస్తుంది. వామపక్ష భావజాలాన్ని అణచివేసే పేరుతో యూనివర్శిటీల్లో హింసాత్మక దాడులు ప్రేరేపించటం, అందుకు ఆర్‌ఎస్‌ఎస్, ఎబివిపిలను ప్రోత్సహించటం చూశాం, చూస్తున్నాం. బయట వామపక్ష మేధావులకు మావోయిస్టులు, అర్బన్ నక్సల్స్ అనే ముద్రవేసి దేశద్రో



హం, ప్రధాని హత్యకు కుట్ర వంటి ఆరోపణలు బనాయించి బెయిలుకు అవకాశంలేని జాతీయ భద్రత, ఉపా చట్టాల కింద అరెస్టు చేశారు. ఇది అసమ్మతిపై, భిన్నాభిప్రాయంపై దాడి. మానవ మేధస్సుకు, ప్రజాస్వామ్యానికీ విరుద్ధమైన శిలా సదృశ సమాజ నిర్మాణం ఆర్‌ఎస్‌ఎస్ వారి సిద్ధాంతం కదా! మత మార్గాల్లో దేశాన్ని విభజిస్తూ ఒకే ఆహార్యం, ఒకే భాష, శాకాహారం, సనాతన ఆచారాలు, నమ్మకాల ఆరాధన సిద్ధాంతం అసమ్మతిని, నిరసనను సహించకపోవచ్చు. కాని ఈ 21వ శతాబ్దంలో నిరసనను అణచాలనుకోవటం అవివేకమే కాగలదు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మాజీ హోంమంత్రి పి.చిదంబరం దిమాగీ నక్సల్‌గా ఉండటానికి నేను గర్విస్తాను" అని ఎక్స్‌లో పెట్టిన పోస్టు ఎస్టాబ్లిష్‌మెంట్‌ను కలవరపరిచినట్లుంది. పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి కిరణ్ రిజిజు హడావిడిగా మేల్కొని (తన ప్రకటనలోని వరుస సంఖ్యల్లో 3 అంకె లేకపోవటం సైతం గమనించలేదు) ప్రధాని వ్యాఖ్య ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా ఉద్దేశించింది కాదని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఆయన ప్రధానమంత్రి బుర్రలోకి దూరి ప్రధాని వ్యాఖ్యలు మావోయిస్టులను బలపరిచే వారికీ, భారత రాజ్యాంగాన్ని తిరస్కరించేవారికీ, వేర్పాటు వాదులను బలపరిచే వారికీ, ఆర్టికల్ 370ని బలపరిచేవారికీ, భారత్ నుండి ఈశాన్య రాష్ట్రాలను వేరుచేసేందుకు చికెన్ నెక్ ప్రాంతాన్ని వేరుచేయాలని కోరేవారికీ వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడినట్లు వివరించారు. అయితే బిజెపి ఎంపి నిషికాంత్ దూబె, బిజెపి ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్‌లు చిదంబరంపై ఎదురుదాడికి దిగి అణుబాంబుపై గతంలో ఆయన ప్రకటన 'దిమాగీ నక్సల్' ప్రకటనగా ఉందని, యుపిఎ ప్రభుత్వంలో కాషాయ టెర్రరిజం ప్రాజెక్టుకు ఆయన కన్సల్టెంట్ అని నిందించారు. ప్రధాని ప్రకటన రాజకీయ ప్రత్యర్థులపై ఎక్కుపెట్టబడిందేనని వీరి వ్యాఖ్యలు చెబుతున్నాయి. జాతీయవాదులు, ప్రగతిశీలురు, వామపక్షవాదులు, నియంతృత్వ వ్యతిరేక ప్రజాస్వామ్యవాదులు ప్రధాని లేబుల్‌ను ముక్తకంఠంతో ఖండించాలి. విద్యారంగ సమస్యలపై మధ్యప్రదేశ్‌లో స్కూలు పిల్లలు సైతం తమంతటతాము ఉద్యమిస్తున్నారు. అది జన్ జీ జాతీయస్థాయి ఆందోళన తెచ్చిన చైతన్యం. దాన్ని ఆపటం ఎవరితరం కాదు అంటున్నారు. సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించాం. 'దిమాగీ నక్సల్స్' మాత్రం మిగిలారు అంటూ ఎర్రకోట ప్రసంగంలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యల ఆధారంగా కొత్త పార్టీ పుట్టుకురావాన్ని గమనించాలి. మోదీ ఆ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే దిమాగీ నక్సల్ అనే పేరిట ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో తెరిచిన పార్టీ ఖాతాలకు అనూహ్య ఆదరణ లభించింది. ఇన్‌స్టాలో 1.81 లక్షల మంది, ఎక్స్‌లో 7వేలమంది ఆ ఖాతాలను అనుసరించారు. ఇన్‌స్టాలో 'దిమాగీ నక్సల్ పార్టీ' అని, ఎక్స్‌లో దిమాగీ నక్సల్ జనతా పార్టీ అని ఖాతాలు తెరిచారు. తమ పార్టీ వ్యవస్థాపకుడు ఓ దిమాగీ ఇండియన్ అని చెప్పుకొన్నారు. ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ఎప్పుడు ఎలా సృష్టించారనేది స్పష్టత లేదు గానీ ఎక్స్ ఖాతాను మాత్రం ఈ నెలలోనే తెరిచారు. మరోవైపు, మోదీ తన రాజకీయ ప్రత్యర్థులను తొలుత 'అర్బన్ నక్సల్స్' అన్నారు. ఇప్పుడు దిమాగీ నక్సల్స్ అని అంటున్నారు. మోదీలోని 'నిరాశానిస్పృహలను' తెలియ చేసే ప్రస్తావన ఇది. అని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్"ఎక్స్‌లో విమర్శించారు. అవును.. నేను దిమాగీ నక్సల్‌నేనని కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం అన్నారు. నిజమైన దేశభక్తునిగా బీజేపీకి లొంగబోనని, దిమాగీ నక్సల్‌గా ఉండేందుకు గర్విస్తానని "ఆప్ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, విద్యా సంస్కరణల కోసం ఉద్యమిస్తున్న జన్ జీ యువతకు యోగా గురువు బాబా రామ్‌దేవ్ మద్దతు ప్రకటించారు."విద్యా వ్యవస్థలో కుంభకోణంపై దృష్టిసారించండి. లేదంటే 'నేను సైతం ఉద్యమిస్తా'ననే ధోరణిలో ఆయన ముక్తాయింపునిచ్చారు. ●

# ఆచూకీ కోసం 'పెద్ద రెస్క్యూ'



**ఆకస్మిక వరద అనంతరం విపత్కర పరిస్థితుల్లో కొనసాగుతున్న సహాయక చర్యలు**

**జలవిద్యుత్ సొరంగాల్లో చిక్కుకున్న వందలాది మంది**

**గుర్తుతెలియని మృతదేహాలకు సామూహిక ఖననాలు**

**టిబెట్‌లో గల్లంతైన విదేశీయుల జాబితాలో నేపాల్, భారత్, లాత్వియా వాసులు అత్యధికులు**

**చిత్వాన్/బీజింగ్, ఆగస్టు 30:** హిమానీనదం కూలిపోవడంతో హిమాలయాల్లో వినాశకరమైన బురద ప్రవాహం విరుచుకుపడింది. ఈ ఘటనలో గల్లంతైన వేలాది మందిని కనుగొనేందుకు నేపాల్, చైనాలలో సహాయక బృందాలు ఆదివారం తీవ్రంగా ప్రయత్నించాయి. సవాలుతో కూడిన వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న నీటిమట్టాలను ఎదుర్కొన్నారు. బుధవారం పర్వత లోయలు, నదుల గుండా మంచు, రాళ్లు, బురద, శిథిలాల ప్రవాహం ఉధృతంగా ప్రవహించి, విస్తృతమైన విధ్వంసం సృష్టించడంతో, నేపాల్- చైనా సరిహద్దుకు ఇరువైపులా 3,000 మందికి పైగా గల్లంతయ్యారని, ఆదివారం ఉదయం నాటికి మృతుల సంఖ్య 750కి పెరిగిందని అధికారులు తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావం వల్లే ఈ విపత్తు సంభవించిందని చైనా పేర్కొంది. ఈ విపత్తు కారణంగా 90,000 మందికి పైగా ప్రజలు ప్రభావితమై ఉండవచ్చని రెడ్ క్రాస్ అంచనా వేసింది. శనివారం జరిగిన టెలిఫోన్ సంభాషణలో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ తన నేపాల్ సహచర మంత్రితో మాట్లాడుతూ, ఇటీవలి సంవత్సరాలలో తాము ఎదుర్కొన్న "అత్యంత తీవ్రమైన సరిహద్దు విపత్తు ఇదేనని, సహాయక చర్యలు అపూర్వమైన క్లిష్టతకు, సంక్లిష్టతకు చేరుకున్నాయని పేర్కొన్నారు. నేపాల్ విపత్తుల శాఖ 734 మంది మరణించారని, 2,498 మంది గల్లంతయ్యారని, 7,514 మందిని రక్షించారని తెలిపింది. చైనా వైపున, గిరాంగ్ కౌంటీలో 16 మంది మరణించారని, 546 మంది గల్లంతయ్యారని అధికారులు తెలిపారు.

నేపాల్‌తో ఉన్న కీలక సరిహద్దు దాటే ప్రదేశానికి సమీపంలో ఉన్న టిబెట్‌లో 23 దేశాలకు చెందిన 261 మంది విదేశీయుల ఆచూకీ తెలియడం లేదని బీజింగ్ తెలిపింది. ఈ విపత్తు తీవ్రత, కఠినమైన హిమాలయ పర్వత ప్రాంతాలలో సహాయక చర్యలను మరింత క్లిష్టతరం చేసింది. తాజా వర్షాల కారణంగా గత కొన్ని గంటలుగా త్రిశూలి నది నీటిమట్టం పెరగడంతో, అదనపు వరదల భయాలు నెలకొన్నాయి. దీంతో నివాసితులు, సహాయక సిబ్బంది ఎత్తయిన ప్రదేశాలకు తరలివెళ్లారని నేపాల్‌లోని స్థానిక పోలీసులు తెలిపారు. ప్రతికూల వాతావరణం, అలాగే ఈ విపత్తు కారణంగా నేపాల్- చైనా



సరిహద్దుకు ఆవలి వైపున ఏర్పడిన సరస్సు పొంగిపొర్లి నేపాల్‌లోని లెండే ఖోలా, త్రిశూలి నదులలోకి ప్రవహించడం వల్ల మళ్లీ వరదలు సంభవించవచ్చనే ఆందోళనల కారణంగా శుక్రవారం నుంచి సహాయక చర్యలను పలు మార్లు నిలిపివేశారు. దిగువ ప్రాంతాలను ముంచెత్తుతున్న సరస్సును శనివారం నాటికి కల్లా చాలా వరకు ఖాళీ చేశారని అధికారులు తెలిపారు. కానీ, శనివారం రాత్రి ఆలస్యంగా, సరస్సుకు 2.8 కిలోమీటర్ల (1.7 మైళ్ల) దిగువన కొండచరియ విరిగిపడటాన్ని డ్రోన్లు గుర్తించాయి. దీనివల్ల ఒక కొత్త ఆనకట్ట ఏర్పడి, తాజాగా నీటి మడుగు ఏర్పడింది.

నేపాల్‌లో, వరదల వల్ల దెబ్బతిన్న జలవిద్యుత్ కేంద్రాల వద్ద సొరంగాలలో చిక్కుకుపోయారని భావిస్తున్న వందలాది మందిపై సహాయక చర్యలు మరింతగా కేంద్రీకరించబడ్డాయి. సొరంగాలలో చిక్కుకున్న వారిని రక్షించే చర్యలు, డిఎన్ఏ పరీక్షలు, మృతదేహాలను శీతలీకరించిన నిల్వ, కుళ్ళిపోయిన అవశేషాల ఫోరెన్సిక్ గుర్తింపు వంటి ప్రత్యేక రంగాలలో నేపాల్‌కు అంతర్జాతీయ సహాయం అవసరమని



నేపాల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లోక్ బహదూర్ ఛెత్రి తెలిపారు. సొరంగాలను తెరవడానికి, సహాయకచర్యలకు మద్దతు ఇవ్వడానికి భారత, చైనా నిపుణులు ఇప్పటికే పనిచేస్తున్నారని ఛెత్రి చెప్పారు.

**కుళ్లిపోతున్న మృతదేహాలకు సామూహిక ఖననాలు:** తమ వారి కోసం నిస్సహాయ బంధువులు ఆసుపత్రులు, శవగారాలు, సహాయక కేంద్రాల మధ్య తిరిగిన కొన్ని రోజుల తర్వాత, కుళ్లిపోవడం ప్రారంభమైన వందలాది గుర్తుతెలియని బాధితుల మృతదేహాలకు నేపాల్ అధికారులు సామూహిక ఖననాలను ప్రారంభించారు. విపత్తు ప్రత్యక్ష ప్రభావం నుండి తప్పించుకున్న చిత్వాన్ జిల్లాలో, వరద ప్రభావిత రసువా ప్రాంతం నుండి ప్రవాహానికి కొట్టుకువచ్చిన మృతదేహాలు నదీ ప్రవాహంతో నారాయణి నదిలో కలిశాయి. ఖననం తర్వాత కుటుంబాలు తమ బంధువులను గుర్తించగలరేమో నన్న ఆశతో అధికారులు మృతదేహాలను ఫొటోలు తీస్తున్నారు, డిఎన్ఏ నమూనాలను సేకరిస్తున్నారు. గుర్తింపు వివరాలను నమోదు చేస్తున్నారు. "తాము ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాలలో సగానికి పైగా గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాయి" అని పోలీసు అధికారి అనిల్ థాపా తెలిపారు. "చాలా వాటికి ముఖాలు కనిపించడం లేదు. కొన్ని సందర్భాల్లో, చేతులు లేదా కాళ్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. మరికొన్నింటిలో, శరీరంలోని భాగాలు మాత్రమే లభ్యమవుతున్నాయి. అనేక సందర్భాల్లో, తలలో సగానికి పైగా లేదు" అని వివరించారు. శనివారం 100కు పైగా గుర్తుతెలియని మృతదేహాలకు ఖననం చేసిన తర్వాత, అధికారులు ఆదివారం మరో వందకు పైగా మృతదేహాలను సామూహిక ఖననం చేశారు.

**వాతావరణ మార్పులతోనే..:** "గ్లోబల్ వార్మింగ్ దీర్ఘకాలిక ప్రభావాల కింద హిమానీనదాల అస్థిరత కారణంగానే" ఈ వరద సంభవించిందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. టిబెటన్ పీఠభూమిపై ఇది "క్రయోస్ఫియర్ విపత్తుల ఒక కొత్త, ప్రముఖ లక్షణం" అని పేర్కొన్నారు. నేపాల్ వైపు నుండి వచ్చిన ఈ కొండచరియలు గిరాంగ్ సరిహద్దు దాటే ప్రదేశానికి చేరుకోవడానికి ఆరు నుండి ఏడు నిమిషాలు పట్టిందని చైనా శాస్త్రవేత్తలు వివరించారు.

# డిఫరెంట్ లుక్‌లో ప్రధాని మోడీ

**తాష్కెంట్, ఆగస్టు 30:** ప్రధాని మోడీ తన తాష్కెంట్ పర్యటనలో ఆదివారం డిఫరెంట్ లుక్‌లో కనిపించారు. టీ షర్ట్, ట్రాక్ ప్యాంట్ ధరించారు. ముదురు నీలం రంగు జిమ్ టీ షర్ట్, ట్రాక్ ప్యాంట్, దానికి తగ్గ షూస్ ధరించారు. సాధారణంగా అధికారిక పర్యటనల్లో సూట్ తో కనిపిస్తుంటారాయన. ఇది యోగా సెషన్ కావడం వల్ల క్యాజువల్ దుస్తులనే వేసుకున్నారు. యోగా సెషన్‌లో కలియదిరిగారు. ఆసనాలను స్వయంగా తిలకించారు. వారికి కొన్ని చిట్కాలు చెప్పారు. యోగా విశిష్టత గురించి వివరించారు. నిత్య జీవితంలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవడానికి, ప్రశాంతతను సాధించ డానికి యోగా సాధన ఎంతగానో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా ఉజ్బెకిస్తాన్‌నుంచి కూడా యోగ అభ్యాసకులు విరివిగా పాల్గొన్నారు. వీరిలో ఎంపికచేసిన కొందరు యువతులు యోగా నిర్వహించి ప్రధాని మోడీని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ నిత్యజీవనంలో యోగా బాగం కావాలని, యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం అని చెప్పారు. ఈసందర్భంగా యోగా కార్యాచరణలో కొన్ని మెళకువలను కూడా వారికి సూచించారు.



# ఉక్రెయిన్‌పై రష్యా దాడుల బీభత్సం

## 27 మంది పౌరులు మృతి

**కీవ్, ఆగస్టు 30:** ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగర శివార్లలలో రష్యా సైన్యం దారుణ మారణహోమానికి పాల్పడింది. రష్యా ప్రయోగించిన డ్రోన్లు కీవ్ సమీపంలోని ఓ భారీ గోదామును ఢీకొట్టడంతో భయంకరమైన పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో కనీసం 27 మంది అమాయక పౌరులు కోల్పోగా, వంద మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. అర్థరాత్రి జరిగిన ఈ దాడితో ఆ ప్రాంతమంతా అగ్నిగుండంగా మారింది. ఆకాశాన్ని తాకేలా మంటలు చెలరేగడంతో స్థానికులు ప్రాణభయంతో వణికిపోయారు. శిథిలాల కింద ఇంకా చాలామంది చిక్కుకుపోవడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని కీవ్ సైనిక పరిపాలన విభాగం అధిపతి తైమూర్ తకచెంకో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ దాడితో కీవ్ పరిసర ప్రాంతాలు శ్మశానాన్ని తలపిస్తున్నాయి.

విచారణకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆదేశం

ఈ భయానక ఘటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ తీవ్రంగా స్పందించారు. డ్రోన్ దాడులతోపాటు గోదాములో పేలుడు సంభవించడానికి గల కారణాలపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జనావాసాలకు దగ్గరగా ముందుగుండు సామగ్రిని నిల్వ చేయడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నివాస ప్రాంతాల మధ్యలో ఇలాంటి ప్రమాదకర ఆయుధాలను ఉంచడం ఏమాత్రం సమర్థనీయం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**డ్రోన్ల తయారీ కేంద్రమే లక్ష్యం:** ఈ దాడులపై రష్యా రక్షణ శాఖ భిన్నమైన వాదనను వినిపించింది. తాము కేవలం సైనిక స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నామని స్పష్టం చేసింది. ఉక్రెయిన్ సైన్యం డ్రోన్ల తయారీ కోసం ఉపయోగిస్తున్న పరికరాలను నిల్వ చేసిన ఆయుధాగారంపైనే తమ బలగాలు దాడి చేసినట్లు రష్యా ప్రకటించింది. ఉక్రెయిన్ చెబుతున్నట్లుగా అది సాధారణ గోదాము కాదని బదులిచ్చింది.



**కొనసాగుతున్న బీభత్సం**

రష్యా, ఉక్రెయిన్ మధ్య దాదాపు రెండున్నరేళ్లుగా భీకర యుద్ధం సాగుతూనే ఉంది. ఈ పోరులో ఇరు దేశాలు డ్రోన్ దాడులను తీవ్రం చేశాయి. తాజా దాడి కీవ్ పరిసరాల్లో జరిగిన అత్యంత దారుణమైన మారణకాండల్లో ఒకటిగా నిలిచింది. ఇరు దేశాల మధ్య శాంతి చర్చల ప్రస్తావన వస్తున్న సమయంలోనే రష్యా ఈ స్థాయి దాడికి పాల్పడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# నషాముక్త్ భారత్ లక్ష్యాన్ని యువత సాకారం చేయాలి

## మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** వికసిత్ భారత్ లక్ష్యం సాకారమయ్యేందుకు దేశానికి డ్రగ్స్ పీడ వదిలిపోవాలని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. మన్ కీ బాత్ రేడియో కార్యక్రమం 137వ ఎపిసోడ్‌లో నేడు ప్రధాని మోడీ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. భారత దేశ భవితను కాపాడుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఇటీవల ప్రారంభమైన నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని ప్రధాని మోడీ అన్నారు. భారీ సంఖ్యలో యువత ఈ కార్యక్రమంలో పాల్గొంటోందని చెప్పారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా కంటెంట్ క్రియేటర్లు తమ తమ భాషల్లో ప్రచారం చేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ వ్యసనం కుటుంబాలను, సమాజాన్ని నాశనం చేస్తుందని హెచ్చరించారు. మాదకద్రవ్యాలకు యువత ఎందుకు దూరంగా ఉండాలో విశదీకరించాలని కంటెంట్ క్రియేటర్లకు సూచించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న వారిని, ఈ వ్యసనానికి బానిసలైన వారికి సాయం చేసే వారిని ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించారు. వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన సందర్భంలో ఈ సంవత్సరం భారతీయులందరికీ ఎంతో ప్రత్యేకమైనదని కూడా ప్రధాని చెప్పారు. సూర్యపథ్ తిరంగా కార్యక్రమం ద్వారా ఈ ఏడాది మువ్వన్నెల జెండా యావత్ ప్రపంచాన్ని చుట్టొచ్చిందని అన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ఉద్దేశించిన పీఎం స్వనిధి యోజన గురించి ప్రధాని మాట్లాడారు. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 35 లక్షల మంది మహిళలు తమ వ్యాపారాలను విస్తరించగలిగారని అన్నారు. పరిశరాల పరిశుభ్రతపై నిరంతరం దృష్టి పెట్టాలని కూడా పిలుపునిచ్చారు. స్థానిక ఉత్పత్తులకు భారతీయులు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా సూచించారు. పీఎం స్వనిధి పథకం ద్వారా లక్షలాది మంది తల్లులు, సోదరీమణులు కొత్త శక్తిని పొందుతున్నారు. మహిళా సాధికారతకు సంబంధించిన ఈ అంశంపై జరగాల్సినంత చర్చ జరగడం లేదని మోడీ అన్నారు. పీఎం స్వనిధి పథకం లబ్ధిదారుల్లో దాదాపు 46 శాతం మంది మహిళలేనని, అంటే దేశవ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మహిళలు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు ఈ పథకంతో అనుసంధానమయ్యారని ప్రధాని తెలిపారు. కరోనా మహమ్మారి సమయంలో ఆర్థిక ఇబ్బందులతో దెబ్బతిన్న వీధి వ్యాపారులు తిరిగి తమ వ్యాపారాలను ప్రారంభించుకునేందుకు సహాయం చేయాలనే ఉద్దేశంతో 2020 జూన్‌లో పీఎం స్వనిధి పథకాన్ని ప్రారంభించారు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి వీధి వ్యాపారులకు ఇది కేవలం ఆర్థిక సహాయంగా మాత్రమే కాకుండా వారి ఆర్థిక కార్యకలాపాలకు గుర్తింపు, అధికారిక గుర్తింపు కల్పించే సాధనంగా కూడా మారిందని ప్రభుత్వం పేర్కొంటోంది.

తొలుత 2024 డిసెంబర్ 31 వరకు అమలు చేయాలని నిర్ణయించిన ఈ పథకాన్ని తాజాగా 2030మార్చి 31 వరకు పొడిగించారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోడీ ఉజ్బెకిస్థాన్‌లో అధికారిక పర్యటనలో ఉన్నారు. మన్ కీ బాత్‌రేడియో కార్యక్రమాన్ని సాధారణంగా కొన్ని రోజుల ముందుగానే రికార్డు చేసి ప్రతినెల చివరి ఆదివారం ప్రసారం చేస్తారు. ఆంధ్రప్రదేశ్ లోని వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన వరదరాజ్ కథే దీనికి సరైన ఉదాహరణ. ఏళ్ల తరబడి తన పొలంలో టమోటాలు, అరటి పంటలే వేసేవారు.

# హెచ్4 ఎడి రద్దుకు ట్రంప్ సర్కార్ కసరత్తు

**వాషింగ్టన్, ఆగస్టు 30:** అమెరికాలో హెచ్1బీ వీసాదారుల భాగస్వాములకు జారీ చేసే వర్క్ పర్మిట్లు హెచ్4 ఈఏడీ రద్దు చేసేందుకు ట్రంప్ యంత్రాంగం మరోసారి ప్రయత్నాలు మొదలు పెట్టింది. దశాబ్దకాలంగా అమల్లో ఉన్న ఈ విధానాన్ని వెనక్కి తీసుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ పరిణామం అమెరికాలో స్థిర పడిన వేలాది భారతీయ కుటుంబాల్లో ఆందోళన నింపింది. ఈ మార్పు తక్షణమే అమలులోకి రావడం లేదని, ప్రస్తుత నిబంధనలు యథాతథంగా కొనసాగుతాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ డీహెచ్ఎస్ తన 2026 యూనిఫైడ్ ఎజెండాలో రిన్1615-ఎడి14 పేరిటఈ ప్రతిపాదనను చేర్చింది. 2015లో ఒబామా హయాంలో తీసుకొచ్చిన నిబంధనను రద్దు చేసి, పాత విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

# వరదల్లో.. 1600 మంది విద్యార్థుల ప్రాణాలు కాపాడిన ప్రిన్సిపాల్

**ఖాట్మండు, ఆగస్టు 30:** ఒక టీచర్ సమయస్ఫూర్తితో తీసుకున్న ఒక నిర్ణయం వందలాది కుటుంబాల్లో వెలుగులు నింపింది. విధి సవాల్ విసిరిన వేళ ఒక సాధారణ ఉపాధ్యాయుడు అసాధారణ హీరోగా నిలిచాడు. నేపాల్‌లో ఆకస్మిక వరదలు పాఠశాలను ముంచెత్తడానికి కేవలం కొద్ది నిమిషాల ముందు, 1643 మంది విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలించి వారి ప్రాణాలను కాపాడారు ఓ ప్రిన్సిపల్. ఆయన చూపిన ధైర్యం, కర్తవ్య నిరతిపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. నేపాల్‌లోని నువాకోట్ జిల్లా, త్రిశూలి లోయలో ఉన్న త్రిభువన్ త్రిశూలి సెకండరీ స్కూల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈనెల 26 ఉదయం సుమారు 9:20 గంటలకు పాఠశాల ప్రిన్సిపల్, 47 ఏళ్ల ఇంగ్లీష్ టీచర్ అయిన రాజేంద్ర దవాడీకి తన స్నేహితుడి నుంచి ఒక ఫోన్ కాల్ వచ్చింది. సమీపంలోని ఒక గ్రామం పూర్తిగా వరదలో కొట్టుకు



పోయిందని, వెంటనే అక్కడి నుంచి పారిపొమ్మని ఆ స్నేహితుడు హెచ్చరించాడు. అదే సమయంలో ఓ విద్యార్థి తండ్రి పరుగెత్తుకుంటూ వచ్చి నీటి మట్టం వేగంగా పెరుగుతోందని చెప్పాడు. పరిస్థితి తీవ్రతను క్షణాల్లో అర్థం చేసుకున్న రాజేంద్ర దవాడీ ఏమాత్రం ఆలస్యం చేయలేదు. వెంటనే పాఠశాల గంటను మోగించారు. తరగతి గదుల్లోని విద్యార్థులందరినీ బయటకు తీసుకురావాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. స్కూల్ బస్ డ్రైవర్లకు ఫోన్ చేసి వెనక్కి తిరిగి వెళ్లి పోవాలని సూచించారు. ఆయన హెచ్చరికతో విద్యార్థులంతా సమీపంలోని ఎత్తైన ప్రదేశానికి పరుగులు తీశారు. అందరూ ఓ బోధి వృక్షం కింద తలదాచుకున్నారు. వారు అలా వెళ్లిన కొద్ది నిమిషాలకే, పెను ప్రవాహంతో వచ్చిన వరద నీరు మూడు అంతస్తుల కాంక్రీట్ పాఠశాల భవనాలను పేకమేడల్లా కూల్చేసింది. ప్రిన్సిపల్ సత్వర నిర్ణయం వల్ల 1643 మంది విద్యార్థులు ప్రాణాలతో బయటపడ్డారు. ఉపాధ్యాయ సిబ్బందిలో చాలామంది సురక్షితంగా బయటపడగా, దురదృష్టవశాత్తు ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. నది ఒడ్డున ఉన్న తన గదికి వెళ్లిన 32 ఏళ్ల సోషల్ హిస్టరీ టీచర్ సంతోష్ పరియార్, పాఠశాల జానిటర్ సుల్తాన్ లామా వరద ఉధృతికి కొట్టుకుపోయి మరణించారు. అయితే, తనపై వస్తున్న ప్రశంసలపై రాజేంద్ర దవాడీ ఎంతో వినమ్రంగా స్పందించారు. ఆ సమయంలో నేను చేయగలిగింది ఇంకేముందని ఆయన వ్యాఖ్యానించారు.

# ప్రవాసభారతీయులు కర్మభూమితోపాటు జన్మభూమిని గుర్తుంచుకోవాలి



మాడిసన్‌స్క్వేర్ సభలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

**న్యూయార్కు, ఆగస్టు 30:** ప్రవాస భారతీయులు వారు నివసిస్తున్న, పనిచేస్తున్న దేశానికే సంపూర్ణ విధేయతతో ఉండాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చెప్పారు. అయితే కర్మభూమికి విధేయంగా ఉంటూనే జన్మభూమిని కూడా గుర్తుంచుకోవాలని, మరిచిపోవద్దని న్యూయార్క్‌లోని ప్రఖ్యాత మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరిగిన యూనివర్సల్ వన్‌నెస్ సెలబ్రేషన్స్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయులను ఉద్దేశించి భగవత్ మాట్లాడుతూ మీరు అమెరికాలో ఉన్నారు. ఇక్కడే జీవిస్తున్నారు, ఇక్కడే సంపాదిస్తున్నారు. కాబట్టి మీరు అమెరికాకు నిజాయతీగా మెలగాలని స్పష్టంచేశారు. అదే సమయంలో భారత్ వారి జన్మభూమి అని గుర్తుచేశారు. కర్మభూమిపట్ల తమ బాధ్యతలను నెరవేర్చిన తర్వాత, జన్మభూమి అయిన భారత్‌కు సేవ చేసేందుకు వారికి అవకాశం ఉందని, అది నిషిద్ధం కాదని చెప్పారు. ఈ విధంగా ప్రవాసులు తమ విధేయత, బాధ్యతలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. భిన్నత్వంలో ఏకత్వం అనేది భారతీయుల డీఎన్ఏలోనే ఉందని భగవత్ అన్నారు. అమెరికాను ప్రస్తావించినప్పుడు బహుళత్వం అనే పదం వస్తుందని, అదే భారత్ గురించి మాట్లాడితే భిన్నత్వంలో ఏకత్వం అనే మాట వినిపిస్తుందని చెప్పారు. ఈ ఏకత్వం, భిన్నత్వం రెండూ భారత ప్రజల రక్తంలోనే ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. భిన్నత్వం కారణంగానే ఏకత్వం మరింత శోభాయమానంగా ఉంటుందని, కాబట్టి దానిని మనం ఉత్సవంలా జరుపుకోవాలని అన్నారు. స్వామి వివేకానంద చెప్పిన మాటలను ఉటంకిస్తూ, భిన్నత్వంలో ఏకత్వం అనే సూత్రాన్ని ప్రపంచానికి చాటిచెప్పడమే భారత్ విధి అని తెలిపారు. తన ప్రసంగంలో భగవత్ పలు తాత్విక అంశాలను కూడా ప్రస్తావించారు. భౌతిక సుఖాలు తాత్కాలికమని, అవి శాశ్వతమైన సంతృప్తిని ఇవ్వలేవని అన్నారు. డోనట్స్ తినే ఉదాహరణను చెబుతూ ఒక దశలో ఎక్కువగా తిన్న తర్వాత వాటిపై ఆసక్తి పోతుందని, కానీ మళ్లీ కొంతకాలానికి తినాలనిపిస్తుందని వివరించారు. భౌతిక ఆనందం మితిమీరితే సంతృప్తినివ్వడంలో విఫలమవుతుందని చెప్పారు. దేహాలు, వస్త్రధారణ, పూజా విధానాలు వేరైనా మానవులంతా ఒకే ఆధ్యాత్మిక సూత్రంతో ముడిపడి ఉన్నారని అన్నారు. డబ్బు సంపాదన, భౌతిక విజయాలే జీవితంలో అంతిమ లక్ష్యాలు కాదని హితవు పలికారు.

# సంక్షిప్త వార్తలు

## పంజాబ్ ఆప్ నేత దారుణ హత్య



**అమృత్‌సర్, ఆగస్టు 30:** పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకుడు ఒకరు దారుణ హత్యకు గురయ్యారు. ఫిరోజ్‌పూర్ జిల్లా మమ్‌దోత్ పట్టణంలో గుర్‌ప్రీత్‌సింగ్ గోపి అనే నేతను దుండగులు కాల్చి చంపారు. నిన్న చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. రాజకీయ కక్షల కారణంగానే ఈ హత్య జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. గుర్‌ప్రీత్ సింగ్ తన స్నేహితుడు హర్‌ప్రీత్‌తో కలిసి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా, కారులో వచ్చిన దుండగులు, గుర్‌ప్రీత్ బైక్‌ను వెంబడించి కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన గుర్‌ప్రీత్ అక్కడికక్కడే మృతి చెందారు.

## మృత్యుంజయి ఆరేళ్ల బాలిక

**ఖాట్మండు, ఆగస్టు 30:** నేపాల్‌లో సంభవించిన ఘోర వరదల్లో ఒక అద్భుతం చోటుచేసుకుంది. హిమాలయ దేశాన్ని అతలాకుతలం చేసిన ఆకస్మిక వరదల కారణంగా 650 మందికి పైగా మరణించిన విషయం తెలిసిందే. ఈ విపత్తు జరిగిన మూడు రోజుల తర్వాత, రసూవా జిల్లాలో మట్టి, శిథిలాల కింద చిక్కుకున్న ఆరేళ్ల బాలికను రెస్క్యూ సిబ్బంది ప్రాణాలతో కాపాడారు. రసూవా జిల్లాలోని టిమురే ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. భోటే కోశి నదికి వచ్చిన వరదల వల్ల గల్లంతైన వారి కోసం ఆర్మ్‌డ్ పోలీస్‌ఫోర్స్ బృందం శుక్రవారం గాలిస్తుండగా, శిథిలాల కింద నుంచి చిన్నారిఏడుపులు వినిపించాయి. వెంటనే ఆ బాలికను సురక్షితంగా బయటకు తీశాయి.




## హార్ముజ్‌లో ఇప్పటికీ కదలని నౌకలు

**టెహ్రాన్, ఆగస్టు 30:** మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర అనిశ్చితి కొనసాగుతోంది. హర్మూజ్ జలసంధిలో ఏర్పడిన సంక్షోభం కారణంగా గత ఆరు నెలలుగా సుమారు 400నౌకలు, వాటిలోని దాదాపు 6వేల మంది సిబ్బంది చిక్కుకుపోయారని అంతర్జాతీయ సముద్రయాన సంస్థ వెల్లడించింది. ఈ సంక్షోభం ఇంకా సమసిపోలేదని ఐఎంఓ సెక్రటరీ జనరల్ ఆర్సెనియో డొమింగ్యూజ్ తెలిపారు. కొన్ని నౌకలు, సిబ్బంది ఆ ప్రాంతం నుంచి బయటపడగలిగినప్పటికీ, వేలాది మంది నావికులు ఇప్పటికీ తీవ్ర ముప్పును, అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు.

## రేవ్‌పార్టీపై కాల్పులు..ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు



**జ్యూరిచ్, ఆగస్టు 30:** స్విట్జర్లాండ్లో దారుణం జరిగింది. ఒక రేవ్ పార్టీపై కాల్పులు జరపడంతో ఒకరు మరణించారు. మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటన నార్తర్న్ స్విట్జర్లాండ్‌లోని అరావు ప్రాంతంలో ఆదివారం వేకువఝామున జరిగింది. ఆరావు ప్రాంతంలోని ఒక రేస్ కోర్సులో అరావు రేవ్ వాల్యూమ్ 7 పేరుతో ఒక స్విట్జర్లాండ్ ఈవెంట్ కంపెనీ రేవ్ పార్టీ ఏర్పాటు చేసింది. దీనికి దాదాపు 3,500 మంది వరకు హాజరయ్యారు. అయితే, ఒక గుర్తు తెలియన వ్యక్తి వేకువఝామున ఈవెంట్‌లో పాల్గొన్న వ్యక్తులపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఒక వ్యక్తి అక్కడే మరణించాడు.



## మెస్సీ అభిమానులకు సువేందు ఊరట

**కోల్‌కత్తా, ఆగస్టు 30:** ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ కార్యక్రమానికి హాజరై తీవ్రనిరాశకు గురైన అభిమానులకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి భారీ ఊరట కల్పించారు. గతేడాది గందరగోళం మధ్య జరిగిన ఈవెంట్‌కు టికెట్లు కొనుగోలు చేసిన సుమారు 33,000 మంది అభిమానులకు వారి డబ్బును తిరిగి చెల్లిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర క్రీడా బడ్జెట్ నుంచి ఈ నిధులను వాపస్ ఇచ్చే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించినట్టు సీఎం వెల్లడించారు.

## రష్యాకు ముడిచమురు ఎగుమతిచేస్తున్న భారత్

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** అంతర్జాతీయ ఇంధనమార్కెట్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సాధారణంగా ముడిచమురుకోసం రష్యాపై ఆధారపడే భారత్, ఇప్పుడు అదే రష్యాకు పెట్రోల్ ఎగుమతి చేసే కీలక దేశంగా అవతరించింది. ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో రష్యాలోని చమురు రిఫైనరీలు తీవ్రంగా దెబ్బతినడమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో ఏర్పడిన తీవ్రమైన ఇంధన కొరతను అధిగమించేందుకు రష్యా, భారత్ నుంచి పెట్రోల్‌ను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఎనర్జీ అనలిటిక్స్ సంస్థ వోర్టెక్సా నివేదిక ప్రకారం గతరెండు నెలల్లో రష్యా రిఫైనరీలపై సుమారు 32 సార్లు డ్రోన్ దాడులు జరిగాయి. దీనివల్ల దేశీయంగా పెట్రోల్ ఉత్పత్తి ఏకంగా 70 పడిపోయింది. ఫలితంగా రష్యాలోని పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి.

# పుష్కరాలకు ప్రణాళికాబద్ధంగా పనులు



ప్రజాభవన్‌లో ప్రత్యేక అధికారి కార్యాలయం ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు 30:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ, తెలంగాణ అంటే గోదావరి పుష్కరాలు అనేలా దేశం నలుమూలలా తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పేలా పుష్కరాల ఏర్పాట్లు ఉండాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితోపాటు తెలంగాణ ఆతిథ్యం, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనం ప్రతిబింబించేలా వసతుల కల్పన ఉండాలని మంత్రి సురేఖ అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రంలో వచ్చే యేడాది జూన్ 26 నుంచి నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లను సమర్థవంతంగా సమన్వయం చేసేందుకు ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన స్పెషల్ ఆఫీసర్ (ప్రత్యేక అధికారి) కార్యాలయాన్ని ఆదివారం మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. సెక్షన్లను దేవాదాయ శాఖ అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. తర్వాత ప్రత్యేకాధికారి కార్యాలయంలోని నూతన కాన్ఫరెన్స్ హాలులో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, ఆర్జేసి రామకృష్ణారావు, డిసి కృష్ణప్రసాద్, పలువురు దేవాదాయ శాఖ అధికారులు, ఉద్యోగులు, ఇంజినీర్లు, ఆర్కిటెక్ట్‌లు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు. గోదావరి పుష్కరాలు అనగానే ఇప్పటి వరకు రాజమహేంద్రవరం పేరు ప్రధానంగా వినిపించేదని, వచ్చే గోదావరి పుష్కరాల నిర్వహణతో తెలంగాణ తన ప్రత్యేకతను చాటుకుని, పుష్కరాలు అంటే తెలంగాణ అనే స్థాయిలో రాష్ట్రానికి ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు.

పుష్కరాలకు వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మౌలిక వసతుల కల్పన, ఘాట్ల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, వైద్యసేవలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై ప్రత్యేక అధికారి కార్యాలయం కీలక సమన్వయ కేంద్రంగా పనిచేయడంతోపాటు, పుష్కరాల నిర్వహణకు సంబంధించిన పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించడానికి వీలవుతుందని మంత్రి స్పష్టం చేశారు. పుష్కరాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు సిఎం రేవంత్ రెడ్డి రూ.1000 కోట్ల నిధులను మంజూరు చేయడం హర్షణీయమని అన్నారు. ఈ సందర్భంగా అధికారులు పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించిన సమగ్ర ప్రణాళికను మంత్రి కొండా సురేఖకు వివరించారు. గోదావరి పరిహాక ప్రాంతంలో ఎంచుకున్న ప్రాంతాల్లో ఇప్పటికే ఘాట్ల నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు డైరెక్టర్ హనుమంతరావు వివరించారు. టైర్-1, టైర్-2 పరిధిలో సుమారు 2 కి.మీ మేర ఘాట్‌ల నిర్మాణ పనులు ప్రారంభించగా, మొత్తంగా టైర్ 1, 2, 3 పరిధిలో 5 కి.మీకి పైగా ఘాట్‌లను నిర్మించ నున్నట్లు వెల్లడించారు.

పలు ఘాట్ల నమూనా చిత్రాలను అధికారులు మంత్రి సురేఖ పరిశీలించారు. పాత ఘాట్లను పటిష్టం చేస్తూ, కొత్త ఘాట్లను మళ్ళీ వచ్చే పుష్కరాల వరకు మనగలిగేలా పటిష్టంగా నిర్మించాలని మంత్రి సురేఖ అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. పుష్కరాల కోసం చేసే ఏర్పాట్లను తాత్కాలికమైనవిగా భావించకుండా, భవిష్యత్ కార్యక్రమాలను ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు.

'గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధి పనులతో పాటు గోదావరి పుష్కర ఏర్పాట్లు కూడా భవిష్యత్ తరాలు సైతం కీర్తించేలా ఉండాలి. మన ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడుతూ, దేవాలయాల ప్రాచీన వైభవానికి మరింత వన్నె తెచ్చేలా, నాణ్యతతో కూడిన శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలి' అని మంత్రి సురేఖ సూచించారు. మహిళలు బట్టలు మార్చుకునేందుకు అవసరమైన సౌకర్యాలను పకడ్బందీగా చేపట్టాలని ప్రత్యేకంగా నిర్దేశించారు. పుష్కరాల ప్రారంభానికి ముందే ఏర్పాట్లన్నీ పూర్తయ్యేలా కార్యాచరణ ప్రణాళికను అమలుచేయాలని మంత్రి సురేఖ దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావుకు సూచించారు.

## రాష్ట్రంలో ప్రజాస్వామ్యం, సంక్షేమం, అభివృద్ధికి వెయ్యి రోజులు

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**హైదారబాద్,ఆగస్టు30,ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకోవడం రాష్ట్ర ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయనీ ఈ వెయ్యి రోజుల్లో కేవలం ప్రభుత్వం మాత్రమే మారలేదు తెలంగాణ ప్రజలు పోరాడి సాధించుకున్న ప్రజాస్వామ్య స్ఫూర్తి పునరుద్ధరించబడిందనీ నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గత పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో అధికారం ఒక వ్యక్తి, ఒక కుటుంబం చేతుల్లో కేంద్రీకృతమైందనీ గుర్తు చేశారు. మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రతిపక్షాలు, చివరకు సామాన్య ప్రజల గొంతుకకు కూడా విలువ లేకుండా పోయిందనీ అభిప్రాయపడ్డారు. సచివాలయం ప్రజలకు అందుబాటులో లేకుండా చేశారనీఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచి, ప్రశ్నించే వారిని శత్రువులుగా చూశారనీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిరంకుశ సంస్కృతికి ముగింపు పలికిందనీతెలిపారు నేడు ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉందనీ మంత్రులు ప్రజల మధ్యకు వెళ్తున్నారు. శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చలు జరుగుతున్నాయనీ తెలిపారు .ప్రజలు నిర్భయంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణి, గ్రామసభలు, ప్రత్యక్ష ప్రజా సంప్రదింపుల ద్వారా పాలనను ప్రజల ముంగిటకు తీసుకువచ్చాం. ప్రజాస్వామ్య పునరుద్ధరణతోపాటు విప్లవాత్మక సంక్షేమ పథకాలను అమలు చేశాం. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వారి ఆర్థిక స్వావలంబనకు, స్వేచ్ఛకు దోహదపడింది. గృహజ్యోతి ద్వారా అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తూ పేద కుటుంబాలపై భారాన్ని తగ్గించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచి పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తెచ్చాం.పౌర సరఫరాల రంగంలో దేశానికే ఆదర్శంగా నిలిచే సంస్కరణలు చేపట్టాం. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.42 కోట్ల మందికి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. లక్షలాది అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి, ఆధునిక స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించాం. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షల సహాయంతో పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తున్నామనీ తెలిపారు.గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మిగిల్చిన భారీ అప్పులు, బడ్జెట్ వెలుపలి రుణాలు, పెండింగ్ బకాయిలు, అసంపూర్తి ప్రాజెక్టులతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పటికీ ఈ విజయాలను సాధించామనీ పేర్కొన్నారు.

భారీ రుణాలు, వడ్డీలు చెల్లిస్తూనే సంక్షేమాన్ని కొనసాగించి, అభివృద్ధికి పెట్టుబడులను పెంచామనీ వివరించారు. బిఆర్‌ఎస్‌కు ఆందోళన చేసే స్వేచ్ఛ ఉంది ఆ స్వేచ్ఛే తెలంగాణలో ప్రజా స్వామ్యం తిరిగి వచ్చిందనడానికి నిదర్శనమనీ అభిప్రాయపడ్డారు. కానీ వెయ్యి రోజుల ప్రజాప్రభుత్వ విజయాలను వారు చెరిపివేయలేరనీ కుటుంబ పాలన నుంచి ప్రజాపాలన వైపు తెలంగాణ నిర్ణయాత్మకంగా అడుగులు వేసిందనీ మరింత సంకల్పంతో ఈ ప్రజాప్రస్థానం కొనసాగుతుందనీ చెప్పారు.

## ముగిసిన జాతీయ క్రీడా దినోత్సవాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు30:** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 28, 29, 30 తేదీలలో నిర్వహించిన క్రీడా, ఫిట్‌నెస్ కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. భారత ప్రభుత్వం ప్రకటించిన 'ఖేలేగా భారత్ – జీతేగా భారత్' నినాదానికి అనుగుణంగా ఈ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. రాష్ట్రంలోని 32 జిల్లాల కేంద్రాలతో పాటు హైదరాబాద్ నగరంలోని వివిధ క్రీడా మైదానాలు, స్టేడియంలలో నిర్వహించిన కార్యక్రమాల్లో యువ క్రీడాకారులు, విద్యార్థులు, క్రీడాభిమానులు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కార్యక్రమాల నిర్వహణలో చురుకైన పాత్ర పోషించాయి. ఈనెల 28న భారత హాకీ దిగ్గజం, దేశ క్రీడా గర్వకారణమైన మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ఆయన సేవలను స్మరించడంతో పాటు క్రీడల ప్రాధాన్యం, క్రీడాస్ఫూర్తి, ఆరోగ్యకర జీవన విధానాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా"ఏక్ ఘంటా ఖేల్ కే మైదాన్ మేన్" కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్ తదితర క్రీడా పోటీలతో పాటు 29 ఛాలెంజ్", పాస్ ది బాల్ ఛాలెంజ్, మీట్ ది ఛాంపియన్స్ వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. మహిళలు, యువత, వృద్ధులు, దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.వేడుకల ముగింపు సందర్భంగా ఈనెల 30న(ఆదివారం) స్పెషల్ సండేస్ ఆన్ సైకిల్", రన్‌లు, వాక్‌థాన్‌లు నిర్వహించి ప్రజల్లో ఫిట్‌నెస్, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. శారీరక దృఢత్వం, ఆరోగ్య సంరక్షణ, క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు మాట్లాడుతూ, యువతలో క్రీడా చైతన్యాన్ని పెంపొందించడం, ఆరోగ్యకర జీవన విధానాలను ప్రోత్సహించడం, ఫిట్ ఇండియా ఉద్యమాన్ని గ్రామీణ స్థాయికి విస్తరించడం లక్ష్యంగా మూడు రోజులపాటు ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడిన క్రీడా ఉత్సాహం తెలంగాణలో క్రీడా సంస్కృతి మరింత బలోపేతం కావడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

# సంక్షేమంపై చర్చకు మేం సిద్ధం

### ప్రతిపక్ష నేత అసెంబ్లీ చర్చకు రావాలి

### గద్దె దిగాక బిఆర్‌ఎస్‌కు గుర్తుకొచ్చిన పేదలు: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** సంక్షేమంపై చర్చకు మేం సిద్ధం బిఆర్‌ఎస్ ప్రతిపక్షనేత కెసిఆర్ అసెంబ్లీకి చర్చకు వస్తే మా మూడేళ్ళ ప్రగతి, సంక్షేమం మీమూడేళ్ళ అప్పులు అభివృద్ధి సంక్షేమంపై చర్చ చేద్దామని సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సవాల్ చేశారు. ఆదివారం సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టో 2014, 2018, 2023లో దివ్యాంగులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు.పదేళ్ల పాటు మేమే రాజులం, మేమే మంత్రులం, మాకు ఎదురులేదన్నట్లుగా వ్యవహరించారని ఆరోపించారు. దివ్యాంగుల సమావేశం ఏర్పాటు చేసి హరీశ్ రావు పచ్చి అబద్ధాలు ఆడుతున్నాడనీ ఆగ్రహం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పట్టుకుని ఏకవచనంతో సంబోధిస్తూ విమర్శలు చేస్తున్నారనీ,దివ్యాంగులను బలవంతంగా సమావేశానికి పిలిపించుకుని విమర్శలు చేయించారనీ ఆవేదన చెందారు. దివ్యాంగులకు రూ.50 కోట్లతో వాహనాలు, బ్యాటరీ వెహికిల్స్‌తో పాటు ఇతర పరికరాలు అందించామనీ వచ్చే ఏడాదిలో మరో రూ.50 కోట్లతో వాహనాలను అందిస్తామనీ తెలిపారు.దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించామనీ తెలిపారు.కొత్తగా దివ్యాంగులకు పింఛన్లు మంజూరు చేస్తున్నామనీ పూర్తి అంగవైకల్యంతో జన్మించే వాళ్లకు బాల్ భరోసా పథకం ద్వారా ప్రభుత్వమే పూర్తి ఖర్చును భరించి వైద్యం అందిస్తోందనీ వివరించారు.ఆర్టీసీలో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే అంశంపై సిఎంతో మాట్లాడుతున్నామనీ,వికలాంగుల ఆరు వేల పింఛన్లకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందనీ.గత ప్రభుత్వం అప్పులు చేసి రాష్ట్రం దివాళ తీయించడంతో ఆర్థిక సమస్యల కారణంగా పింఛన్ల పెంపు ఆలస్యం అవుతోందనీ అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వికలాంగుల సంక్షేమానికి మా ప్రభుత్వం పనిచేస్తుందనీ.కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామనీ అన్నారు.2018, 2014 ఎన్నికల సమయంలో బిఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టి అమలు చేయని వాటికి కెసిఆర్ సమాధానం చెప్పాలనీ హరీశ్ రావు విమర్శలను తీవ్రంగా ఖండిస్తు అన్నారు.నిరుద్యోగ యువతకు రూ.3 వేల భృతి చెల్లిస్తామని బిఆర్‌ఎస్ పార్టీ హామీ ఇచ్చి పక్కన పెట్టింది.ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు నీళ్లు ఇస్తామని మ్యానిఫెస్టోలో చెప్పారు.ఒక్క ఎకరానికి కూడా నీళ్లు



ఇవ్వలేదనీ అన్నారు. కెజిటు పిజి ఉచిత విద్య అని మోసం చేశారు.కొత్త యూనివర్సిటీలు నిర్మిస్తామని చెప్పారనీ కనీసం ఉస్మానియా యూనివర్సిటీకి నిధులు ఇవ్వలేదనీ విమర్శించారు. తన పార్టీ నాయకుల ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుకు అనుమతి ఇచ్చాడనీ ఎద్దేవా చేశారు.ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేశారని ఆవేదన చెందారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామిలు ఏకరువు పెడుతూ "చట్టసభల్లో మహిళలకు 30 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని వంచించాడు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ఒక్క పేదవాడికి ఇల్లు కట్టించలేదు." అని ఆయన వివరించారు. ప్రతి నియోజకవర్గానికి మూడు వేల ఐదు వందల ఇళ్లను మా ప్రభుత్వం ఇచ్చింది.గుండె మీద చేయి వేసుకుని కెటిఆర్, హరీశ్ రావు దీనిపై సమాధానం చెప్పాలనీ డిమాండ్ చేశారు.రేషన్ కార్డులు కొత్తవి ఇవ్వడంతోపాటు సన్న బియ్యం ఇస్తున్నామనీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామనీ వివరించారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామనీ చెప్పారు. ఇప్పటికే అనేక చోట్ల నిర్మాణాలు జరుగుతున్నాయనీ అన్నారు.1000 రోజుల వైఫల్యాలపై పోరాటం చేస్తామని కెటిఆర్ అంటున్నాడనీ మా పాలనపై చర్చకు మేం సిద్ధంగా ఉన్నాం. ప్రతిపక్ష నేత కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సూచించారు.

## పాలిటెక్నిక్ కాలేజీలను మూసివేయొద్దు

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యను బలహీనపరచకుండా, పాలిటెక్నిక్ కాలేజీలను మూసివేసే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని జాతీయ బి.సి. సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనలు, రాస్తారోకోలు చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలను ప్రైవేట్ వర్సిటీలో విలీనం చేసే ప్రయత్నం విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ కాలేజీలను లేబర్ డిపార్ట్‌మెంట్‌గా మార్చే యత్నాలను నిరసిస్తూ జీవో 97ను వెనక్కి తీసుకోవాలని, తగిన నిధులు కేటాయించి ఈ కాలేజీలను బలోపేతం చేయాలని కోరారు. సాంకేతిక విద్య, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్ మార్చడం, అప్రెంటిస్‌షిప్, ఇంటర్న్‌షిప్ మరియు ప్రాక్టికల్ ట్రైనింగ్ అవకాశాలు పెంచడం ద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభిస్తుందన్నారు. పాలిటెక్నిక్ విద్యను ఐటీఐ లేదా ఇతర స్వల్పకాలిక స్కిల్ ట్రైనింగ్‌తో సమానంగా చూడవద్దని, మూడేళ్ల డిప్లొమా అనంతరం ఈసెట్ ద్వారా బి.టెక్ ఉపాధి పొందే అవ కాశాలు పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎంతో దోహదపడతాయని పేర్కొ న్నారు. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థ, ఎస్‌బీటీఈటీ గుర్తింపు, పరీక్ష విధానం, అధ్యాపకుల వ్యవస్థపై ఎలాంటి అనిశ్చితి లేకుండా విద్యార్థులకు ప్రభుత్వం భరోసా కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వ్యవసాయ శాఖ పోస్టుల భర్తీకి చర్యలు

### ప్రాజెక్ట్ ఆఫీసర్ నుండి సబార్డినేట్ నియమకాలకు నోటిఫికేషన్

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకం నిర్వహించి, అమలు చేసేందుకు తెలంగాణ వ్యవసాయ శాఖ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వివిధ పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు ప్రారంభించింది. ఈ నియామకానికి సంబంధించిన కీలక వివరాలు చూస్తే అవుట్‌సోర్సింగ్ పద్ధతిన భర్తీ చేయవలసిన పదవుల్లో ప్రాజెక్ట్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్, ఆఫీస్ సబార్డినేట్ కూడా ఉన్నాయి. ఈ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులను అందించవలసిందిగా సంబంధిత వ్యవసాయ శాఖ, అర్హతగల అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలను ఆహ్వానించింది. భారత ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అమలవుతున్న ఈ పథకం పర్యవేక్షణ కోసం వివిధ పోస్టుల్లో సిబ్బందిని నియమించాలని నిర్ణయించింది. అర్హత గల అభ్యర్థులను అందించగల ఏజెన్సీలు పేర్కొన్న పోస్టులకు అవసరమైన సిబ్బందిని ప్రొవైడ్ చేయాలని వ్యవసాయ శాఖ సూచించింది. నియామకాలకు సంబంధించిన అర్హతలు, జీతభత్యాలు, ఇతర నియమ నిబంధనల వివరాల కోసం వ్యవసాయ శాఖ డైరెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ ప్రకటన విడుదల చేశారు. కాగా రసాయన రహిత సాగు, రైతు శిక్షణపై దృష్టి సారిస్తూ, కేంద్ర ప్రభుత్వ జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ / ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను తెలంగాణలోని ఎంపిక చేసిన క్లస్టర్లు, జిల్లాల్లో దశలవారీగా అమలు చేస్తున్నారు. ప్రస్తుతం సహజ వ్యవసాయ ప్రాజెక్టుల కోసం ప్రత్యేకంగా పెద్ద ఎత్తున నియామకాలను బయటి సంస్థలకు అప్పగించే బదులు, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉన్న కేడర్లపై ఆధారపడుతుంది. ప్రధానంగా మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సాధారణ పరిపాలనా ఆమోదాల ద్వారా మంజూరు చేయబడిన అవసరాన్ని బట్టి నియమించే ఫీల్డ్ అసిస్టెంట్లు లేదా తాత్కాలిక ఫీల్డ్ కోఆర్డినేటర్లను వినియోగిస్తుండడంతో వ్యవసాయ శాఖలో సిబ్బంది కొరత ఏర్పడి రైతులకు తగిన సేవలు అందించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో అవుట్ సోర్సింగ్ విధానంలో వివిధ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టింది.

## కేంద్రమంత్రి జెపి నడ్డాకు మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ లేఖ

## నీట్-పిజిలో కూడా ఆల్ ఇండియా కోటాను 50 నుంచి 15 శాతానికి తగ్గించాలి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు30:** ఆదివారం దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్-పీజీ పరీక్ష సందర్భంగా తెలంగాణకు చెందిన వైద్య విద్యార్థులు, డాక్టర్ల నుంచి అందిన సమాచారం వారి ఆందోళనల నేపథ్యంలో నీట్-పిజి ప్రస్తుతం ఉన్న 50 శాతం ఆల్ ఇండియా కోటా (ఏఐక్యూ) ను 15 శాతానికి తగ్గించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్‌ప్రకాశ్ నడ్డాకి లేఖ రాశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం జిల్లాల వారీగా అనేక కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేసి, వైద్య విద్యతో పాటు పీజీ సీట్లను గణనీయంగా పెంచిందని ఆయన తెలిపారు. ఈ సీట్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రజల నిధులు, ప్రభుత్వ వనరులు వినియోగించబడుతున్నందున, వాటిలో అధిక భాగం తెలంగాణ వైద్య విద్యార్థులకు అందుబాటులో ఉండేలా విధానం ఉండాలని కోరారు.

నీట్-యుజిలో 15 శాతం ఎఐక్యూ అమలులో ఉండగా, నీట్-పిజిలో 50 శాతం ఎఐక్యూ ఉండటం సమతుల్యంగా లేదని పేర్కొంటూ, పిజిలో కూడా ఎఐక్యూను 15 శాతానికి తగ్గించాలని కేంద్ర మంత్రిని కోరారు.అలాగే, ప్రతి రాష్ట్రం నుంచి ఎఐక్యూకు ఎన్ని ప్రభుత్వ పీజీ సీట్లు వెళ్తున్నాయి, ఇతర రాష్ట్రాల నుంచి ఎంతమంది విద్యార్థులు సీట్లు పొందుతున్నారు అనే అంశాలపై రాష్ట్రాల వారీగా పారదర్శకమైన గణాంకాలను విడుదల చేసి, ప్రస్తుత ఎఐక్యూ విధానంపై సమగ్ర సమీక్ష చేయాలని వినోద్ కుమార్ కోరారు. ఈ డిమాండ్ తెలంగాణకు మాత్రమే పరిమితం కాదని, రాష్ట్రాలు తమ ప్రజా నిధులతో అభివృద్ధి చేస్తున్న వైద్య విద్యా మౌలిక వసతులకు అనుగుణంగా పీజీ సీట్లలో సముచిత వాటా రాష్ట్ర విద్యార్థులకు లభించేలా సమతుల్యమైన సమాఖ్య విధానం అవసరమని ఆయన పేర్కొన్నారు.

## నవసమాజ నిర్మాణం కోసం విద్యార్థులు నైతిక విలువలతో జీవించాలి

### ప్రభుత్వ భద్రతా సలహాదారు బి.శివధర్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** విద్యార్థులు నవసమాజ నిర్మాణం కోసం సామాజిక బాధ్యతలు స్వీకరించి నైతిక విలువలతో జీవించాలని ప్రభుత్వ రాష్ట్ర భద్రతా సలహాదారు బి.శివధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. హోలీ మేరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే-2026 వేడు కలు జరిగాయి. విద్యార్థుల విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిన కార్యక్రమానికి ప్రభుత్వ రాష్ట్ర భద్రతా సలహాదారు బి. శివధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, సెంచూరియన్ యూని వర్సిటీ డైరెక్టర్ డాక్టర్ జె.ఎం.రావు గౌరవఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ అరిమండ వంప్రసాద్‌రెడ్డి, చైర్మన్ డాక్టర్ అరిమండ సిద్ధార్థ రెడ్డి, సెక్రటరీ డాక్టర్ అరిమండ విజయశారద రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ అరిమండ ప్రీతిరెడ్డి, పాల్గొన్నారు. గ్రాడ్యుయేషన్ డేలో శివధర్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు తమ విద్యా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని వృత్తి జీవితంలోకి అడుగుపెడుతున్న సమయంలో జ్ఞానం, నైపుణ్యాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. మారుతున్న సాంకేతిక ప్రపంచంలో నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, దేశ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. డాక్టర్ జె.ఎం. రావు మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన జ్ఞానాన్ని వాస్తవ జీవిత సమస్యల పరిష్కారానికి వినియోగించాలని సూచించారు. సాంకేతిక నైపుణ్యాలతోపాటు సృజనాత్మకత, ఆవిష్కరణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. భవిష్యత్‌లో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమను తాము నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

## ఢిల్లీ జంతర్‌మంతర్ 'జెన్-జి' పోరాటం స్ఫూర్తిదాయకం

### ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, ఎస్ఎఫ్ఐ ఆలిండియా సహాయకార్యదర్శి ఐషీ ఘోష్

**హైదరాబాద్ (చిక్కడపల్లి) ఆగస్టు 30, ప్రభాతవార్త :** ఢిల్లీలో పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు, యువత చేపట్టిన పోరాటం స్ఫూర్తి దాయకమైనదని, చారిత్రాత్మ కమైనదని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, ఎస్ఎఫ్ఐ ఆలిండియా సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్ అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రజనీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన 'జెన్ జీ మీట్' సదస్సులో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు.



'జెన్ జీ మీట్' సదస్సులో ప్రసంగిస్తున్న ఎస్ఎఫ్ఐ ఆలిండియా సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్

ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ మాట్లాడుతూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థి, యువత ఉద్యమం దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఒక కొత్త దిశను చూపించిందన్నారు. ఐషీ ఘోష్ మాట్లాడుతూ దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు కేవలం వ్యక్తిగతమైనవి కావని, అవి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో ముడి పడి ఉన్నాయని పేర్కొన్నారు.

విద్యను కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ వైపు నడిపించే విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు మాట్లాడుతూ జంతర్ మంతర్ పోరాట స్ఫూర్తితో తెలంగాణలో విద్యా రంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.మమత, డి. కిరణ్, కె.అశోక్‌రెడ్డి, బి. శంకర్, సహాయ కార్యదర్శులు సుమ, కార్తీక్, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.వై.ప్రణయ్, లెనిన్ గువేరా, కార్తీక్, జునుగరి రమేష్, ఉమ్మడి హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల నాయకులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# నర్సు శిరీష హత్యపై మంత్రి సీతక్క తీవ్రదిగ్భ్రాంతి

### డిజిపికి ఫోన్.. నిందితుడిని కఠినంగా శిక్షించాలి

### బాధిత కుటుంబానికి అండగా ఉంటాం: మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు30:** రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ప్రైమ్ కేర్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన నర్స్ శిరీష దారుణ హత్యకు గురైన ఘటనపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధులు నిర్వహిస్తున్న ఓ యువతి ప్రాణాలను అత్యంత దారుణంగా బలిగొన్న ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. శిరీష హత్య విషయం తెలిసిన వెంటనే మంత్రి సీతక్క స్పందించారు. స్థానిక పోలీసు అధికారులు, పహాడిషరీఫ్ ఇనస్పెక్టర్, ఇతర అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి సీతక్క.. డీజీపీ సీవీ ఆనంద్‌కు ఫోన్ చేసి ఘటనపై సమగ్రంగా, ఉన్నతస్థాయి విచారణ జరపాలని కోరారు. ఇలాంటి దారుణ ఘటనల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా చట్టపరమైన విచారణను వేగవంతం చేసి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. తన కుటుంబానికి అండగా నిలవాల్సిన వయసులో, తన కాళ్లపై తాను నిలబడి సేవా రంగంలో పనిచేస్తున్న ఓ యువతి ఇలా దారుణంగా ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై ఇలాంటి దారుణాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వి చారణను వేగవంతంగా పూర్తి చేసి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. శిరీష కుటుంబ సభ్యులకు మంత్రి సీతక్క తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా నిచ్చారు. కాగా, పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పద స్థితిలో నర్సు శిరీష (21) అనుమానాస్పద మృతి కేసులో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. నర్సును బిహార్ వాసి హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. సైనా ఉల్లా (35) అనే వ్యక్తి కిటికీ నుంచి నర్సు రూమ్‌లోకి దూకి ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. బాధితురాలు నర్సు ప్రతిఘటించగా గొంతు నొక్కి కేకలు వేయకుండా అడ్డుకున్నాడు. దీంతో ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు సైనా ఉల్లా పారిపోతుండగా పట్టుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. సైనా ఉల్లా ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నట్లు గుర్తించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన నర్సు 7 నెలల క్రితం మహేశ్వరంలో ఉంటున్న తన పిన్ని ఇంటికి వచ్చారు. తుక్కుగూడ ఓ ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్న స్నేహితురాలు ఆమెను అదే ఆసుపత్రిలో నర్సుగా చేర్చారు. ఆసుపత్రికి చెందిన ఓ రూమ్‌లో వీరిద్దరూ గత 7 నెలలుగా ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు శిరీష తన రూమ్‌కి వెళ్లి మళ్లీ ఆసుపత్రికి తిరిగిరాలేదు. 2 గంటలకే రావాల్సి ఉన్నా 3 గంటలు అవుతున్నా రూమ్‌లో నుంచి బయటకు రాలేదు. డాక్టర్లు ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో నర్సు ఉంటున్న రూమ్‌కి ఆసుపత్రి సిబ్బందిని పంపించారు. రూమ్ తలుపునకు లోపలి నుంచి గడియపెట్టి ఉండటంతో కిటికీ సందులోంచి చూశారు. నర్సు నేలపై పడి ఉంది. ఆసుపత్రి సిబ్బంది తలుపు విరగ్గొట్టి లోనికి వెళ్లారు. అప్పటికే నర్సు మృతి చెంది ఉంది. సమాచారం అందుకున్న పహాడీషరీఫ్ పోలీసులు క్లూస్ టీంతో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. నర్సు నుదుటిపై ఉన్న దెబ్బలపై ఆరా తీశారు. నర్సు ఒంటిపై గాయాలున్నాయని, ఆమె మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆమె పిన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో బిహార్‌వాసి సైనాఉల్లా హత్య చేసినట్లు తేలింది.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

## అలంపూర్ ఆలయాల అభివృద్ధికి కృషి

### రూ.700 కోట్ల నిధులతో తెలంగాణలోని

### పర్యాటక ప్రదేశాల అభివృద్ధి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**గద్వాల, ఆగస్టు 30,ప్రభాతవార్త :**అలంపూర్ ఆలయాల అభివృద్ధికి ప్రసాద్ పథకంలో భాగంగా ఇప్పటికే పలు పనులను చేయడం జరిగిందని భవిష్యత్తులో కూడా మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం అలంపూర్ ఆలయాల వద్ద మల్టీమీడియా, సౌండ్, లైట్స్ షోను ఇతర అతిథులతో కలిసి ప్రారంభించిన మంత్రి ఈ సందర్భంగా మాట్లాడారు. ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టత కలిగిన ఆలంపూర్ ఆలయాలను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శిస్తుంటారని, భక్తులకు ప్రతి రోజు సాయంత్రం 25 నిమిషాల పాటు ఆలయ చరిత్రను తెలియజేస్తూ ప్రదర్శనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. తాను ఇదివరకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలోని సుమారు 15 పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రూ.700 కోట్ల నిధులను కేటాయించినట్లు తెలిపారు. రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషిచేసిందని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఎన్నో దర్శనీయ స్థలాలను అభివృద్ధి చేసేందుకు పెద్ద ఎత్తున నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. గోల్కొండ కోట, ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల వద్ద సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటు చేశామన్నారు. జోగులాంబ రైల్వేస్టేషన్ ను అమృత్ పథకంలో భాగంగా అభివృద్ధి చేశామని, ఈ ప్రాంత వాసులు అలంపూర్ క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సలహాలు ఇవ్వవచ్చని సూచించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని అనేక ఆధ్యాత్మిక ప్రదేశాలను కూడా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని ఈ సందర్భంగా కేంద్రమంత్రి వివరించారు. మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ ఆలంపూర్ ఆలయాల వద్ద భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకంలో భాగంగా అన్నదాన భవనం, విశ్రాంతి గదులు, ఫుడ్ కోర్టు, కల్చరల్ థియేటర్, తదితర విభాగాలతో పాటు తుంగభద్ర నదిలో బోటింగ్ సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి మాట్లాడుతూ ఆలంపూర్ ఆలయ విశిష్టతను తెలియజేస్తూ మల్టీమీడియా సౌండ్ లైట్స్ ప్రదర్శన ఏర్పాటు చేయడంతో టెంపుల్ టూరిజం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

## చేప పిల్లల సరఫరాకు ఎల్‌నినో బ్రేక్

### అంతమాత్రంగానే ఉచిత పంపిణీ

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** ఎల్‌నినో రాష్ట్రంలోని మత్స్యకారుల జీవనోపాధికి గండి పెట్టే ప్రమాదం ఏర్పడింది. ఎల్ నినో వాతావరణ ఇప్పుడు ఉచిత చేపపిల్లల పంపిణీ పథకంపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు సగం చెరువులు, కుంటలు సరిపడా నీరు లేక వెలవెలబోతున్నాయి. వీటితో పాటు వివిధ రిజర్వాయర్లలో సైతం నీటి మట్టాల ఉట్టడుగుకు చేరాయి. ఈ తరుణంలో ప్రభుత్వం ఏటా నిర్వహించే ఉచిత చేప పిల్లల పంపిణీ ప్రశ్నార్థకంగా మారింది. దాదాపు రూ.116 కోట్ల అంచనా వ్యయంతో సుమారు 80 కోట్ల చేపల, రొయ్య పిల్లల పంపిణీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే జిల్లాల వారీగా టెండర్లు వేసి కాంట్రాక్టర్లు కూడా సిద్ధంగా ఉన్నట్లు మత్స్య శాఖ అధికారులు చెబుతున్నారు.

## డాన్సర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా రఘు మాస్టర్

### సెక్రటరీగా మెహర్ బాబా మాస్టర్

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** డాన్సర్స్ అసోసియేషన్ వివాదం కీలక మలుపు తిరిగింది. టాలీవుడ్‌లో నెలకొన్న వివాదాలు, ఫెడరేషన్‌తో తలెత్తిన విభేదాల నేపథ్యంలో ప్రముఖ కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్‌ను అసోసియేషన్ తాత్కాలిక అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన యూనియన్ సమావేశంలో తాత్కాలిక అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. అలాగే సెక్రటరీగా మెహర్ బాబా మాస్టర్, వైస్ ప్రెసిడెంట్ గా బసవరాజు, జాయింట్ సెక్రటరీగా రాజన్నను ఎన్నుకున్నారు.



## మైనర్లకు సిగరెట్లు విక్రయిస్తున్న

## పాన్‌షాప్ యజమాని అరెస్ట్

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మైనర్లకు సిగరెట్లు విక్రయిస్తున్న పాన్‌షాప్ యజమానిని పోలీసులు ఆదివానం అరెస్ట్ చేశారు. లిమ్రా పాన్ మహల్ షాప్ యజమాని యూసఫ్ ఉద్దీన్‌ను అరెస్టు చేసి, నిందితుడి నుంచి రూ.60 వేల విలువైన సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నారు.

## హుజురాబాద్ రైస్‌మిల్లులపై

## టాస్క్ ఫోర్స్, పౌర సరఫరాల దాడులు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రాంపూర్ తిరుమల ఇండస్ట్రీస్‌లో టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లై అధికారులు తనిఖీలు చేస్తున్నారు. 340 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించిన సివిల్ సప్లై అధికారులు, రెండు ట్రాలీ ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. దాడులు కొనసాగుతున్నాయి. పెద్దమొత్తంలో రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలతో పట్టుకొన్నారు.సింగిల్ పాలిష్‌తో బియ్యంను బ్రాండ్ సంచుల్లో నింపి అత్యధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు జిల్లాలో వినియోగదారుల నుంచి వస్తోన్నది.

# సంక్షేమం నుంచి ప్రపంచస్థాయి తెలంగాణ

### నేటికి వెయ్యి రోజుల ప్రజాపాలన

### రైతులు, మహిళలు, యువతకు భరోసా

### సిఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం ప్రకటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు30:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో సెప్టెంబరు 1 నాటికి ప్రజాప్రభుత్వం వెయ్యి రోజుల మైలురాయిని చేరుకుంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను పునర్నిర్మించడం, సంక్షేమాన్ని విస్తరించడం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేయడం, రైతులు-మహిళలు-యువతకు భరోసా కల్పించడం, రాష్ట్రానికి భారీ పెట్టుబడులను తీసుకురావడం, భవిష్యత్తు తెలంగాణకు ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు నిర్మించడంలో ఈ వెయ్యిరోజుల పాలన చరిత్రలో కొత్త అధ్యాయాన్ని నమోదు చేసింది. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. 2025-26లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరింది. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే దాదాపు 91 శాతం అధికం. సంక్షేమాన్ని కొన సాగిస్తూనే పెట్టుబడులు, ఉపాధి, మౌలిక సదుపా యాలు, సాంకేతిక రంగాల విస్తరణతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు తెచ్చింది. రైతులు, మహిళలు, యువత, కార్మికులు, ఉద్యోగులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు, ప్రజల భాగస్వామ్యంతో సమష్టి ప్రగతి సాధించింది. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీ. 25 లక్షలకుపైగా రైతు కుటుంబాలకు రుణభారం నుంచి విముక్తి చేసింది. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకుపైగా పెట్టుబడి సాయం. ఒకే విడతలో 9 రోజుల్లో దాదాపు రూ.9 వేల కోట్ల జమ. సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, రైతు బీమాతో నిరంతర భరోసా ఇస్తుంది. వరి సాగు, ఉత్పత్తిలో పంజాబ్‌ను అధిగమించి దేశంలో నంబర్-1గా తెలంగాణ. గత యాసంగిలో 81.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి కొత్త రికార్డు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటా కోసం రాజీలేని పోరాటం చేస్తోంది. యూరియా కొరత వంటి క్లిష్ట పరిస్థితులను అర్థం చేసుకుని ప్రభుత్వానికి సహకరించిన రైతన్నలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మహిళలను తెలంగాణ ఆర్థిక ప్రగతిలో కీలక భాగస్వాములుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు వెడుతోంది. 3.38 కోట్ల మందికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఆహార భద్రతను అందించింది. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సులభంగా మార్చేందుకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసింది. సామాజిక భద్రతను మరింత విస్తరిస్తూ కొత్తగా 2.25 లక్షల మందికి పింఛన్లు, మొత్తం 43 లక్షలకుపైగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులకు సామాజిక భద్రతా పింఛన్లు. తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం. అర్హమైన ప్రతి కుటుంబానికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సహాయం అందించింది. గిరిజనులు, చెంచులు, అత్యంత వెనుకబడిన కుటుంబాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది.హైదరాబాద్ క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇండ్ల టవర్ల నిర్మాణానికి భారీ ప్రణాళికను సిద్ధం చేసింది.

రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నిర్వహించి కులాల వారీ సామాజిక స్థితిగతుల వెల్లడి చేసింది. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం 59 ఎస్సీ ఉపకులాలను మూడు గ్రూపులుగా వర్గీకరించి, ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన దేశంలోని తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. గిగ్ కార్మికులకు చట్టబద్ధ గుర్తింపు, సంక్షేమ బోర్డు, సామాజిక భద్రత కల్పించే ప్రత్యేక చట్టం తెచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి పురోగతి జరిగింది. ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు 22 లక్షలకుపైగా విద్యార్థులకు అల్పాహారం, పాలు, పోషకాహారం. రూ.720 కోట్ల కేటాయింపు చేసింది. సంక్షేమ హాస్టళ్లలో డైట్ ఛార్జీలు 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలు 212 శాతం పెంపు చేసింది. మెగా డీఎస్సీ ద్వారా 10,006 మంది ఉపాధ్యాయుల నియామకం.దాదాపు 11 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రూ.1,000 కోట్ల కేటాయింపు. ప్రజా ప్రభుత్వ తొలి వెయ్యి రోజుల్లో 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు. గ్రూప్-1 నుంచి డీఎస్సీ వరకు కీలక నియామకాల పూర్తి చేసింది. టీజీపీఎస్సీ ద్వారా మరో 456 పోస్టులు, పోలీసు నియామక బోర్డు ద్వారా 7,437 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు.

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో 1,190 మంది శిక్షణ పూర్తి చేయగా 838 మందికి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు. 65 ప్రభుత్వ ఐటీఐలు, 57 పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దింది. గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో 2,000 పడకల నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం.సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో మూడు టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు.తొమ్మిది కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలు; మరో 17 కాలేజీల నిర్మాణం.నిమ్స్‌లో 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల మైలురాయి.2023 డిసెంబర్ 7 నుంచి 2026 ఆగస్టు 12 వరకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5,18,186 మందికి రూ.2,526.12 కోట్ల సాయం.సీఎంఆర్‌ఎఫ్ వైద్య రీయింబర్స్‌మెంట్ ద్వారా 4,78,789 మంది పేద రోగులకు రూ.1,635.34 కోట్లు; 39,712 మందికి రూ.798.41 కోట్ల ఎల్‌ఓసీలు ఇచ్చింది. ఆహార ఆహార కల్తీపై తనిఖీలు, శాంపిల్ పరీక్షలు, కఠిన చర్యలు చేపట్టింది.

# నేడే వెలిగొండ పండుగ




### ప్రాజెక్టు ఫేజ్-1 ప్రారంభించనున్న ఎపి సిఎం చంద్రబాబు

### 30 యేళ్ల కల సాకారంతో ప్రజల్లో హర్షాతిరేకం

### 'వెలిగొండ జల సిరులు- అభివృద్ధికి రెక్కల్లు పేరుతో వేడుక

**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం మార్కాపురం జిల్లాలో పర్యటించనున్నారు. దశాబ్దాలుగా తీవ్ర కరువును ఎదు ర్కొంటున్న మార్కాపురం జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి ప్రారంభించి, నీటిని విడుదల చేయనున్నారు. వెలిగొండ ప్రాజె క్టుతో మార్కాపురం ప్రాంతంతో పాటు ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు ప్రభావిత ప్రాంతాలకు కొత్త జీవం లభించనుంది. ముఖ్యంగా 30యేళ్ల క్రితం, 1996 మార్చి 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వెలిగొండ ప్రాజ ెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు, మూడు దశాబ్దాల తర్వాత అదే ప్రాజెక్టు తొలి దశను స్వయంగా ప్రారంభించడం చారిత్రక ఘట్టంగా నిలవనుంది. 'వెలిగొండ జలసిరులు- అభివృద్ధికి రెక్కల్లు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రారం భోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తోంది.

**కరవు నేలకు కృష్ణమ్మ జలాలు:** తీవ్ర వర్షాభావం, అడుగంటిన భూగర్భ జలాలు, ఫ్లోరైడ్ సమస్యలు, సాగునీటి కొరతతో దశాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ ప్రాంతానికి వెలిగొండ కేవలం ఒక ఇరిగేషన్ ప్రాజెక్టు మాత్రమే కాదు... ఆ ప్రాంత భవిష్యత్తును మార్చే జీవనాధార ప్రాజెక్టు. శ్రీశైలం జలాశయం నుంచి గ్రావిటీ ద్వారా కృష్ణా జలాలను తరలించి నల్లమలసాగర్‌లో నిల్వ చేసి, ప్రధాన కాలువల ద్వారా సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించేలా రూపొందించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన 30 మండలాల ప్రజలకు ప్రయోజనం కలగనుంది. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలతో సహా 23లక్షల మందికి తాగునీటి ప్రయోజనం చేకూరనుంది.

**తొలిదశతో కొత్త అధ్యాయం:** తొలి దశ ప్రారంభం ద్వారా 10.70 టిఎంసిల కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు విడుదల చేయనున్నారు. తొలి విడతలో సుమారు 1.19లక్షల ఎకరా లకు సాగునీరు, 4లక్షల మందికి తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వెలిగొండ జలాలు అందుబాటులోకి రావడం ద్వారా వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. సాగునీటి భద్రత పెరగడంతో పంటలపై అనిశ్చితి తగ్గి, పంటల వైవిధ్యీకరణకు అవకాశం ఏర్పడుతుంది.

**30 యేళ్ల ప్రయాణం... సంకల్పం నుంచి సాకారం వరకు:** 1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు ప్రయాణంలో ఎన్నో సాంకేతిక, ఆర్థిక, నిర్మాణపరమైన సవాళ్లు ఎదురయ్యాయి. సొరంగాల నిర్మాణం, ఫీడర్ కాలువలు, హెడ్ రెగ్యులేటర్లు, భూసేకరణ, పునరావాసం వంటి క్లిష్టమైన అంశాలను అధిగమిస్తూ ప్రాజెక్టు పనులు ముందుకు సాగాయి. 2024లో కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన అనంతరం వెలిగొండను అత్యంత ప్రాధాన్యతా ప్రాజెక్టుగా తీసుకుని పనులను వేగవంతం చేసింది. టన్నెల్ పనులు, ఫీడర్ కాలువలు, హెడ్ రెగ్యులేటర్లు, ఇతర అను బంధ నిర్మాణాలతో పాటు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం, పరిహారం చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించింది. 'శంకుస్థాపన చేసింది చంద్రబాబు ప్రారంభిస్తున్నదీ చంద్రబాబే' అన్న అరుదైన చారిత్రక ఘట్టానికి ఆగస్టు 31వ తేదీ వేదిక కానుంది. 30 ఏళ్ల క్రితం చేసిన సంకల్పం ఇప్పుడు సాకారమవుతుండటం మార్కాపురం ప్రాంత ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

**ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ఉదయం 9.30 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి, ఉదయం 10.15 గంటలకు మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవానిపల్లి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులు, అధికా రులు, ఇతర ప్రముఖులు ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతారు.

ఉదయం 10.25 గంటలకు రోడ్డు మార్గంలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ వేదికకు చేరుకుంటారు. ఉదయం 10.35 గంటల నుంచి 11.20గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వ హించి వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ పైలాన్ ఆవిష్కరిస్తారు. అనంతరం ప్రాజెక్టు గేట్లను ప్రారంభించి వెలిగొండకు కృష్ణా జలాల విడుదల కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఉదయం 11.30 గంటలకు గంటవానిపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభా ప్రాంగణా నికి చేరుకుంటారు. అక్కడ ప్రజావేదిక సభలో ముఖ్య మంత్రి ప్రసం గిస్తారు.

## పలు జిల్లాల్లో కురిసిన మోస్తరు వానలు

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:** పశ్చిమ మధ్య, దానిని ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళా ఖాతం పరిసరాల్లో అల్పపీడనం కేంద్రీకృతమైంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుండటంతో రానున్న 24 నుంచి 48 గంటల్లో ఇది మరింత బలపడే అవకాశముందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. తెలంగాణపై కూడా అల్పపీడన ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. దీని ప్రభావంతో తెలంగాణ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యే సూచనలు ఉన్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాల సమయంలో చెట్ల కింద గానీ, శిథిలావస్థలో ఉన్న భవనాల వద్ద గానీ ఆశ్రయం పొందవద్దని అధికారులు సూచించారు. ఇక రాజధాని హైదరాబాద్‌లో ఆదివారం ఉదయం నుంచే ఆకాశం పూర్తిగా మేఘావృతమై చల్లని వాతావరణం నెలకొంది. నగరంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, కొన్నిచోట్ల ఈదురుగాలులతో కూడిన ఉరుముల జల్లులు పడ్డాయి.

దీంతో జీహెచ్‌ఎంసీ పరిధిలోని ట్రాఫిక్ పోలీసులు, డీఆర్‌ఎఫ్ బృందాలు అప్రమత్తమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టారు. నగరవాసులు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, ప్రయాణాల సమయంలో వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌తో పాటు, తెలంగాణలోని పలు జిల్లాల్లో ప్రస్తుతం మేఘావృతమై, తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ మార్పుల వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గి, వాతావరణం చల్లబడింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలల్లోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో మోస్తరు నుండి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మిగిలిన మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, గద్వాల్, వికారాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి జల్లులు, అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోని హన్మకొండ జిల్లాలో 10 మిల్లీమీటర్లు, కరీంనగర్‌లో 12.5 మిల్లీమీటర్లు, భూపాలపల్లిలో 11.5 మిల్లీమీటర్లు, పెద్దపల్లిలో 9.6 మిల్లీమీటర్లు, జగిత్యాలలో 8.4 మిల్లీ మీటర్లు, మిగిలిన వివిధ జిల్లాల్లో స్వల్పంగా వర్షపాతం నమోదైంది.

## వాతావరణ మార్పులను తట్టుకునే వరి వంగడాల సృష్టి

### భారత్ వరి పరిశోధనా సంస్థ రూపకల్పన

**హైదరాబాద్, ఆగస్టు 30, ప్రభాతవార్త:**ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ మార్పులు నేపథ్యంలో కొత్త వంగడాలను శాస్త్రవేత్తలు రూపొందించారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు పంట దిగుబడులకు ముప్పుగా పరిణమిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని భారత వరి పరిశోధనా సంస్థ కొత్త వంగడాలకు రూపకల్పన చేసింది.

అధిక దిగుబడినిచ్చే, వాతావరణ మార్పులను తట్టుకునే, జీవబలవర్ధక వరి రకాలను అభివృద్ధి చేసింది. ఈ నూతన వంగడాల్లో డీఆర్‌ఆర్ ధాన్ (మహాజ్య), డీఆర్‌ఆర్ ధాన్ 89 (సూపర్ స్వర్ణ) నుండి డీఆర్‌ఆర్ ధాన్ 91 వరకు ఉన్నాయి. ఈ రకాలను వివిధ పర్యావరణ ఒత్తిళ్లు, పోషకాహార లోపాలను ఎదుర్కొనేందుకు అనువుగా రూపొందించారు. నిర్దిష్టమైన, కావలసిన జన్యువులను ప్రవేశపెట్టడానికి, అధునాతన మాలిక్యులర్ బ్రీడింగ్, మార్కర్ అసిస్టెడ్ సెలక్షన్ (ఎమ్ఎఎస్) పద్ధతులను ఉపయోగించి శాస్త్రవేత్తలు వీటిని అభివృద్ధి చేశారు. ఈ సంస్థ, డి.ఆర్.ఆర్. ధాన్ 92 నుండి 101 వరకు గల మరికొన్ని వాతావరణ మార్పులను తట్టుకోగల వరి రకాల పరీక్షలను కూడా పూర్తి చేసింది.

గెజిట్ నోటిఫికేషన్ అనంతరం వాటిని విడుదల చేసేందుకు ఎదురు చూస్తోంది. ఈ సరికొత్త రకాలు పంట కాల వ్యవధిని తగ్గించడానికి, ఎల్‌నినో సంబంధిత ఒత్తిడిని తట్టుకోవడానికి, హెక్టారుకు 40 క్వింటాళ్లకు పైగా దిగుబడినిచ్చే సామర్థ్యాన్ని అందించడానికి రూపొందించబడ్డాయని సంస్థ శాస్త్రవేత్తలు తెలిపారు.

## ప్రతి కులానికి 'యూనిక్ కోడ్' కేటాయించాల్సిందే


### లేదంటే జనగణనను నిలిపివేయండి


### ఢిల్లీలో ఒబిసి జాతీయ సదస్సులో వక్తల డిమాండ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు30:** దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణనలో కులగణనను తప్పనిసరి చేయడంతో పాటు ప్రతి కులానికి ప్రత్యేకంగా"యూనిక్ కోడ్" కేటాయించాలని పలువురు మేధావులు, రాజకీయ నేతలు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్త ఏకాభిప్రాయం కుదిరేవరకు జనగణన ప్రక్రియను నిలిపివేయాలని స్పష్టం చేశారు. ఆదివారం, ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో జనగణనలో కులగణన - ప్రతి కులానికి యూనిక్ కోడ్ అనే ప్రధాన డిమాండ్‌తో ఓబీసీ జాతీయ సదస్సు జరిగింది. బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్, మాజీ ఐఏఎస్ టి.చిరంజీవులు, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి. కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రాజ్యసభ ఎంపీ విల్సన్, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, ఏఐసీసీ ఓబీసీ విభాగం చైర్మన్ అనిల్ జైహింద్, స్వరాజ్ ఇండియా నేత ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ రతన్ లాల్, ప్రొఫెసర్ సూరజ్ మండల్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగొని బాలరాజ్ గౌడ్, ఎస్ దుర్గయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ ఇవ్వకుండా కులగణన నిర్వహించడం శాస్త్రీయ పద్ధతి కాదని వక్తలు విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల తరహాలోనే ఓబీసీలతో పాటు జనరల్ వర్గాలకు కూడా విడివిడిగా ప్రత్యేక కాలమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. డ్రాప్‌డౌన్ మెనూ ద్వారా ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించిన తర్వాతే జనగణన ప్రక్రియను ప్రారంభించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

## మట్టిట్రాక్టర్ కిందపడి ఇద్దరు దుర్మరణం

**ఎర్రుపాలెం, ఆగస్టు 30, ప్రభాతవార్త:** మట్టి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన విషాద ఘటన మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కళ్లముందే ఇద్దరు





ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం.. బుచ్చిరెడ్డిపాలెంలోని దేవాలయం వెనక రోడ్డులో మట్టిలోడుతో ట్రాక్టర్ వెళ్తోంది. అదే సమయంలో పెసరమిల్లి నాగరాజు(34), కొరకొప్పుల రమేష్(42) బైక్‌పై ఎదురుగా వస్తున్నారు.ఈ క్రమంలో ట్రాక్టర్, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాద ధాటికి బైక్‌పై ఉన్న ఇద్దరూ ట్రాక్టర్ కింద పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. బనిగండ్లపాడు గ్రామానికి చెందిన బుడం రాజేష్ ట్రాక్టర్ను , డ్రైవర్ బలుసు పాటి లోర్దయ . సమాచారం అందుకున్న ఎస్సై ఎం. రమేష్‌కుమార్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు.జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌ను తొలగించి మృతదేహాలను వెలికితీశారు. అనంతరం పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.ప్రమాదంలో మృతిచెందిన నాగ రాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రమేష్‌కు భార్య, కుమా రుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబాలకు అండగా ఉన్న ఇద్దరూ ఒకేసారి మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# మూడోరోజు కొనసాగిన ఇందిరమ్మ ఇల్లు టవర్స్ లాటరీ

### నేటితో ముగియనున్న ప్రక్రియ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 30:** ఇందిరమ్మ ఇల్లు టవర్స్ లాటరీ ప్రక్రియ మూడవరోజు విజయవంతంగా ముగిసింది. ఆదివారం శేరిలింగంపల్లి, మేడ్చల్, మలక్‌పేట, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు చెందిన లాటరీని ఆయా నియోజక వర్గాల్లో నిర్వహించారు. ఒక్కో నియోజకవర్గంలో 480 ఇండ్లు చొప్పున నాలు గు నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 1920 ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. లాటరీలో ఇల్లు వచ్చిన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ, తమ సొంత ఇంటి కలలు నిజం చేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల సమక్షంలో, హౌసింగ్ బోర్డ్ అధికారులతో పాటు పోలీసు, రెవిన్యూ శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఈ లాటరీ ప్రక్రియ సాగింది.

ఆదివారం వరకు 12 నియోజకవర్గాల్లో ఇండ్ల కేటాయింపు లాటరీ ప్రక్రియ పూర్తికాగా, సోమవారం మరో నాలుగు నియోజకవర్గాలలో లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నారు. సనత్‌నగర్, మహేశ్వరం, మల్కాజిగిరి,,కార్వాన్ నియోజకవర్గాల్లో సోమవారం లాటరీ ప్రక్రియ జరుగుతుందని హౌసింగ్ బోర్డ్ అధికారులు తెలిపారు. ఆ నాలుగు నియోజకవర్గాల్లో సెప్టెంబర్ మూడు వరకు దరఖాస్తుల స్వీకరణ ఇందిరమ్మ ఇల్లు టవర్స్ పథకంలో భాగంగా హైదరాబాద్ ఓఆర్ఆర్ పరిధిలో లక్ష ఇండ్లను నిర్మించాలన్న లక్ష్యంతో, పైలట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఇండ్లను నిర్మించాలని సంకల్పించింది.

ఇందులో భాగంగా ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో దరఖాస్తులు స్వీకరించి ఇండ్ల కేటాయింపు ప్రక్రియను చేపట్టింది. ఈ పదహారు నియోజకవర్గాలు కాకుండా గోషామహల్, ఎల్బీనగర్, ముషీరాబాద్, చంద్రాయణ గుట్ట నియోజకవర్గాల ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఈ నాలుగు నియోజకవర్గాలలో ప్రజలు సెప్టెంబర్ మూడో తేదీ వరకు మీసేవ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించవచ్చని హౌసింగ్ బోర్డ్ పేర్కొంది. సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న అర్హులైన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది.


# సిఎం పర్యటనలో ఆసక్తికర సన్నివేశాలు

**అనంతపురం, ఆగస్టు 30 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదివారం అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆసక్తికర సన్నివేశాలు చోటు చేసుకున్నాయి. సీఎం చిత్తూరు జిల్లా పర్యటన ముగించుకుని మధ్యాహ్నం అనంతపురానికి వచ్చి టిడిపి జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు కుమారుడు, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ కుమార్తెకు జరిగిన వివాహ కార్యక్రమానికి సీఎం హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అనంతపురం శివారులోని శిల్పారామం వద్ద సీఎం రాకకోసం హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. అందులో భాగంగా మంత్రి పయ్యావుల కేశవ్తో జిల్లాలోని ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు హెలీ ప్యాడ్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో కూర్చుని ఎదురు చూశారు. ఈ సమయంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర రావు, అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి వద్దకు వచ్చి భాగున్నావా మామా అని పలకరించగా ప్రభాకర్ చౌదరి ఏ విధంగానూ స్పందించకుండా మౌనంగా ఉండిపోయినట్లు తెలియవచ్చింది. అదే సమయంలో హెలీ ప్యాడ్ వద్ద రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరితో చాలా సేపు విడిగా ముచ్చటించినట్లు తెలిసింది. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్కు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మధ్య ఇటీవల కాలంలో తీవ్ర స్థాయిలో విబేధాలు వచ్చిన విషయం పాఠకులకు విధితమే. మంత్రి పయ్యావుల, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మధ్య జరిగిన సంభాషణ తెలియరావడం లేదు.

**భాగున్నావా ప్రభాకర్ అంటూ సీఎం సంబోధ :** హెలీ ప్యాడ్లో అందరి నాయకులను పలకరిస్తూ వస్తున్న సందర్భంలో అనంతపురమాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి పుష్పగుచ్ఛం ఇచ్చేందుకు ప్రయత్నించగా భాగున్నావా ప్రభాకర్ అంటూ సీఎం సంబోధించినట్లు తెలియవచ్చింది. ఈ సమయంలో మీ అపాయింట్ మెంట్ కావాలని, మీతో కొన్ని విషయాలు మాట్లాడాలని అని ప్రభాకర్ చౌదరి ప్రత్యేకంగా సీఎంని అడుగగా, నాకు అన్ని విషయాలు తెలుసు వెయిట్ చేయ్.. అపాయింట్ మెంట్ ఇస్తానంటూ సీఎం ప్రభాకర్ చౌదరికి తెలిపినట్లు సమాచారం. ప్రభాకర్ చౌదరి ఏదో చెబుతుంటే చంద్రబాబు వారిస్తూ ఉన్నట్లు సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తోంది. పార్టీ అంతర్గత విషయాలు బయట మాట్లాడ వద్దు, కలిసి మాట్లాడదామని సీఎం చెప్పినట్లు తెలియవచ్చింది.

**జెసి ప్రభాకర్రెడ్డిని ఆరోగ్యాన్ని బాగా చూసుకోవాలని చెప్పిన సీఎం చంద్రబాబు :** హెలిప్యాడ్లో తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్రెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్రెడ్డికి సీఎంకు పుష్పగుచ్ఛం యిచ్చి స్వాగతం పలికారు. జెసి ప్రభాకర్రెడ్డి సీఎంకు పుష్పగుచ్ఛం ఇచ్చే సమయంలో ఆరోగ్యం ఎలా ఉంది, ఆరోగ్యం ఎలా ఉంది నీ ఆరోగ్యాన్ని బాగా చూసుకో ప్రభాకర్ అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించగా మీ ఆరోగ్యం భాగుంటే మాఆరోగ్యం బాగుంటుందంటూ సీఎంతో జెసి ప్రభాకర్రెడ్డి వ్యాఖ్యానించినట్లు తెలియవచ్చింది.

**ప్రభాకర్ చౌదరిని ఆలింగనం చేసుకున్న జెసి ప్రభాకర్రెడ్డి:** శిల్పా రామం వద్ద ఏర్పాటు చేసిన హెలీ ప్యాడ్లో సీఎం కోసం ఎదురు చూస్తున్న సమయంలో అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్రెడ్డి చొరవతో భాగున్నావా ప్రభాకర్ అంటూ ఆలింగనం చేసుకుని ఇద్దరు కొద్దిసేపు మాట్లాడుకోవడం అక్కడున్నవారు ఆసక్తిగా చూడటం కనిపించింది. గతంలో అనంతపురం నగరంలో రోడ్ల వెడల్పు, ఇతర విషయాల్లో ప్రభాకర్చౌదరి, జెసి సోదరులమధ్య మాటల యుద్ధం చోటు చేసుకోగా వారి మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్న నేపథ్యంలో ఈ సంఘటన ఆసక్తి కరంగా మారింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం అనంతపురం జిల్లాలో పర్యటించారు. ప్రత్యేక హెలికాప్టర్లో తిరుపతి జిల్లా పర్యటన ముగించుకొని మధ్యాహ్నం అనంతపురం చేరుకొని వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె విద్య, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు కుమారుడు శివ చరణ్ వివాహ మహోత్సవానికి సిఎం చంద్రబాబు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. వారికి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేదికపై పదినిమిషాలు సిఎం గడిపారు. ఇరు కుటుంబాలకు చెందిన బంధువులు చంద్రబాబు ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా గుంతకల్లు ఎమ్మెల్యే, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ కుటుంబీకులు, అభిమానంతో సిఎంతో ఫోటోలు తీయించుకున్నారు. సిఎం ప్రత్యేకంగా తమ పిల్లల వివాహానికి హాజరు కావడం,



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు







దాదాపు పది నిమిషాల సేపు వివాహ వేదికపై గడపటం పట్ల గుమ్మనూరు, పూల కుటుంబాలు ఆనందం వ్యక్తం చేశాయి. తొలుత సిఎం చంద్రబాబు అనంతపురం జిల్లా కేంద్రంలోని శిల్పారామం వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద మధ్యాహ్నం 2.24 గంటలకు చేరుకున్నారు. అక్కడ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు సిఎంకు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బళ్లారి రోడ్డులోని కన్వెన్షన్ హాల్కు మధ్యాహ్నం 02:59 గంటలకు చేరుకుని అక్కడ నూతన దంపతులను ఆశీర్వదించి, 3:10 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. సిఎం పర్యటనలో మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, ఎమ్మెస్ రాజు, జెసి అస్మిత్ రెడ్డి, బండారి శ్రావణి, పల్లె సింధూర రెడ్డి, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డి, వైకుంఠం ప్రభాకర్ చౌదరి, ఎడిసిసి బ్యాంక్ అధ్యక్షుడు ముంటిమడుగు కేశవరెడ్డి, శ్రీధర్ చౌదరి, ప్రకాష్ నాయుడు తదితరులతోపాటు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చర్చలు విఫలమైతేనే ఉద్యమం

### ఎపి జెఏసి ఛైర్మన్ విద్యాసాగర్, సెక్రటరీ జనరల్ కెఎస్ఎస్ ప్రసాద్

**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (ఎపి జెఏసి) తన భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 5వ తేదీన విజయవాడలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ సమావేశంలో ప్రధానంగా పెండింగ్లో ఉన్న పిఆర్సి, డిఎ బకాయిలు సహా ఇతర డిమాండ్లపై చర్చించి, తదుపరి కార్యాచరణను ఖరారు చేయనున్నారు. ఆదివారంనాడిక్కడ జెఏసి ఛైర్మన్ విద్యాసాగర్, సెక్రటరీ జనరల్ కెఎస్ఎస్ ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి చర్చలు, సంప్రదింపులకే తాము తొలి ప్రాధాన్యం ఇస్తామని, అవి విఫలమైతేనే ఉద్యమ కార్యాచరణ అనివార్యమని స్పష్టం చేశారు. మంత్రుల బృందం ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమావేశం జరుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య సానుకూల వాతావరణం నెలకొందని వారు పేర్కొన్నారు. పిఆర్సి, పెండింగ్ డిఎలు, ఇతర ఆర్థిక బకాయిల చెల్లింపులో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్ల ఉద్యోగులు, పెన్షనర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికే రూ.22 వేల కోట్ల బకాయిలు చెల్లించడం, ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు పంపిణీ చేయడం, 11 వేల మందికి ఓపిఎస్ వర్తింపజేయడం, 8 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడం వంటి సానుకూల నిర్ణయాలు తీసుకుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అయినప్పటికీ, కీలకమైన ఆర్థిక అంశాలపై ప్రభుత్వం నుంచి ఆశించిన స్పందన కొరవడిందని జెఏసి నేతలు అభిప్రాయపడ్డారు. సెప్టెంబర్ 5న జరిగే సమావేశంలో వీటిపైనే ప్రధానంగా చర్చించి, ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే తదుపరి ఉద్యమ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని వారు స్పష్టం చేశారు.

## వైసిపికి కర్త, కర్మ, క్రియ వైఎస్ జగనే!



**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయసాయి రెడ్డి సొంత కారణాలతోనే వైసిపిని వీడారని, ఆయన పార్టీని ఎందుకు విడిచిపెట్టారో ఎవరికీ తెలియదని వైసిపి సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. తాను వ్యక్తిగత కారణాలతో పార్టీ నుంచి బయటకు వెళ్తున్నట్లు విజయసాయే చెప్పారని గుర్తుచేశారు. పార్టీని వీడిన వారి గురించి వైఎస్ జగన్ ఎప్పుడూ నెగిటివ్గా మాట్లాడలేదని స్పష్టం చేశారు. జగన్పై, వైసిపిపై విమర్శలు చేయడానికి ప్రస్తుతం పాత్రలు మాత్రమే మారుతున్నాయని, జగన్ నాయకత్వాన్ని టార్గెట్ చేసి దాడి చేస్తున్నారని సజ్జల ఆరోపించారు. 40యేళ్లుగా జగన్ వెంట ఉన్న వ్యక్తిగా విజయసాయి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వైసిపి అంటే ఒక కోటరీ అనే ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందని సజ్జల అన్నారు. విజయసాయి ఆరోపణల వల్ల పార్టీలో అపోహలు ఏర్పడే అవకాశం ఉన్నందున వాటిని తొలగించేందుకే ఈ వివరణ ఇస్తున్నట్లు తెలిపారు. విజయసాయికి జగన్ పార్టీలో నంబర్2 స్థానం కల్పించారని, వైసిపిలో ఆయనకు వచ్చినన్ని పదవులు మరెవరికీ రాలేదని పేర్కొన్నారు. జగన్ నంబర్2, సజ్జల నంబర్1 అని విజయసాయి చెప్పడం సరికాదన్నారు. వైసిపికి కర్త, కర్మ, క్రియ వైఎస్ జగనేనని, పార్టీలో జగన్ ఒక్కరే నేత, మిగతా వారంతా కార్యకర్తలేనని స్పష్టం చేశారు. తనపై వచ్చే ఆరోపణలను తాను ఎప్పుడూ పట్టించుకోలేదని, పదవులు కాదని, జగన్తో ఉన్న అనుబంధమే తన అదృష్టమని సజ్జల పేర్కొన్నారు.

## మైనార్టీ అభ్యర్థులకు గ్రూప్1 ఉచిత శిక్షణ

**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రూప్-1 పరీక్షలకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనార్టీస్ (సిఇడిఎం) ఎపి ద్వారా ఉచిత శిక్షణ అందించనున్నట్టు ఆ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఉచిత శిక్షణకు అభ్యర్థులను రాష్ట్రవ్యాప్త ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్టు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆన్లైన్, ఆఫ్లైన్ విధానాల్లో శిక్షణ అందించనున్నట్టు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన మైనార్టీ అభ్యర్థులందరూ తమ వివరాలను 'సిఇడిఎంఎపి' అధికారిక వెబ్సైట్ ద్వారా ఆన్లైన్ పద్ధతిలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఆఫ్లైన్ శిక్షణ తరగతులకు దరఖాస్తు చేసుకునే వారు డిగ్రీలో కనీసం 60శాతం మార్కులు పొంది, తెల్లరేషన్ కార్డు కలిగిన కుటుంబాలవారై ఉండాలన్నారు. ఆన్లైన్ శిక్షణకు మాత్రం పై నిబంధన వర్తించదని తెలిపారు. మరిన్ని వివరాల కోసం సంబంధిత వెబ్సైట్లో లేదా 08645 297535, 73867 89966 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. ప్రవేశ పరీక్షకు ఆన్లైన్ దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 31వ తేదీన ప్రారంభమై సెప్టెంబరు 10వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. పూర్తి వివరాలు సిఇడిఎంఎపి అధికారిక వెబ్సైట్లో పొందుపరచినట్లు వెల్లడించారు. త్వరలో నోటిఫికేషన్ విడుదలయ్యే గ్రూప్-2కు కూడా ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తామన్నారు.

# శ్రీకాళహస్తిలో సిఎంకు ఘనస్వాగతం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 30 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు శ్రీకాళహస్తిలో స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్రెడ్డి సారథ్యంలో ఘనస్వాగతం పలికారు. శాప్ మాజీ చైర్మన్, ఎన్టిఆర్ కుటుంబానికి అత్యంత సన్నిహితులు పిఆర్ మోహన్ కుమార్తె డింపుల్ వివాహానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హెలికాప్టర్లో ఆయన రాగా హెలిప్యాడ్ వద్ద జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బరాయుడులు పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుధీర్రెడ్డి, కోనేటి ఆదిమూలం, నెలవల జయశ్రీ, గాలి భానుప్రకాష్రెడ్డి, తుడా చైర్మన్ డాలర్ దివాకర్రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్కుమార్, తిరుపతి నగరపాలక సంస్థ చైర్మన్ జయకృష్ణ, శ్రీకాళహస్తి ఆర్డిఓ భానుప్రకాష్రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఎస్విబిసి చైర్మన్ శ్రీధర్వర్మ, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు సంబంధిత అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఒ బికె వెంకటేశులు, ఆలయ వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మహిళలు, పిఆర్ మోహన్ కుటుంబ సభ్యులతో ఎంతో ఆత్మీయంగా పలుకరిస్తూ మహిళలతో ఫోటోలు దిగారు. డింపుల్, రాజేష్ దంపతులను ఆశీర్వదించి బహుమతిని అందించారు.



శ్రీకాళహస్తి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రికి శ్రీకాళహస్తీశ్వరుని ప్రసాదాలు అందిస్తున్న ఎమ్మెల్యే, ఇఒ

# సహజ జీవనమే ఆరోగ్యానికి శాశ్వత పునాది

### ప్రకృతి వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు

**తిరుమల, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రకృతికి అనుగుణంగా జీవించడం, సహజ ఆహారం తీసుకోవడం తగినంత విశ్రాంతి, స్వచ్ఛమైన నీరు గాలిని అలవాటుగా చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని ప్రకృతి వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు తెలిపారు. ఆయుష్, టిటిడి ఆధ్వర్యంలో తిరుపతి మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన 'యోగ, ప్రకృతి వైద్యంతో ఆరోగ్య పరిరక్షణ' అవగాహన కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లోపించడం, తగినంత విశ్రాంతి లేకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. సహజ ఆహారం, స్వచ్ఛమైన నీరు, స్వచ్ఛమైన గాలి, తగినంత విశ్రాంతి ఆరోగ్య సంజీవినిలోని నాలుగు ముఖ్య అంశాలని పేర్కొన్నారు. ఆరోగ్యంపై ముందుగానే శ్రద్ధ వహించి మంచి జీవన అలవాట్లు పాటిస్తే అనేక అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చన్నారు. బెటర్ లివింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ డిజిటల్ వెల్నెస్ ఉపాధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు భావోద్వేగ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవడం అత్యంత అవసరమని తెలిపారు. వేగవంతమైన జీవనశైలిలో ఒత్తిడి, ఆందోళన, కోపం, నిరాశ వంటి భావోద్వేగాలను సమతుల్యంగా నిర్వహించుకోవాలని సూచించారు. సానుకూల ఆలోచనలు ప్రశాంతమైన మనసు, ఆనందమయ జీవితంకు బలమైన పునాదులని చెప్పారు. ప్రతిరోజూ కొంత సమయం యోగా, ధ్యానం, వ్యాయామానికి కేటాయించడంతో పాటు ప్రకృతితో మమేకం కావాలని, కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆప్యాయంగా గడపాలని సూచించారు. సమస్యలను చూసి ఆందోళన చెందకుండా పరిష్కార మార్గాలపై దృష్టి పెట్టడం ద్వారా ఆత్మవిశ్వాసం, మానసిక ప్రశాంతత పెంపొందుతాయని తెలిపారు. అవసరానికి మించి డిజిటల్ పరికరాలకు సమయం కేటాయించకుండా కుటుంబం, ప్రకృతి, వ్యాయామం, ఆధ్యాత్మిక చింతనకు సమయం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి సంక్షేమ విభాగం డిప్యూటీ ఇఒ ఆనందరాజు, ఎస్వీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, ఇతర అధికారులు, టిటిడి ఉద్యోగులు, పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 4న గోకులాష్టమి ఆస్థానం

**తిరుమల, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ద్వాపరయుగంలో శ్రీకృష్ణభగవానుడుగా ఆనాడు తన జన్మదినాన్ని గోపికలు,ద్వారకవాసుల మధ్య వేడుకగా జరుపుకున్నట్లు, కలియుగవైకుంఠం తిరుమలలో వేంకటేశ్వరస్వామి చెంత గోకులాష్టమి ఆస్థానం అత్యంత కన్నులపండువగా జరగనుంది. సెప్టెంబర్ 4వ తేదీ శుక్రవారం శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించనున్నారు. గోగర్భమ్ డ్యామ్ సమీపంలోని ఉద్యానవనంలో కాళీయమర్ధనుడికి విశేష అభిషేకాలు జరిపిస్తారు. అదేరోజు రాత్రి వెంకన్న ఆలయంలోని బంగారువాకిలిలో ముఖమండపంలో రాత్రి 8గంటల నుండి 10గంటల వరకు గోకులాష్టమి ఆస్థానం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆరోజు బంగారుసర్వభూపాల వాహనంపై శ్రీకృష్ణస్వామిని వేంచేపుచేసి నివేదనలు సమర్పిస్తారు. ఉగ్రశ్రీనివాసమూర్తికి, శ్రీదేవిభూదేవి అమ్మవార్లకు శ్రీకృష్ణస్వామికి ఏకాంత తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం ద్వాదశారాధనం చేస్తారు. **5న ఉట్లోత్సవం:** గోకులాష్టమి మరుసటిరోజు ఉట్లోత్సవం అత్యంత వేడుకగా జరిపిస్తారు. ఆలయ నాలుగుమాఢవీధుల్లో ఉట్లను ఏర్పాటుచేస్తారు. స్థానికులతోబాటు ఆలయ అర్చకులు, శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి, శ్రీకృష్ణస్వామి వేర్వేరు తిరుచ్చిలపై తిరుమాఢవీధుల్లో విహరిస్తారు. యువకులు ఎంతో ఉత్సాహంతో సెప్టెంబర్ 5వ తేదీ శనివారం సాయంత్రం ఉట్లను కొడుతూ స్వామికి ఆనందం కలిగిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగే ఆర్జితసేవలు ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దుచేసింది.

# శ్రీవారి సేవకుల సేవల పరిధి మరింత విస్తరణ

**తిరుమల, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి సేవ సేవకుల సేవల పరిధిని మరింతగా విస్తరించాలని టిటిడి నిర్ణయించింది. భక్తులకు ఇప్పటి వరకు ఇతోదిక సేవలందిస్తున్న ఈ సేవా విధానంలో కీలక మార్పులు చేస్తోంది. ఇంకా కొన్ని రంగాలలో ఉచిత సేవలకుగాను నిపుణులైన వారికి అవకాశం కల్పించాలని టిటిడి భావించింది. రెండున్నరదశాబ్దాల కాలంపైగా తిరుమలలో శ్రీవారి సేవకులు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నారు. భక్తులకు వసతి, భోజన సేవలకే పరిమితమైన ఈ కార్యక్రమంలో ఇప్పటికే వైద్యులు వంటి వృత్తి నిపుణులకు వైద్యసేవలో అవకాశం కల్పించారు. ఈ సేవ కోసం భారీ స్పందన వచ్చింది. జూన్ 5న పైలట్ ప్రాజెక్టుగా శ్రీవారి వైద్యసేవ ప్రారంభమైంది. స్విమ్స్, బర్డ్, పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి, సెంట్రల్ హాస్పిటల్, అశ్విని హాస్పిటల్, ఆయుర్వేద ఆసుపత్రులు, గోశాలల్లో సేవలందించే అవకాశం కల్పించారు. స్పెషలిస్ట్ వైద్యులు కనీసం మూడు రోజులు, ఎంబిబిఎస్ వైద్యులు ఏడు రోజుల సేవా స్లాట్ను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. వైద్యసేవ ప్రారంభమైన 83 రోజుల్లోనే 723 మంది వైద్యులు ఆన్లైన్లో నమోదు చేసుకోగా 586 దరఖాస్తులను టిటిడి ఆమోదించింది. ఇప్పటికే 109 మంది వైద్యులు సేవలు అందించారు. మూడు రోజుల సేవ పూర్తి చేసిన స్పెషలిస్ట్ వైద్యులకు శ్రీవారి బ్రేక్ దర్శనం కల్పిస్తుండగా, ఏడు రోజుల సేవ చేసిన ఎంబిబిఎస్ వైద్యులకు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఉచిత దర్శనం అవకాశం ఇస్తున్నారు. హిందూ మతానికి చెందిన ఆసక్తిగల వైద్యులు టిటిదేవస్థానమ్స్. ఎపి.జిఒవి. ఇన్/శ్రీవారిసేవ/ఇన్స్ట్రక్షన్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. సర్టిఫికెట్లు అప్లోడ్ చేసి, ఇష్టమైన ఆసుపత్రి, సేవా స్లాట్ను ఎంపిక చేసుకోవాలి. ఆ తరువాత టిటిడి ఆమోదంతో విధుల్లో చేరి రోజుకు ఆరు గంటల పాటు సేవలందించాలన్నారు.



# తిరుమల సమాచారం

## ప్రపంచ నలుమూలలకూ భారతదేశ వైభవం

- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆకాంక్ష



**తిరుమల,ఆగస్టు 30ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం నుండి దేశవ్యాప్తంగా "సేవా సంకల్ప్ మహోత్సవ్" పేరుతో ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ వెల్లడించారు. తిరుమల శ్రీవారి కరుణాకటాక్షాలతో భారతదేశ వైభవం ప్రపంచవ్యాప్తంగాఅగ్రస్థానంలో నిలుస్తుందనిఆయన ఆకాంక్షించారు. దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, దేశ ప్రజలకు శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మాధవ్ ప్రార్థించారు. భారత రాజ్యాంగ పరిపాలనలో వరుసగా 13 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, 12 సంవత్సరాలు ప్రధానమంత్రిగా మొత్తం 25 సంవత్సరాల సుపరిపాలన ప్రస్థానం కొనసాగుతున్నదన్నారు. నాలుగు రోజుల తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం బిజెపి అధ్యక్షుడు పోకల వంశీ నాగేంద్ర మాధవ్ కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం విఐపి ప్రోటోకాల్ బ్రేక్ సమయంలో శ్రీవారి ప్రత్యేక సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనానంతరం వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట టిటిడి పాలకమండలి సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, సి.దివాకర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగోతు రమేష్ నాయుడు, కేతినేని సురేంద్ర నాయుడు, తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, జిల్లా ఒబిసి మోర్చా ఉపాధ్యక్షుడు కుర్రకాల్వ వేణు, రేణిగుంట మండల ఉపాధ్యక్షుడు రాజా రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## కారీరిష్టి యాగం వరుణజపంకు అంకురార్పణ



**తిరుమల, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని సకాలంలో వర్షాలు కురవాలని కలియుగ ప్రత్యక్షదైవాన్ని ప్రార్థిస్తూ తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో టిటిడి చేపట్టిన కారీరిష్టి యాగం, వరుణజపం పర్జన్యశాంతి హోమాలకు ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఇందులో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, ప్రాయశ్చిత్త హోమం అంకురార్పణ చేపట్టారు. సెప్టెంబర్ 3వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ యాగ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 32 మంది వేద, శ్రౌత, స్మార్థపండితులు యాగ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. చివరి రోజు మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు. ధర్మగిరి వేద విజ్ఞన పీఠం ప్రిన్సిపాల కెఎస్ఎస్ అవధాని ఆధ్వర్యంలో ఈ యాగ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

## అవనిగడ్డలో దారుణం

- మైనర్పై ఆర్ఎంపి వైద్యుడు లైంగిక దాడి
- నిందితుడు అరెస్ట్, పోక్సో కేసు నమోదు

**విజయవాడ, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలంలో దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 8వ తరగతి చదువుతున్న బాలికపై ఆర్ఎంపి వైద్యుడు లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. బాలిక తొమ్మిది నెలల గర్భంతో పాఠశాలకు రావడంతో ఉపాధ్యాయులు గుర్తించారు. అనంతరం ఆమెను ఆస్పత్రికి తరలించగా అక్కడ బాలిక ప్రసవించినట్లు సమాచారం. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడైన ఆర్ఎంపి వైద్యుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి అతనికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు అవనిగడ్డ సిఐ యువకుమార్ తెలిపారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## తిరుమల అడవుల్లో ఏనుగుల గుంపు

- భక్తులను అప్రమత్తం చేసిన అటవీశాఖ



**తిరుమల, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** వర్షాకాలం ఆరంభమైనా వాన చినుకు లేకపోవడంతో శేషాచలం అడవుల్లో కుంటలు ఎండిపోయి తాగు నీటికి వన్యప్రాణులు అడవిని వదలి జనసంచారంలోకి వచ్చేస్తున్నాయి. తాజాగా ఆదివారం ఉదయం శేషాచలం అడవిలో ఏనుగుల కదలికలు, గుంపులను అటవీశాఖ డ్రోన్ కెమెరాల్లో గుర్తించింది. మొత్తం 35 ఏనుగుల మంద రెండు భాగాలుగా విడిపోయి, భాకరాపేట, దిగువూరు వైపు నుండి 13 ఏనుగుల గుంపు చంద్రగిరి వైపు వెళ్ళడాన్ని డ్రోన్తో చిత్రీకరించారు. ఇక మరో 22 ఏనుగుల గుంపు అటవీ మార్గంలో తిరుమల వైపు వచ్చినట్లు కనుగొన్నారు. అటవీ శాఖ అధికారులు డ్రోన్ల ద్వారా ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. చంద్రగిరి, తిరుమల, కాలినడక మార్గాలు, తిరుమల ఘాట్ రోడ్డు పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని స్థానికులకు సూచించారు. తరచూ శేషాచలం అటవీప్రాంతంలో ఏనుగుల గుంపులు ఇబ్బందులు పెడుతున్నాయి. పంటలను నాశనం చేయడగామేగాక తిరుమల ఘాట్రోడ్డులో భక్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాల రైతులు ఆందోళన చేస్తుండటంతో అటవీ శాఖ అధికారులు ఈ ఏనుగుల గుంపుపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాలతో నిరంతరం అటవీ శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

## కూటమి సిఎం అభ్యర్థిగా పవన్ను ప్రకటించాలి

**తిరుపతి, ఆగస్టు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** 2029 ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎన్డీఎ కూటమి జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ను ప్రకటించాలని వీర బలిజ శంఖారావం తీర్మానించింది. అలాగే బలిజ నేతను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని వీర బలిజ సాంస్కృతిక పునర్జీవన శంఖారావ సభ డిమాండ్ చేసింది. వీర బలిజ సాంస్కృతిక పునర్జీవన శంఖారావ సభ ఆదివారంతిరుపతిలో జరిగింది. దక్షణ భారత దేశం, శ్రీలంకను పాలించిన బలిజ చక్రవర్తుల వారసులను సభ సన్మానించింది. ముఖ్యంగా శ్రీలంక కు చెందిన క్యాండీ రాజుల వారసులు, కళ్యాణదుర్గం బలిజ సంఘం అధ్యక్షుడు బుట్న తిమ్మరాజు సతీమణి ఛాయాదేవి రాజ సింఘే అలియాస్ లక్ష్మీ శ్రీ, బుట్న తిమ్మరాజు ను రాజా నవనీత, రాయదుర్గంకు చెందిన పురుషోత్తం రాజాలను సన్మానించారు. ఇకపై జరిగే ప్రతి సభలోనూ బలిజ పాలకుల వారసులను సన్మానించనునట్లు సభ ప్రకటించింది. ఈ శంఖారావంలో ఏడు తీర్మాణాలను ఆమోదించారు. బలిజ, కాపులు శతాబ్దాలుగా ధర్మానికి కట్టుబడి జీవనం సాగించారని, ప్రస్తుత భవిష్యత్ తరాలు సనాతన ధర్మపరిరక్షకులుగా కొనసాగాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త ఆముదాల ప్రభాకర్,క్రెడాయ్ మాజీ అధ్యక్షుడు వసంతం శ్రీనివాసులు,చింతకాయల కృష్ణయ్య,చిన్నంగారి రమణ,మాజీ ఎమ్మెల్యే మోహన్ పాల్గొన్నారు.

# కుశల కేశాలకు..



వాతావరణ కాలుష్యం మన కురులపై చూపే దుష్ప్రభావమెంతో ! దానితోడు రసాయనాలు ఎక్కువ. ఉండే షాంపూలను వాడితే జుట్టు మరింత పాడవుతుంది. మరేం చేద్దామంటారా? తలస్నానానికి ముందు ఈ చికిత్సలు ప్రయత్నిస్తే సరి. కప్పు నీటిలో కొన్ని వేపాకులు, 10-15 తులసి ఆకులు వేసి మరిగించాలి. గోరువెచ్చగా అయ్యాక నీటిని వడకట్టి పక్కన ఉంచాలి. ఆకులను మిక్సీ పట్టి, ఆ మిశ్రమంతో పాటు 3 స్పూన్ల కలబంద గుజ్జును ఆ నీటికి కలపాలి. ఆపై మాడు నుంచి కురుల వరకు దీన్ని పట్టించి, పావుగంట య్యాక తలస్నానం చేస్తే సరి.ఇది తలపై ఇన్‌ఫెక్షన్లను తగ్గించడంతోపాటు కురులు చిట్లడాన్నీ నివారిస్తాయి. శీకాయ, ఉసిరి ప్యాక్ కూడా కురులకు దివ్యౌషధం. అయితే దీని తయారీకి రెండు రోజులు కేటాయించాలి మరి. ఒక ఇనుప కడాయి తీసుకొని సమపాళ్లలో రెండు పొడులనూ తీసుకొని నీటిలో నానబెట్టాలి. రెండోరోజు మాడు, కురులకు పట్టించి, మృదువుగా రుద్దాలి. పావుగంట అయ్యాక గోరువెచ్చని నీటితో తలస్నానం చేసి చూడండి. మెరిసే కురులు సొంతమవుతాయి.ఇవి చుండ్రునీ నివారిస్తాయి. ముల్తానీ మట్టి మోముకి చేసే మేలెంతో మనకు తెలుసు. మాడునీ ఆరోగ్యంగా ఉంచుతుందని తెలుసా? రెండు స్పూన్ల ముల్తానీ మట్టికి మజ్జిగను కలిపి మెత్తని మిశ్రమంలా చేసుకోవాలి. అయిదు నిమిషాలు పక్కన పెట్టి, తర్వాత తలకు రాసుకోవాలి. ఆరాక చల్లని నీటితో తలస్నానం చేయాలి. జుట్టు బరకగా, పొడిబారుతున్నట్లు కనిపిస్తోంటే దీన్ని ప్రయత్నించండి. వాటికి తేమను అందించి మృదువుగా చేయడమే కాదు.. చెమట కారణంగా ఏర్పడే దురద,దద్దుర్లనూ తగ్గిస్తుంది.

**బరువు పెరుగుతున్నామనుకుని తిండిమానేయడం, అసలు ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా కనిపించిందల్లా తినడం రెండూ పొరపాటే. అమ్మాయిలు సాధారణంగా పని ఒత్తిడిలో చేసే పనులే ఇవి. నిజానికి సన్నబడాలంటే సమతులాహారం తీసుకోవాలి.**

# పోషకాలు నిండుగా !



సన్నబడాలనుకున్నప్పుడు అసలు కొవ్వుల అవసరమే ఉండదనుకోవడం, అవి లేని పదార్థాలను మాత్రమే తీసుకోవడం పొరబాటు. శరీర వ్యవస్థలు, హార్మోన్ల పనితీరు సరిగ్గా సాగిపోవాలంటే డైటరీ ఫ్యాట్‌ల అవసరం ఎక్కువే. లేదంటే నెలసరి ఇబ్బందులు తప్పకపోవచ్చు. పైగా ఆకలి అదుపు చేసుకోవలేకపోవచ్చు. మేలైన కొవ్వులు అందేలా గుడ్లు, పప్పుధాన్యాలు, అవిసెగింజలు, చేపలు వంటివి తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. మనం తీసుకునే ఆహారం ద్వారా అందే పిండిపదార్థాలు గ్లూకోజ్‌గా మార తాయి. ఇవి చక్కెరల్లా పని చేయడం వల్ల బరువూ పెరుగు తారు. ఆ పరిస్థితి ఎదురు కాకుండా ఉండా లంటే సంక్లిష్ట పిండి పదార్థాలున్న ఆహారాన్ని ఎంచుకోవాలి. బదులుగా సాధారణ బియ్యాన్ని తగ్గిస్తూనే, బ్రౌన్‌రైస్‌ని ఎంచుకోవాలి. రాగులు, కొర్రలు, జొన్నలు వంటి చిరుధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వాటివల్ల తగినంత పీచూ అంది జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఆకు కూరలు, కాయగూరలను సమ ప్రాధాన్యంతో ఎప్పుడో ఒకసారి కాకుండా తీసుకునే ప్రతి భోజనంలో భాగం చేసుకోవాలి. కాయగూరల్లో ఉండే విటమిన్లు శరీరానికి మేలు చేయడమే కాదు. పీచునూ అందిస్తాయి. పొట్ట నిండేలా చేసి, ఆకలినీ తగ్గిస్తాయి.అందుకే కీరదోస, క్యారెట్, టొమాటో, ఉల్లిపాయ, బీట్‌రూట్, క్యాబేజీలతో పాటు ఆకుపచ్చని ఆకుకూరలు పాలకూర, మెంతి కూర, తోటకూర, కరివేపాకు వంటి వాటికి తప్పనిసరిగా ప్రాధాన్యం ఇవ్వాలి.



# ఈ మౌనం ఎందుకు !

**కొంత మంది అమ్మాయలు ఆకస్మాత్తుగా మాట్లాడటం తగ్గిస్తారు. పలకరించినా కూడా సరైన సమాధానమివ్వ కుండా నిత్యం ఏదో కోల్పోయినట్లు ఉండటం చూసి తల్లిగా ఏం చేయాలో తెలియడం లేదు. ఇటువంటప్పుడు పిల్లలను సాధారణ స్థితికెలా తీసుకురావాలో చెబుతున్నారు నిపుణులు.**

పిల్లలు ఎదుగుతున్నప్పుడు పలురకాల భావోద్వేగాలకు గురవు తుంటారు. చదువులో అనుకున్న ర్యాంకు సాధించలేక పోవడం, ఇంట్లోవాళ్లు అడిగింది ఇవ్వక పోవడం వంటివి ఏవైనా కావొచ్చు. ఇటువంటి సందర్భాల్లో మౌనాన్ని వారెక్కువగా ఆశ్రయిస్తారు. అలాగే ఏదో కోల్పోయిన భావన వాళ్లలో కనిపిస్తుంది. ఈ మార్పును అమ్మానాన్నలే గుర్తించగలగాలి. ఆపై ముందు వాళ్ల మనసు తెలుసుకోవ డానికి ప్రయత్నించాలి. ప్రేమగా దగ్గరకు తీసుకుని ఏది ఏమైనా మేమున్నామనే బరోసానివ్వాలి. వాళ్ల మనసులోని మాటను బయటకు చెప్పే ధైర్యాన్నివవ్వగలగాలి.

**నిందించకూడదు..** ఏదైనా పొరపాటు జరిగినా, మార్కులు తగ్గినా, అనుకున్న సీటు సంపాదించలేక పోయినా.. పిల్లలను వెంటనే నిందించకూడదు. నిన్ను చదివించడానికి మేమెంత కష్టపడుతున్నాము.. నీకు చదువు వృథా వంటి మాటలతో గాయపరచ కూడదు. అప్పటికే వారెంతో ఆందోళన చెందుతుంటారు. అటు వంటి సమయంలో వారికి వేదన కలిగిస్తే కుంగుబాటుకు దారి తీసే ప్రమాదం లేకపోలేదు.అలా కాకుండా మరోసారి ప్రయత్నిస్తే అనుకున్నది సాధించగల మనే ధైర్యాన్నిస్తే మంచిది. ప్రతి చిన్న విషయాన్ని ప్రతి కూలతగా ఆలోచించ కుండా సానుకూల ధోరణి అలవడేలా చేయాలి. అప్పుడే వారిలో తిరిగి మరోసారి కృషి చేద్దామనే ఆలోచన మొదలవుతుంది.


**స్ఫూర్తి నింపాలి...** ఏ విషయాన్నైతే తమ సమస్యగా భావిస్తున్నారో దాన్ని పరిష్కరించుకునే పలు మార్గాలను వారెదుట ఉంచాలి. తీరని సమస్య అంటూ లేదని అవగాహన కలిగించాలి. ఇవన్నీ వారిలోని ఆత్మన్యూనతను దూరం చేసి, ప్రేరణ పొందేలా చేస్తాయి. అంతేకాదు, దేన్నైనా సాధించగలిగే సామర్థ్యం నీలో ఉందంటూ ఉత్సాహపరచాలి. గతంలో తను చేసిన సాధనలను గుర్తు చేసి ప్రశంసించాలి. ప్రతిభను మెచ్చుకుంటూ.. ముందడుగు వేసేలా ప్రోత్సహిస్తే చాలు. చదువులోనే కాదు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకూ ఎదురు నిలిచి పోరాడే తత్వాన్ని నేర్చుకుంటారు.అనుకున్నవన్నీ సాధించి విజేతలుగా నిలుస్తారు.

# గంట దానం

ఏ ఆలయంలోనైనా గంటను మోగించే ఆలయం తలుపులు తెరుస్తారు. భక్తులు గుడికి వెళ్లగానే 'గంట'ను మోగించి దైవానికి నమస్కరించు కుంటూ ఉంటారు. గంటను మోగించినప్పుడు వచ్చే ఓంకార తరంగ ధ్వని మనలోని ఆధ్యాత్మిక శక్తిని మేల్కొ లుపుతుంది. ఇక ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాల సన్నిధుల లోను 'గంటలు' ఉంటాయి. ఆ గంటలను కూడా మోగించే దైవానికి మనసులోని కోరికలను చెప్పుకుంటూ ఉంటాము. ఇక పూజా మందిరంలోను దైవానికి హారతి ఇచ్చేటప్పుడు .. నైవేద్యాన్ని సమర్పించేటప్పుడు కూడా గంటను మోగిస్తుంటాము. గంటను మోగించడం వలన దుష్టశక్తులు దరిదాపుల్లోకి రావనీ గంట శబ్దం వలన దేవతలు ప్రీతి చెందుతారని ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి. గంటను మోగించడం వలన . దేవాలయంలో ఉపయోగించ డానికిగాను 'గంట'ను దానంగా ఇవ్వడం వలన సమస్త దోషాలు తొలగిపోయి, సకల శుభాలు కలుగుతాయని ఆధ్యాత్మిక గ్రంధాలు స్పష్టం చేస్తున్నాయి. మనసులోని ధర్మబద్ధమైన కోరికలు నెరవేరినప్పుడు ఆలయానికి గంటలను మొక్కు బదులుగా చెల్లించే పద్ధతి కూడా చాలా చోట్ల కనిపిస్తుంది.



# ఎంతో శుభ్రంగా ..



ఒకప్పుడు కాలేజీకో, ఆఫీసుకో లేదంటే ఏవైనా ప్రయాణాలు చేసేటప్పుడో నీళ్ల సీసాలు వెంటతీసుకెళ్లేవారు. కానీ, ఇప్పుడు ఇంట్లోనే ఉన్నా.. బాటిల్‌తో తాగేవారే ఎక్కువ. అయితే, వీటిని సరిగా శుభ్రం చేయకపోతే మాత్రం వాసనరావడమే కాదు.. అనారోగ్యాలూ చుట్టుముడతాయి మరెలా అంటారా? గిన్నెలు తోమే లిక్విడ్ సోప్‌తో శుభ్రం చేయొచ్చు. అయితే, అందులోని రసాయనాలు ప్రభావం చూపించకుండా చివర్లో కాస్త ఉప్పు వేసి కడగడం మరిచిపోవద్దు. రాగి సీసాలను మానరతం సాల్ట్‌తో కగడకూడదు. ఇలా చేసేత అది రసాయన చర్య జరిపి కాపర్ క్లోరైడ్‌ని ఏర్పరు స్తుంది. ఇది ఆరోగ్యానికి హానికరం. బదులుగా వేడినీళ్లతో శుభ్రం చేయడం మేలు. వాటర్ బాటిళ్ల వాసన పోయి శుభ్రపడాలంటే.. నిమ్మ, వేప మిశ్రమం బాగా ఉపయోగపడుతుంది. కాస్త వేప పొడి, నిమ్మరసం వేసి నిండా నీళ్లు పోసి అలానే ఓ రెండు మూడు గంటలు ఉంచేయండి. తరవాత తాజా నీళ్లతో శుభ్రం చేస్తే సరి. నిమ్మ చెడు వాసనకు చెక్ పెడుతుంది. బ్యాక్టీరియానూ దూరం చేయగలదు. అందుకే, గోరువెచ్చని నీళ్లల్లో కాస్త నిమ్మరసం వేసి బాగా కదపాలి. ఆపై మంచినీళ్లతో రెండు మూడుసార్లు చేస్తే సరి. జిడ్డుతో పాటు దుర్వాసనా దూరమవుతుంది. వినెగర్ వేసినా ఫలితం ఉంటుంది. చెడు వాసన, జిడ్డు, క్రిములు.. వీటిని దూరం చేయడానికి వంట సోడాను మించిన పరిష్కారం లేదంటే నమ్మండి. ఓ చెంచా వంటసోడా వేసి నీళ్లు పోసి ఓ గంట ఉంచాక శుభ్రం చేయండి. ఇలా రోజు విడిచి రోజు చేస్తే మేలు. ఇది సీసాను సులువుగా శుభ్రపరుస్తుంది కూడా.

# కర కర బిస్కెట్లు ..



బిస్కెట్లలో బోలెడన్ని రకాలుంటాయి. తమ తమ ఇష్టాలను బట్టి నచ్చేవి కొనుక్కుంటారు. అంతే తప్ప బిస్కెట్లు మన తయారు చేసుకోవడం కొంచెం తక్కువ. కానేఈ గోధుమ పిండితో చేసే డైజెస్టివ్ బిస్కెట్లు చాలా సులువుగా ఇంట్లోనే చేసుకోవచ్చు. దీని కోసం స్వచ్ఛమైన గోధుమపిండి అరకిలో, పలు, పంచదార, రవ్వ, ఎండు కొబ్బరి ఒక్కోటీ కప్పు చొప్పున, సోంపు ఒకటిన్నర స్పూన్, నెయ్యి 3 టేబుల్ స్పూన్లు తీసుకోవాలి. ఒక పాత్రలో ఈ పదార్థాలు అన్నిటినీ వేసి బాగా కలపాలి. మెత్తటి ఈ పిండితో కొంచెం మందమైన రొట్టెలు చేయాలి. దాని ఈద గ్లాసు లేదా మూతతో నొక్కి గుండ్రటి ఆకృతులు వచ్చేలా కట్ చేయాలి. వాటి మీద ఫోర్క్‌తో గుచ్చి, రంధ్రాలు చేయాలి అన్నీ పూర్తయ్యాక. కాగుతున్న నూనెలో వేయించుకుంటే సరి. కరకరలాడే బిస్కెట్లు తయారైపోతాయి. ఇవెంతో రుచీ, ఆరోగ్యం కూడా. నిచ్చతే మీరూ చేసి చూడండి. పిల్లలూ పెద్దలూ అందరూ ఇష్టంగా తింటారు. ఇవి చాయ్‌లోకి మరింత బాగుంటాయి.

# తెర

## కొరటాలమార్క్.. పోలీస్ ఆఫీసర్

నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో ఒక భారీ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంటుండటంతో టాలీవుడ్‌లో కొత్త చర్చ మొదలైంది. దేవర సినిమాతో ఘన విజయం సాధించిన కొరటాల శివ, బాలయ్యను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని ఒక విభిన్నమైన మాస్ అవతార్‌లో చూపించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రముఖ నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. కొరటాల శివ మార్క్ సామాజిక నేపథ్యంతో పాటు, పవర్‌ఫుల్ యాక్షన్ అండ్ ఫ్యామిలీ ఎమోషన్స్ ఆధారంగా ఈ కథ సాగనుంది. ఈ సినిమాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటించడానికి తమిళ నటుడు ఆర్యను సంప్రదిస్తున్నట్లు సమాచారం. ఈ పాత్ర సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. కథా చర్చలు పూర్తయినందున త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానుంది. వరుస విజయాలతో జోరు మీదున్న బాలకృష్ణ, మాస్ పల్స్ తెలిసిన కొరటాల శివ కాంబినేషన్ బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం సృష్టిస్తుందని ఫిల్మ్ నగర్ వర్గాలు మరియు ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.



## ఆదర్శకుటుంబం మరింత ఆలస్యం

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఆదర్శ కుటుంబం. ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. అయితే, ఈ లోపే చిత్రీకరణ పూర్తి చేయడంపై చిత్ర బృందం దృష్టి పెట్టింది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నప్పటికీ, ఇంకా టాకీ పార్ట్‌కు సంబంధించి క్లైమాక్స్ సన్నివేశాలతో పాటు ఒక పాట చిత్రీకరణ పూర్తికావాల్సి ఉంది. సెప్టెంబర్ రెండో వారంలో ఈ బ్యాలెన్స్ సాంగ్ షూటింగ్‌ను ప్లాన్ చేసినట్లు సమాచారం. త్రివిక్రమ్ మార్క్ కామెడీతో పాటు, ఈ చిత్రంలో ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌లో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తుండగా.. నివేదా పేతురాజ్, యువిన, రాజ్ ప్రజ్వల్, రావు రమేష్, సత్య, బ్రహ్మాజీ ఇతర కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. హిట్ కాంబో రిపీట్ అవుతుండటంతో ఈ సినిమాపై సినీ ప్రియుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.





## విశ్వరూపం


ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కమర్షియల్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న భారీ ప్రాజెక్ట్ రాకా టాలీవుడ్‌లో సరికొత్త సంచలనాలకు తెరలేపుతోంది. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ రూ. 100 కోట్ల భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ డ్రామా షూటింగ్ ఇప్పటికే తుది దశకు చేరుకోగా, ఈ సినిమాకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ ఏకంగా త్రిపాత్రాభినయం చేయబోతున్నారని సమాచారం. తండ్రీ కొడుకుల సెంటిమెంట్ నేపథ్యంతో సాగే ఈ కథలో ఒక కొడుకు పాత్ర పూర్తి నెగెటివ్ షేడ్స్‌తో అత్యంత క్రూరంగా ఉండబోతోందట. బన్నీ కెరీర్‌లోనే ఒకే సినిమాలో మూడు భిన్నమైన రోల్స్ చేయడం ఇదే తొలిసారి కావడంతో ఫ్యాన్స్‌లో అంచనాలు తారాస్థాయికి చేరాయి. సినిమాలో బన్నీకి జోడీగా దీపికా పదుకొణె, రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ నటించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నేషనల్ క్రష్ రష్మిక ఈ సినిమాలో నెగెటివ్ షేడ్ ఉన్న కీలక పాత్రలో కనిపించనుందనే టాక్ ఇండస్ట్రీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. రెండు భాగాలుగా విడుదహాలీవుడ్ స్థాయి జునీశ్రీ, విజువల్ గ్రాఫిక్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ రెండు భాగాల షూటింగ్‌ను ఒకేసారి పూర్తి చేసి, రిలీజ్ మధ్య పెద్దగా గ్యాప్ లేకుండా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని అట్లీ భావిస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి అల్లు అర్జున్ తన పోర్షన్ షూటింగ్‌ను పూర్తి చేయనున్నారని, ఆ తర్వాత ఆయన లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కే ప్రాజెక్ట్‌కి మారనున్నారని సమాచారం. త్వరలోనే రాకా చిత్రానికి సంబంధించిన అధికారిక టీజర్‌ను విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

## ఇక సినిమాకే పూర్తి సమయం



టాలీవుడ్ ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ సోషల్ మీడియా వేదికగా చేసిన ఒక సుదీర్ఘ భావోద్వేగ పోస్ట్ ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్రంగా వైరల్ అవుతోంది. తనపై వస్తున్న కథనాలపై ఆవేదన వ్యక్తం చేస్తూనే, తన భవిష్యత్ కార్యాచరణను ఆయన స్పష్టం చేశారు. తన మనసులో ఎలాంటి ఇతర ఆలోచనలు లేదా వివాదాలు లేవని, తన ధ్యేయం కేవలం మంచి చిత్రాలను నిర్మించి ప్రేక్షకులకు అందించడమేనని తేల్చిచెప్పారు. గతాన్ని గుర్తుచేసుకుంటూ.. తన కష్టసమయంలో ఆదుకున్న వారిని, నమ్మిన వారిని ఈ జన్మలో ఎప్పటికీ మర్చిపోలేనని, వారి రుణం తీర్చుకోలేనిదని పేర్కొన్నారు. అవసరం ఉన్నంతవరకు వాడుకుని వదిలేసే మనస్తత్వం తనకు లేదని, మేలు చేసిన వారిని గుండెల్లో పెట్టుకోవడమే తన నైజమని తెలిపారు. గతంలో కొన్ని తప్పులు జరిగి ఉండవచ్చని అంగీకరిస్తూ, ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తనను నిలబెట్టిన చిత్ర పరిశ్రమకే ఇకపై పూర్తి సమయాన్ని కేటాయిస్తానని స్పష్టం చేశారు. నటుడిగా సినీ రంగంలోకి అడుగుపెట్టి.. ఆ తర్వాత అగ్ర నిర్మాతగా టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి బండ్ల గణేష్. నిర్మాతగా ఆయన నిర్మించిన సినిమాలు ఎంతటి సంచలన విజయాలను అందుకున్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. రవితేజతో ఆంజనేయులు, పవన్ కళ్యాణ్‌తో గబ్బర్ సింగ్, జూనియర్ ఎన్టీఆర్‌తో బాద్‌షా, టెంపర్, అల్లు అర్జున్‌తో ఇద్దరమ్మాయిలతో వంటి భారీ చిత్రాలను నిర్మించి బాక్సాఫీస్ వద్ద విజయాలు అందుకున్నారు.

## ప్రేమ, బాధ్యతల కథే



బేబీ వంటి కల్ట్ బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య కాంబినేషన్‌లో వస్తున్న తాజా యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్ ఎపిక్. సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా నిర్వహించిన ఇంటర్వ్యూలో హీరోహీరోయిన్లు ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య పలు ఆసక్తికర విశేషాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ, ప్రతి సామాన్య కుర్రాడి జీవితంలో ప్రేమ, బాధ్యతల కోసం నిలబడినప్పుడు కలిగే అద్భుతమైన ఫీలింగ్‌ను సూచించేలా ఈ చిత్రానికి ఎపిక్ అని పేరు పెట్టామని తెలిపారు. ఈ సినిమాలో తన పాత్ర శేఖర్ కమ్ముల సినిమాల్లోని అమాయకపు హీరోలా ఉంటే, వైష్ణవి పాత్ర మాత్రం సందీప్ రెడ్డి వంగా క్యారెక్టర్ల తరహాలో ఎంతో క్లారిటీ, బోల్డ్‌నెస్‌తో ఉంటుందని చెప్పారు. నేటి యువత ఆలోచనలకు అద్దం పడుతూనే, లివ్‌ఇన్ రిలేషన్‌షిప్, ఫ్యా మిలీ ఎమోషన్స్‌ను దర్శకుడు ఆదిత్య హాసన్ ఎంతో బాధ్యతాయుతంగా, వినో దాత్మకంగా మలిచారని పేర్కొన్నారు. లండన్ నేపథ్యంలో దాదాపు 50 రోజుల పాటు సాగిన షూటింగ్ ఎంతో పాజిటివ్ వైబ్‌తో ముగిసిందని, హేషమ్ అబ్దుల్ వహాబ్ అందించిన సంగీతం ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలుస్తుందని ఆనంద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక కథానాయిక వైష్ణవి చైతన్య మాట్లాడుతూ, బేబీ తర్వాత ప్రతి సినిమా తనకు నూతన అనుభవాన్ని ఇస్తోందని, ఎపిక్ షూటింగ్ ప్రాసెస్ మొదలైనప్పటి నుంచి ప్రతి క్షణాన్ని అమితంగా ఆస్వాదించానని తెలిపారు. సినిమా థియేటర్ల నుంచి బయటకు వచ్చే ప్రతి అమ్మాయి తన పాత్రతో తప్పకుండా కనెక్ట్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## కింగ్‌తో జత



అక్కినేని నాగార్జున కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ చిత్రంగా రూపుదిద్దుకుంటున్న కింగ్ 100పై మొదటి నుంచీ సినీ వర్గాల్లో భారీ అంచనాలు ఉన్నాయి. తమిళ దర్శకుడు రా కార్తీక్ తెరకెక్కిస్తున్న ఈ ల్యాండ్‌మార్క్ మూవీలో కోలీవుడ్ మోస్ట్ టాలెంటెడ్ నటి ఐశ్వర్య రాజేష్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు గత కొంతకాలంగా ప్రచారం సాగుతోంది. తాజాగా ఈ వార్తలపై ఐశ్వర్య రాజేష్ స్వయంగా స్పష్టత ఇచ్చారు. నాగార్జున పుట్టినరోజు సందర్భంగా శనివారం విడుదలైన కింగ్ 100 టైటిల్ గ్లింప్స్‌ను ఐశ్వర్య రాజేష్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. అంతేకాకుండా, గతంలో హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలి మంచు పర్వతాల నేపథ్యంలో జరిగిన షూటింగ్ దృశ్యాలను, అక్కడ సంప్రదాయ వస్త్రధారణలో దిగిన పిక్స్‌తో పాటు దర్శకుడు కార్తీక్‌తో దిగిన సెల్ఫీని పంచుకున్నారు. దీంతో ఈ భారీ ప్రాజెక్ట్‌లో ఆమె కథానాయికగా నటిస్తున్నట్లు దాదాపు ఖరారైంది.



## దేవకన్యల వస్త్రధారణపై అభ్యంతరం


అల్లరి నరేష్ కథానాయకుడిగా నటిస్తున్న ఫాంటసీ కామెడీ చిత్రం రంభ ఊర్వశి మేనక చివరి నిమిషంలో సెన్సార్ చిక్కుల్లో పడటంతో చిత్ర యూనిట్‌తో పాటు ఫిలిం సర్కిల్స్‌లో పెద్ద చర్చ నడుస్తోంది. స్వర్గం నుంచి భూమిపైకి వచ్చే రంభ, ఊర్వశి, మేనక దేవకన్యల పాత్రలను చూపించిన విధానం, వారి వస్త్రధారణ, అలాగే పాటల్లో వారిని చూపించిన తీరుపై సెన్సార్ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దేవకన్యల డ్రెస్సింగ్ స్టైల్‌లో సంప్రదాయ మార్పులు చేయాలని, కొన్ని కీలక సన్నివేశాల్లో కట్స్ విధించాలని సిఫార్సు చేశారని సమాచారం. కథాంశంలో కామెడీ సన్నివేశాలలో ఆ దేవకన్యల పాత్రలే అత్యంత కీలకమైనవి కావడంతో, ఆ కట్స్‌ను అంగీకరించేందుకు నిర్మాతలు సిద్ధంగా లేరు. దీంతో ఈ వివాదాన్ని పరిష్కరించుకుని సెన్సార్ సర్టిఫికెట్ సాధించేందుకు చిత్ర బృందం రివైజింగ్ / రివ్యూ కమిటీని ఆశ్రయించింది.

## మహాయోధుడి పాత్ర తోడైతే..

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ త్వరలోనే ఒక భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారనే వార్త ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో సంచలనం సృష్టిస్తోంది. భారతీయ ఇతిహాసం మహాభారతంలోని అత్యంత విషాదకరమైన, శక్తిమంతమైన పాత్రల్లో ఒకటైన కర్ణుడి జీవిత చరిత్ర ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కనుందని టాక్.

రంగ్ దే బసంతి, భాగ్ మిల్కా భాగ్ వంటి క్లాసిక్స్ అందించిన జాతీయ అవార్డు గ్రహీత, దర్శకుడు రాకేష్ ఓంప్రకాష్ మెహ్రా ఈ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహించనున్నారు. ఈ ప్రాజెక్ట్ స్క్రిప్ట్, వార్ సీన్స్, క్యారెక్టర్ డిజైనింగ్‌పై దర్శకుడు మెహ్రా గత ఐదేళ్లుగా సుదీర్ఘ ప్రీప్రొడక్షన్ వర్క్ చేస్తున్నారు. కర్ణుడి వీరత్వం, ఎదుర్కొన్న ఆత్మాభిమాన పోరాటాలు, త్యాగం మరియు జీవితంలో ఎదురైన విషాద ఘట్టాలను అత్యంత ప్రామాణికంగా వెండితెరపై ఆవిష్కరించనున్నారు.

ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ చర్చల దశలో ఉండగా, ప్రీప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుని 2027లో సెట్స్‌పైకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. సల్మాన్ ఖాన్ ఇమేజ్‌కు, కర్ణుడి వంటి మహాయోధుడి పాత్ర తోడైతే ఇండియన్ బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. చిత్ర బృందం నుండి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.



ఆట

## ఇంటర్నేషనల్ ఛాలెంజ్‌లో
# ఛాంపియన్‌గా తన్వి పత్రి


**ఇండోనేషియా:** భారత్‌కు చెందిన వర్ధమాన టీనేజర్ తన్వి పత్రి ఆదివారం ఇండోనేషియాలో జరిగిన పొంటియానాక్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్‌లో తన తొలి సీనియర్ అంతర్జాతీయ టైటిల్‌ను కైవసం చేసుకుని ఛాంపియన్‌గా నిలిచింది. 15 ఏళ్ల ఈ బాలిక మహిళల సింగిల్స్ ఫైనల్‌లో తన దక్షి ణ కొరియా ప్రత్యర్థి మిన్ సన్ కిమ్‌ను కేవలం 32 నిమిషాల్లోనే 21-5, 21-6 తేడాతో చిత్తుగా ఓడించి, తిరుగులేని విజయాన్ని కైవసం చేసుకుంది. ఇక మాజీ ఆసియా అండర్15 ఛాంపియన్




ఈ ఏడాది కొన్ని మంచి ఫలితాలు సాధించింది. ఛాలెంజర్ సర్క్యూట్‌లో నాలుగు ఫైనల్స్ కు చేరుకుని, ఇప్పుడు ఇండోనేషి యాలో ఒక టైటిల్‌ను గెలుచుకుంది. ఈ ఏడాది ఆమె ఇండియన్ నేషనల్స్ ఫైనల్‌కు కూడా చేరుకుని, సూర్య తమిరి చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయి, భారతదేశపు అత్యంత పిన్న వయస్కురాలైన జాతీయ ఛాంపియన్‌గా నిలిచే అవకాశాన్ని కోల్పోయింది. అయితే, భారత బ్యాడ్మింటన్ సమాజంలో ఆమె ప్రతిభకు విస్తృత గుర్తింపు లభించింది. అంతేకాక సీనియర్ క్రీడాకారిణి పీవీ సింధు కూడా తన కొన్ని సోషల్ మీడియా పోస్టులలో ఆమెను భారత బ్యాడ్మింటన్ భవిష్యత్తు అని అభివర్ణించారు. మరోవైపు, పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో స్వదేశీ ఆటగాడైన రిచీ రిచర్డ్ చేతిలో 22-24, 19 -21 తేడాతో ఓడిపోయిన భారత ఆటగాడు గిన్‌పాల్ సోన్నా రన్నరప్‌గా నిలిచాడు.

# స్క్వాష్ ఛాలెంజర్‌లో అభయ్‌కు టైటిల్

**మలేసియా:** భారత నంబర్ 1 అభయ్ సింగ్ ఆదివారం మలేషియాలోని నెగెరి సెంబిలాన్‌లో ఆదివారం జరిగిన తువాంకు ముహ్రిజ్ ట్రోఫీలో విజయం సాధించడం ద్వారా పిఎస్ఎ సర్క్యూట్‌లో తన కెరీర్‌లో 13వ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. టాప్ సీడెడ్ అభయ్ తన



మంచి ఫామ్‌ను కొనసాగిస్తూ, హాంగ్ కాంగ్‌కు చెందిన హెన్రీ లువాంగ్‌ను ఐదు గేమ్‌లలో 11-7, 6-11, 3-11, 11-5, 12-10 తేడాతో ఓడించి, ఈ 15కె పిఎస్ఎ ఛాలెంజర్ టైటిల్‌ను సాధించాడు. హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో 1-2తో వెనుకబడిన భారత స్టార్, చివరి రెండు గేమ్‌లను గెలిచి మలేషియాలో విజయం సాధించి, తన కెరీర్‌లో మరో ఘనతను చేర్చుకున్నాడు. టాప్ సీడ్ అయినప్పటికీ, అభయ్ టోర్నమెంట్ అంతటా తీవ్రమైన సవాలును ఎదుర్కొన్నాడు. ఫైనల్‌కు చేరే క్రమంలో అతను మూడు కఠినమైన మ్యాచ్‌లు ఆడాడు. వాటిలో హెన్రీ అతడిని చివరి వరకు తీవ్రంగా శ్రమించేలా చేశాడు. అతను మలేషియాకు చెందిన లో వా సెర్న్, మహమ్మద్ షఫిక్ కమల్‌లపై నాలుగు గేమ్‌ల చొప్పున రెండు విజయాలతో తన ప్రచారాన్ని ప్రారంభించి సెమీఫైనల్స్‌కు చేరుకున్నాడు. సెమీస్‌లో, అతను మరో మలేషియన్ ప్రత్యర్థి అమీషెన్‌రాజ్ చందరన్‌తో జరిగిన 72 నిమిషాల సుదీర్ఘ మ్యాచ్‌లో గెలిచి, తృటిలో గట్టెక్కాడు. ప్రపంచ 24వ ర్యాంకర్ అయిన అభయ్‌కి రెండు నెలల తర్వాత ఇది మొదటి ఈవెంట్.



## ఆసియా రగ్బీ సెవెన్స్
# టాప్6లో భారత్ మహిళలు
### చివరి స్థానంలో పురుషుల జట్టు

**చైనా:** ఆసియా రగ్బీ సెవెన్స్‌లో భారత మహిళలు వరుసగా మూడోసారి టాప్6లో స్థానం దక్కించుకున్నారు. ఆదివారం చైనాలో జరిగిన 2026 ఆసియా రగ్బీ సెవెన్స్ సిరీస్ సీజన్ ఆరంభ టోర్నమెంట్ మొదటి దశలో భారత మహిళల రగ్బీ సెవెన్స్ జట్టు 6వ స్థానంలో నిలిచింది. ఐదవ స్థానం కోసం జరిగిన హోరాహోరీ ప్లేఆఫ్ మ్యాచ్‌లో కజకిస్తాన్ చేతిలో 12-17 తేడాతో ఓడిపోయిన భారత్, ఈ టోర్నమెంట్‌లో తమ అత్యుత్తమ స్థానాన్ని దక్కించుకునే అవకాశాన్ని కోల్పోయింది. మొత్తం మీద, గత సంవత్సరం ఈ ఈవెంట్‌కు ప్రమోట్ అయినఅమ్మాయిలు స్థిరమైన ప్రదర్శన కనబరుస్తున్నారు. గత సంవత్సరం రెండుసార్లు 6వ స్థానంలో నిలిచిన తర్వాత, ఇప్పుడు ఈ సిరీస్‌లో వరుసగా మూడవసారి టాప్‌సిక్స్‌లో స్థానం సంపాదించారు. అయితే, ఈ మూడు మ్యాచ్‌లలోనూ భారత్ అనుభవజ్ఞులైన కజఖ్ జట్టును అధిగమించడంలో విఫలమై, అదే 5వ స్థానం కోసం జరిగిన ప్లేఆఫ్ మ్యాచ్‌లలో వారి చేతిలో ఓడిపోయింది. భారత జట్టు ఇప్పుడు అక్టోబర్‌లో శ్రీలంకలో జరిగే రెండో దశలో మరియు వచ్చే నెల జపాన్‌లో జరిగే ఆసియా క్రీడలలో తమ స్థానాన్ని మెరుగుపరుచుకోవాలని చూస్తోంది. ఇదిలా ఉండగా, 16 ఏళ్ల తర్వాత ఈ ఏడాది అగ్రశ్రేణిలోకి తిరిగి వచ్చిన భారత పురుషుల జట్టుకు ఆరంభం కష్టంగా సాగి, 12 జట్ల పురుషుల పోటీలో చివరి స్థానంలో నిలిచింది. వారు సింగపూర్‌తో జరిగిన 9 నుండి 12వ స్థానం కోసం జరిగిన చివరి అర్హత మ్యాచ్‌లో తమ మొదటి మరియు ఏకైక విజయాన్ని నమోదు చేసుకున్నారు, కానీ ఉజ్బెకిస్తాన్‌తో జరిగిన ముఖాముఖి రికార్డులో వెనుకబడటం వల్ల చివరి స్థానంలో నిలిచారు.

# 7 పరుగులకే ఆలౌట్

## 10 రన్స్‌కే కుప్పకూలిన జట్లు
### టి20 చరిత్రలోనే అత్యంత దారుణ స్కోర్లు




**న్యూఢిల్లీ:** టీ20 క్రికెట్ అనగానే మనకు గుర్తొచ్చేవి ధనాధన్ సిక్సర్లు, మెరుపు అర్ధశతకాలు, ఫోర్ల వర్షం. కానీ, ఈ ఫాస్ట్ ఫార్మాట్లో బ్యాటర్ల వీరబాదుడు మాత్రమే కాదు, ఒక్కోసారి ఊహించని స్థాయిలో టీమ్‌లు కుప్పకూలుతుంటాయి. భారీ షాట్లతో విరుచుకుపడదామని మైదానం లోకి అడుగుపెట్టిన జట్లు, పరుగుల వేట పక్కనబెట్టి క్రీజులో నిలదొక్కుకోవడానికే అష్టకష్టాలు పడిన అత్యల్ప స్కోర్లకే ఆలౌటై దారుణమైన రికార్డులను మూటగట్టుకున్నాయి. ఈ జాబితాలో అందరికంటే అగ్రస్థానంలో నిలిచి అత్యంత దారుణమైన రికార్డును తన పేరిట లిఖించుకుంది ఐవరీ కోస్ట్. 2024 నవంబర్ 24న నైజీరియాతో జరిగిన మ్యాచ్‌లో లక్ష్యచేధనకు దిగిన ఐవరీ కోస్ట్ బ్యాటర్లు కనీసం దశాంశం దాటలేకపోయారు. ప్రత్యర్థి బౌలర్ల దాటికి కేవలం 7.3 ఓవర్లలోనే చేతులెత్తేసి 7 పరుగులకే ఆలౌట్ అయ్యారు. 0.93 సగటు రన్ రేట్తో నమోదైన ఈ స్కోరు, అంతర్జాతీయ టీ20 చరిత్రలోనే అత్యల్ప టీమ్ స్కోరుగా మిగిలిపోయింది. ఇకరెండో అత్యల్ప స్కోరురికార్డును ఇద్దరు పంచుకున్నారు. అందులో ఒకటి మంగోలియా కాగా, మరొకటి ఐల్ ఆఫ్ మ్యాన్. 2024 సెప్టెంబర్ 5న సింగపూర్‌తో జరిగిన మ్యాచ్లో టాస్ గెలిచి తొలి బ్యాటింగ్ చేసిన మంగోలియా, ప్రత్యర్థి బౌలింగ్ ధాటికి నిలవలేక 10 ఓవర్లలో సరిగ్గా 10 పరుగులకే కుప్పకూలింది. ఇలాంటి ఘటనే 2023 ఫిబ్రవరి 26న స్పెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ పునరావృతమైంది. స్పెయిన్ సంచలన బౌలింగ్‌కు ఐల్ ఆఫ్ మ్యాన్ జట్టు క్యూ కట్టింది. 8.4 ఓవర్లలో కేవలం 10 పరుగులకే ఆలౌట్ కాగా, ఆ చిన్న లక్ష్యాన్ని స్పెయిన్ అత్యంత సులువుగా ఛేదించింది. మంగోలియాకు టీ20 ప్రయాణం అస్సలు కలిసిరావడం లేదనడానికి ఈ జాబితాలో ఆ జట్టు మరోసారి కనిపించడమే నిదర్శనం. 2024 మే 8న జపాన్‌తో జరిగిన మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్ ఆడిన మంగోలియా, 8.2 ఓవర్లలో కేవలం 12 పరుగులకే ఆలౌట్ అయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.

అటు ఐవరీ కోస్ట్ కూడా మరోసారి ఈ దారుణ రికార్డుల జాబితాలో తన పేరు నమోదు చేసుకుంది. 2026 మే 24న రువాండాతో జరిగిన పోరులో రెండో ఇన్నింగ్స్ ఆడిన ఐవరీ కోస్ట్, ఒక్కో పరుగు కోసం అల్లాడిపోయింది. 15.2 ఓవర్ల పాటు పోరాడినప్పటికీ బోర్డుపై కేవలం 17 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో రువాండా ఏకపక్షంగా విజయాన్ని అందుకుంది.




## ఎమ్ఎల్ఎస్ లీగ్‌లో ఇంటర్ మయామి
# ఘన విజయం
### మాంట్రియల్ 7-1తో ఓటమి

**మయామి:** లియోనెల్ మెస్సీ రెండవ అర్ధభాగంలో మూడు గోల్స్ చేసి, ఎమ్ఎల్ఎస్ లీగ్‌లో తన తొలి నాలుగు గోల్స్ ప్రదర్శనను పూర్తి చేయడంతో పాటు, ఒక అసిస్ట్ కూడా అందించాడు. దీంతో ఇంటర్ మయామి, ప్రత్యర్థికి ఒక్క గోల్ కూడా చేసే అవకాశం ఇవ్వకుండా ఆరు గోల్స్ చేసి, సిఎఫ్ మాంట్రియల్ పై 7-1 తేడాతో ఘన విజయం సాధించింది. 40వ నిమిషంలో మెస్సీ ఫ్రీ కిక్ ద్వారా 15వ సారి గోల్ చేసి, 1-1తో ఉన్న స్కోరును అధిగమించాడు. ప్రస్తుత గోల్డెన్ బూట్ అవార్డు విజేత, లీగ్ ఎమ్‌విపి అయిన అతను 52వ నిమిషంలో గోల్ చేసి 3-1 ఆధిక్యాన్ని అందించాడు. ఈ సీజన్లో అతని 17వ, 18వ గోల్స్‌ను అతను 83వ నిమిషంలో, స్టాపేజ్ టైమ్లోని ఆరవ నిమిషంలో సాధించాడు. చివరి గోల్ కూడా ఫ్రీ కిక్ ద్వారానే వచ్చింది. గోల్స్ రేసులో మెస్సీ, ఎఫ్‌సి డల్లాస్‌కు చెందిన పెటార్ మూసా కంటే రెండు గోల్స్ వెనుకబడి ప్రారంభించాడు. 20వ నిమిషంలో టెలాస్కో సెగోవియా ఇచ్చిన కార్నర్ కిక్‌ను కార్లోస్ కాసిమిరో హెడర్తో గోల్‌గా మలిచి ఇంటర్ మయామికి 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఈ సీజన్లో ఫాబియన్ హెర్బర్స్ చేసిన మొదటి గోల్తో, 37వ నిమిషంలో మాంట్రియల్ స్కోరును సమం చేసింది.

80వ నిమిషంలో మెస్సీ అందించిన 10వ అసిస్ట్తో లూయిస్ సువారెజ్ తన 11వ గోల్ చేసి స్కోరును 4-1కి చేర్చాడు. ఆ తర్వాత, 18 ఏళ్ల కొత్త ఆటగాడు అలెగ్జాండర్ షా, మూడు మ్యాచ్‌లో 37 నిమిషాలు ఆడిన తర్వాత తన మొదటి గోల్ను 89వ నిమిషంలో సాధించి స్కోరును 6-1కి చేర్చాడు. ఇంటర్ మయామి తరఫున డేన్ సెయింట్ క్లెయిర్ మూడు సేవ్స్‌తో ముగించాడు. 81వ నిమిషంలో పెనాల్టీ కిక్తో సువారెజ్ ఆ విజయాన్ని అందించాడు.

# దేశీయ స్టాక్ మార్కెట్లో కీలక పరిణామాలు!
### ఇన్వెస్టర్లు మరింత అప్రమత్తం




**ముంబయి, ఆగస్టు 30:** దేశీయ, అంతర్జాతీయ స్థూల ఆర్థిక గణాంకాలు, ప్రైమరీ మార్కెట్ పరిణామాలు, కంపెనీల కార్పొరేట్ చర్యలు, ప్రపంచ మార్కెట్ల సంకేతాల నేపథ్యంలో వచ్చే వారం దేశీయ స్టాక్ మార్కెట్లలో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించే అవకాశం ఉంది.ముఖ్యంగా నెలవారీ ఆటో విక్రయాల గణాంకాలు ఆయా ఆటో కంపెనీల షేర్లపై ప్రభావం చూపనున్నాయి. అమెరికా, ఆసియా మార్కెట్లలోని పరిణామాలు వివిధ రంగాల షేర్ల కదలికలను నిర్దేశించనున్నాయి.కంపెనీల బోర్డురూమ్‌ల నుంచి వెలువడే కార్పొరేట్ పరిణామాలు కూడా కొన్ని నిర్దిష్ట షేర్లలో ట్రేడింగ్ వాల్యూమ్‌లను ప్రభావితం చేయవచ్చు. మరోవైపు అమెరికాఇరాన్ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, మధ్యప్రాచ్య పరిణామాలు అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ ధరలపై ప్రభావం చూపడం కొనసాగించవచ్చు. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల ట్రేడింగ్ కార్యకలాపాలు కూడా మార్కెట్ మొత్తం దిశను ప్రభావితం చేయనున్నాయి. దేశీయ మార్కెట్ పరిస్థితిశుక్రవారం దేశీయ ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలుసెన్సెక్స్, నిఫ్టీ50 స్వల్పంగా లాభపడ్డాయి. కొత్త క్లోజింగ్‌ఆక్షన్ విధానంపై ఆందోళనల కారణంగా వరుసగా మూడో వారాన్నినష్టాలతో ముగించాయి. 5నెలల్లో ఇదేఅత్యంత సుదీర్ఘమైన వారపు నష్టాల పరంపర.శుక్రవారం నిఫ్టీ 50 0.35 శాతం పెరిగి 24,175.65 పాయింట్లవద్ద ముగిసింది.బీఎస్ఈ సెన్సెక్స్ 0.43% లాభపడి 77,264. 51 పాయింట్ల వద్ద స్థిరపడింది.అమెరికా చిప్ తయారీ సంస్థ ఎన్విడియా త్రైమాసిక ఫలితాలు అంచనాలను మించడంతో ఐటీ షేర్లకు మద్దతు లభించింది. దీంతో నిఫ్టీ ఐటీ సూచి 3.5 శాతం ఎగబాకింది. మొత్తం వారాన్ని పరిశీలిస్తే నిఫ్టీ, సెన్సెక్స్ వరుసగా 0.3%, 0.4% నష్టపోయాయి. మరోవైపు దేశీయ చిన్న, మధ్య తరహా కంపెనీల షేర్లు ఒక్కొక్కటి 0.5 శాతం చొప్పున లాభపడ్డాయి. కంపెనీల మెరుగైన ఆర్థిక ఫలితాలు, క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గడం, దేశీయ ఇన్వెస్టర్ల నుంచి కొనసాగుతున్న పెట్టుబడులు వీటికి మద్దతుగా నిలిచాయి.వచ్చే వారం దేశీయ స్థూల ఆర్థిక గణాంకాలు, ఆటో విక్రయాలు, అంతర్జాతీయ మార్కెట్ల పరిణామాలు, భౌగోళిక రాజకీయ పరిస్థితులు డీస్ట్రీట్‌పై కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది.




**ముంబయి,ఆగస్టు 30:** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొత్త ఎండిసిఇఒ పోస్టుకు ఇద్దరు అంతర్గత అభ్యర్థుల పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. బ్యాంక్ సీనియర్ అధికారులు కైజాద్ భరూచా, జిమ్మీ టాటా పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. బ్యాంక్ నామినేషన్ అండ్ రెమ్యునరేషన్ కమిటీ, బోర్డు అవసరమైతే బయటి అభ్యర్థులను కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.ఈ ఇద్దరు అంతర్గత అభ్యర్థుల పేర్లను బ్యాంక్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకి తెలియజేసి ంది. అయితే ఈ విషయంపై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎలాంటి వ్యాఖ్య చేయలేదు.కైజాద్ భరూచా గత 12 ఏళ్లుగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డులో కొనసాగుతున్నారు. బ్యాంకింగ్ నియంత్రణ నిబంధనల ప్రకారం ఒక డైరెక్టర్ బ్యాంక్ బోర్డులో గరిష్ఠంగా 15 ఏళ్ల వరకు మాత్రమే కొనసాగవచ్చు. దీంతో సీఈఓగా భరూచాను నియమించేందుకు ఆర్‌బీఐ నుంచి ప్రత్యేక అనుమతి అవసరం కావచ్చని తెలుస్తోంది.మరోవైపు జిమ్మీ టాటా ఇటీవల బ్యాంక్ చీఫ్ క్రెడిట్ ఆఫీసర్‌గా తన పదవీకాలాన్ని పొడిగించు కున్నారు. ఆయన 1994 నుంచి వివిధ హోదాల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో అనుబంధం కలిగి ఉన్నారు. అక్టోబర్ 26న తప్పుకోనున్న జగదీశన్‌ప్రస్తుత ఎండీ, సీఈఓ శశిధర్ జగదీశన్ మరోసారి పదవిలో కొనసాగేందుకు ఆసక్తి చూపకపోవడంతో తదుపరి సీఈఓ ఎంపిక ప్రక్రియను బ్యాంక్ బోర్డు వేగవంతం చేసింది. జగదీశన్ అక్టోబర్ 26న తన పదవి నుంచి తప్పుకోనున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది.తనను మరోసారి ఎండీసీఈఓగా నియమించాలన్న ప్రతిపాదనను పరిశీలించవద్దని జగదీశన్ నిర్ణయించుకున్నారని బ్యాంక్ తెలిపింది. ఈ ఏడాది మార్చిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నాన్‌ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అటాను చక్రవర్తి అనూహ్యంగా రాజీనామా చేయడం ఈ చర్చలకు మరింత ఊతమిచ్చింది.బ్యాంక్‌లో నైతికత, పాలన (గవర్నెన్స్)కు సంబంధించిన ఆందోళనలను కారణాలుగా పేర్కొంటూ చక్రవర్తి తన పదవికి రాజీనామా చేశారు. ఈ పరిణామం నేపథ్యంలో తదుపరి సీఈఓ ఎంపికపై బ్యాంకింగ్ వర్గాల్లో ఆసక్తి మరింత పెరిగింది.

# టిమ్‌కుక్ హయాంలో 28 రెట్లు యాపిల్‌షేర్లు ర్యాలీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:** యాపిల్ కేవలం మార్కెట్ విలువలోనే కాకుండా వాల్‌స్ట్రీట్ ట్రేడర్ల దృష్టిలోనూ మరింత బలమైన స్థానాన్ని సంపాదించుకుంది. సంస్థ ప్రస్తుత సీఈఓ టిమ్ కుక్ పదవీకాలంలో యాపిల్ షేరు విలువ ఏకంగా 28 రెట్లకు పైగా పెరిగింది. 2011 ఆగస్టులో యాపిల్ షేరు ధర సుమారు 1114 డాలర్ల మధ్య ఉండేది. అప్పట్లో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు 293 బిలియన్ డాలర్లుగా ఉంది.అయితే ఆ సమయంలో యాపిల్ పలు సవాళ్లను ఎదుర్కొంది. ముఖ్యంగా ఐఫోన్ 6, ఐఫోన్ 6 ప్లస్ ఫోన్లు ఎక్కువ ఒత్తిడికి గురైతే వంగిపోతున్నాయంటూ వెలుగులోకి వచ్చిన బెండ్‌గేట్ వివాదం కంపెనీకి పెద్ద ఇబ్బందిగా మారింది. పలుచటి అల్యూమినియం బాడీ కారణంగా బిగుతైన ప్యాంటు జేబులో ఉంచినప్పుడు కూడా ఫోన్లు వంగే అవకాశం ఉందంటూ వినియోగదారులు ఫిర్యాదులు చేశారు.అయినప్పటికీ, యాపిల్ షేరు ఆ తర్వాత భారీగా పుంజుకుంది. 2011 ఆగస్టు నాటి ధర పరిధిలోని దిగువ స్థాయి నుంచి తాజా ముగింపు ధర 319.70 డాలర్లకు చేరే వరకు షేరు ఏకంగా 2,763 శాతం పెరిగింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ



రికార్డు స్థాయిలో 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది.ఎంసిరీస్ చిప్‌లతో కొత్త మలుపు2020 ప్రారంభం వరకు, కరోనా మహమ్మారి ప్రారంభానికి ముందు, యాపిల్ షేరు సుమారు 6070 డాలర్ల వద్ద ఉండేది. అదే సమయంలో కంపెనీ సొంతంగా అభివృద్ధి చేసిన ఎంసిరీస్ ప్రాసెసర్లను మార్కెట్లోకి తీసుకురావడం మరో కీలక మలుపుగా నిలిచింది.ఎం1 చిప్‌తో వచ్చిన మ్యాక్‌బుక్ ఎయిర్, మ్యాక్‌బుక్ ప్రో ల్యాప్‌టాప్‌లు మార్కెట్లో సంచలనం సృష్టించాయి. ఎఆర్ఎం ఆర్కిటెక్చర్‌పై ఆధారపడిన ఈ ల్యాప్‌టాప్‌లు తేలికగా, పలుచగా ఉండటంతో పాటు అత్యుత్తమ బ్యాటరీ బ్యాకప్‌ను అందించాయి. దీంతో ఆయా విభాగాల్లో యాపిల్ ఆధిపత్యం మరింత బలపడింది. అదే సమయంలో మ్యాక్ కంప్యూటర్ల విషయంలో ఇంటెల్ చిప్‌లపై ఆధారపడటానికి కూడా కంపెనీ స్వస్తి పలికింది.2021 ఆగస్టు నాటికి యాపిల్ షేరు 150 డాలర్ల స్థాయికి చేరింది. అంటే టిమ్ కుక్ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన తొలి పదేళ్లలోనే షేరు ధర 13 రెట్లకు పైగా పెరిగింది.ఐఫోన్ తయారీదారు ఇతర ఉత్పత్తులపైనా దృష్టి సారించాడు.

వాణిజ్యం



# ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరుకున్నాం
### -కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**చికాగో,ఆగస్టు 30:** ద్రవ్యలోటు లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా చేరుకుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. రుణాలు, అప్పుల స్థాయిపై వ్యక్తమవుతున్న ఆందోళనల నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో భారత్ ద్రవ్యలోటు స్థూల దేశీయోత్పత్తి లో 4.4 శాతంగా నమోదైంది. ఇది రూ.15.19 లక్షల కోట్లకు సమానం. ఫిబ్రవరిలో సవరించిన అంచనాల్లో నిర్దేశించిన మొత్తంలో ఇది 97.5 శాతంగా ఉంది.అమెరికా పర్యటనలో భాగంగా చికాగోలో భారతీయ ప్రవాసులతో మాట్లాడిన సీతారామన్ మాట్లాడుతూ ద్రవ్యలోటుపై మేము నిర్దేశించుకున్న ఆర్థిక క్రమశిక్షణ మార్గాన్ని పూర్తిచేశాం. సామాజిక సంక్షేమ పథకాలకు కేటాయించే నిధులను తగ్గించకుండా, మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వ మూలధన వ్యయాన్ని తగ్గించకుండా ఈ లక్ష్యాన్ని సాధించినట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం దృష్టి దేశ అప్పుజిడిపి నిష్పత్తిని 2030 నాటికి 50 శాతానికి తగ్గించడంపైనే ఉందని సీతారామన్ చెప్పారు. పలు అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ నిష్పత్తి 200 శాతానికి పైగా ఉన్న విషయాన్ని ఆమె ప్రస్తావించారు.ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణపై ప్రపంచానికి ఉన్న విశ్వాసాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ దెబ్బతీయబోమని ఆమె అన్నారు. దీనివల్ల భారత్ క్రెడిట్ రేటింగ్‌లు కూడా మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. రష్యాఉక్రెయిన్ యుద్ధం, టారిఫ్ వివాదాలు, హర్ముజ్ జలసంధిలో అడ్డంకులు వంటి ప్రపంచ సవాళ్లు ఎదురైనప్పటికీ భారత్ 7 శాతం లేదా అంతకంటే ఎక్కువ వృద్ధిని కొనసాగించిందని సీతారామన్ తెలిపారు. అంతర్జాతీయ యూరియా ధరలు ఒక్కో బస్తాకు రూ.300 నుంచి రూ.3వేలు అంటే పది రెట్లు పెరిగాయని సీతారామన్ చెప్పారు. అదనపు భారాన్ని ప్రభుత్వం భరించి, ఒక్కో బస్తాకు రూ.2,700 సబ్సిడీ అందించిందని వివరించారు. ప్రపంచంలోని పలు అస్థిర సముద్ర మార్గాల్లో ప్రయాణించే నౌకలకు బీమా కవరేజీని అంతర్జాతీయ బీమా సంస్థలు ఉపసంహరించుకోవడంతో షిప్పింగ్ కంపెనీలకు బీమా ప్రీమియంలు భారీగా పెరిగాయని ఆమె చెప్పారు.

# టాప్10 సంస్థల్లో ఏడింటి మార్కెట్ విలువలు పతనం

**ముంబయి, ఆగస్టు 30:** దేశంలో అత్యంత విలువైన టాప్10 కంపెనీల్లో ఏడు సంస్థల సమిష్టి మార్కెట్ విలువ గత వారం రూ.1.13 లక్షల కోట్ల మేర క్షీణించింది. ప్రధానంగా భారతి ఎయిర్‌టెల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువలో భారీ క్షీణత నమోదైంది. ఈక్విటీ మార్కెట్లలో కొనసాగిన బేరిష్ ట్రెండ్ ఇందుకు కారణమైంది.గత వారం బీఎస్ఈ సెన్సెక్స్ 276.32 పాయింట్లు లేదా 0.35 శాతం తగ్గగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 76.35 పాయింట్లు లేదా 0.31 శాతం క్షీణించింది. ప్రపంచ వడ్డీ రేట్లపై ఆందోళనలు, భౌగోళిక రాజకీయ అనిశ్చితి, కొత్త క్లోజింగ్ ఆక్షన్ సెషన్ చుట్టూ నెలకొన్న అస్థిరత కారణంగా ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీనపడింది. దీంతో భారత ఈక్విటీ మార్కెట్లు అప్రమత్త ధోరణితో వారాన్ని ముగించాయి. ఇటీవల ప్రారంభమైన కరెక్షన్




దశ కూడా కొనసాగింది. అని రిలయన్స్ బ్రోకింగ్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (రీసెర్చ్) అజిత్ మిశ్రా తెలిపారు. భారతి ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ.40,500.85 కోట్లు తగ్గి రూ.11,74,462.30 కోట్లకు చేరింది.రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.40,056.32 కోట్లు క్షీణించి రూ.17,38,119.27 కోట్లకు పడిపోయింది.హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలువ రూ.11,558.35 కోట్లు తగ్గి రూ.11,09,600.70 కోట్లకు చేరింది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ విలువ రూ.10,086.05 కోట్లు తగ్గి రూ.6,70,535.57 కోట్లుగా నమోదైంది.ఎల్అండ్‌టీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6,473.45 కోట్లు తగ్గి రూ.5,55,987.49 కోట్లకు చేరగా, ఎల్ఐసీ విలువ రూ.3,162.50 కోట్లు తగ్గి రూ.5,32,817.81 కోట్లకు పడిపోయింది.హిందుస్థాన్ యూనిలీవర్ మార్కెట్ విలువ స్వల్పంగా రూ.1,550.73 కోట్లు తగ్గి రూ.4,72,361.83 కోట్లకు చేరింది. మరోవైపు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మార్కెట్ విలువను పెంచుకున్నాయి.టీసీఎస్ మార్కెట్ విలువ రూ.16,643.20 కోట్లు పెరిగి రూ.8,48,079.71 కోట్లకు చేరింది.ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.4,475.28 కోట్లు పెరిగి రూ.10,22,805.73 కోట్లకు చేరగా, ఎస్‌బీఐ విలువ రూ.599.99 కోట్లు పెరిగి రూ.9,65,568.75 కోట్లుగా నమోదైంది.మార్కెట్ విలువ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ మొదటి స్థానంలో కొనసాగుతోంది. ఆ తర్వాత భారతి ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టూబ్రో, ఎల్ఐసీ, హిందుస్థాన్ యూనిలీవర్ వరుస స్థానాల్లో ఉన్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.